## భారతీయ కళ.. ప్రదర్శన భళా



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో శనివారం ఏర్పాటు చేసిన భారతీయ కళా మహోత్సవ్ ఈశాన్య రాష్ట్రాల సంస్కృతులను కళ్లకు కట్టింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ ఉత్సవాన్ని ప్రారంభించి.. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన మగ్గంపై స్వయంగా నేశారు. అంతకుముందు శామీర్‌పేటలోని నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.



రాష్ట్రపతి చేతుల మీదుగా పది బంగారు పతకాలు అందుకుంటున్న బీఏ ఎల్ఎల్‌బీ విద్యార్థి భవ్య జోహారి



ముఖ్యమంత్రి చేతుల మీదుగా బంగారు పతకం అందుకుంటున్న విద్యార్థి

## ప్రకృతి వనం.. పల్లెకు బలం

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా పెంచుతున్న పల్లె ప్రకృతి వనాలతో కార్బన్ క్రెడిట్స్ పొందేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయించింది. వీటితో కార్బన్ ఫైనాన్సింగ్‌ను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఐదేళ్లుగా పెంచుతున్న మొక్కలు.. చెట్ల ద్వారా వాతావరణంలో వచ్చిన మార్పులు లెక్కించేందుకు నగరానికి చెందిన అయోరా ఎకోలాజికల్ సొల్యూషన్స్‌కు బాధ్యతలు అప్పగించింది. పైలెట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి జిల్లాలో సర్వే చేపట్టాలని కేంద్ర గ్రామీణావృద్ధిశాఖ అధికారులు కలెక్టర్ శశాంకకు లేఖ పంపించారు. ఈ మేరకు జిల్లాలోని యాచారం, నందిగామ సహ మరో నాలుగు మండలాల్లో అయోరా సంస్థ ప్రతినిధులు, యాచారంలో సర్వే నిర్వహించారు. మరికొద్ది రోజులు సర్వే కొనసాగనుందని అధికారులు తెలిపారు.

ఈనాడు, హైదరాబాద్, యాచారం, న్యూస్‌టుడే

• ఐదేళ్లలో పెరిగిన పచ్చదనంపై కార్బన్ క్రెడిట్స్ సర్వే
• తద్వారా వచ్చే లాభాలతో గ్రామాల్లో అభివృద్ధి

మొక్కలు, చెట్ల ద్వారా ఎంతమేర పచ్చదనం పెరిగిందని లెక్కించేందుకు అయోరా సంస్థ కొన్ని ప్రామాణికాలను పాటిస్తోంది. ఐదేళ్లక్రితం నాటిన మొక్కలు ప్రస్తుత దశ, ఆ చెట్టు ద్వారా విడుదలవుతున్న ఆక్సిజన్, ఎత్తు, తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. మూడేళ్లలో రంగారెడ్డి జిల్లాలో 2.3 కోట్ల మొక్కలు నాటారు. వాటిల్లో యాభైశాతం వరకూ చెట్లుగా ఎదిగాయి. వీటిలో ప్రతి చెట్టు వివరాలను అయోరా ప్రతినిధులు రికార్డు చేస్తున్నారు. నాలుగు మండలాల్లోని 12 ప్రాంతాల్లో 68వేల చెట్ల వివరాలను రికార్డు చేశారు.



చెట్టు కొలత చూస్తున్న అధికారి

### కార్బన్ ఫైనాన్సింగ్..

పర్యావరణ పరిరక్షణ కోసం క్యోటో దేశంలో ప్రపంచదేశాలు అంగీకరించిన ఒప్పందం అనంతరం కార్బన్ క్రెడిట్స్ వ్యాపారం రూ.కోట్లలోనే కొనసాగుతోంది. కార్బన్ క్రెడిట్స్ బ్యాంకులను నిర్వహించేందుకు ప్రపంచంలో వివిధ కన్సల్టెన్సీలు పనిచేస్తున్నాయి. వర్చువల్ పద్ధతిలో డాలర్లు ఆయా దేశాలకు బదిలీ చేస్తున్నాయి. ఇక తెలంగాణలో సర్వే పూర్తయ్యాక కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నుంచి పర్యావరణ మంత్రిత్వశాఖ వాటిని తీసుకుని కార్బన్ క్రెడిట్స్‌ను ఇతర దేశాలకు విక్రయించనుంది. కార్బన్ ఫైనాన్సింగ్ పేరుతో కొనసాగే లావాదేవీల ద్వారా వచ్చే లాభాలను ఆయా పంచాయతీలకు తిరిగివ్వనుంది. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టే అవకాశాలున్నాయి. రంగారెడ్డి జిల్లాలో సర్వే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో మిగిలిన జిల్లాల్లో చేపట్టనున్నారు.



యాచారం పరిధి చౌదరిపల్లిలో చెట్లను పరిశీలిస్తున్న మండల అధికారులు, అయోరా ప్రతినిధులు

## హిమాయత్‌సాగర్ గేట్లు మూసివేత

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హిమాయత్‌సాగర్ జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగుముఖం పట్టడంతో గేట్లను మూసివేసినట్లు అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వరద తగ్గినందున హిమాయత్ సాగర్ 2 గేట్లు మూసివేసినట్లు పేర్కొన్నారు. ఉస్మాన్‌సాగర్‌కు ఇంకా 250 క్యూసెక్కుల వరద కొనసాగుతోందన్నారు. దీంతో 2 గేట్లు ద్వారా 242 క్యూసెక్కులు మూసీలోకి వరద నీటిని వదిలినట్లు తెలిపారు.



## ఐఏఎస్ యాప్ రూ.కోటితో జంప్

• సులువుగా డబ్బు సంపాదనంటూ వల..
• తలకొండపల్లి మండలంలో 700 మంది బాధితులు

తలకొండపల్లి, న్యూస్‌టుడే: పరవాణితో వీడియోలు చూస్తూ డబ్బు సంపాదించవచ్చునంటూ ఓ యాప్‌లో వందల మంది చేరి రూ.కోటికి పైగా మోసపోయిన సంఘటన రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో వెలుగులోకి వచ్చింది. మండలంలోని వెల్జాల్ గ్రామంలో ఐఏఎస్ (ఐడియన్ అడ్వర్టైజింగ్ సొల్యూషన్స్) యాప్ నుంచి సులువుగా డబ్బు సంపాదించవచ్చునని వందలాది రూ.2200, రూ.5500, రూ.18,800 ఇలా మూడు విధాలుగా డబ్బులు చెల్లించారు. యాప్‌లో వచ్చే వీడియోలను లైక్ చేసి స్క్రీన్‌షాట్ అప్‌లోడ్ చేస్తే వారి వాలెట్‌లో రూ.660 జమ చేశారు. కొందరికి మొదట్లో డబ్బు రావడంతో ఎక్కువ మంది ఆసక్తి కనబరచారు. స్మార్ట్ ఫోను ఉన్న వారిలో ఎక్కువ మంది రూ.18,800 ఆన్‌లైన్‌లో చెల్లించి చేరారు. వీరికి ఒక్కరిని యాప్‌లో చేర్పిస్తే అంతే మొత్తం జమ కావడంతో పాటు చేర్పిన వారికి రూ.22 వేలను వాలెట్‌లో జమ చేశారు. ఈ ఆఫర్లకు ఎక్కువగా ఆకర్షితులై ఒక ఇంట్లోనే భార్య, భర్త, పిల్లలతో పాటు బంధువులను ఐఏఎస్ యాప్‌లో చేర్చారు. తీరా 20 రోజుల నుంచి ఈ యాప్ పని చేయడం లేదు. వెల్జాల్ గ్రామంలోనే 500మంది రూ.కోటికిపైగా నష్టపోగా.. అంతారం, మాదాయపల్లి, చౌదర్‌పల్లి, వెంకటాపూర్, చెన్నంపల్లి, పడకల్ గ్రామాల్లో మరో 200 మంది రూ.50 లక్షల వరకు మోసపోయారు. శంషాబాద్‌లో ఉన్న ఐఏఎస్ కార్యాలయానికి తాళం వేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

## మూసీ ఆక్రమణలపై దూకుడొద్దు

• నిర్వాసితులకు సంపూర్ణ చేయూత ఇచ్చేందుకు సర్కారు నిర్ణయం
• సమీపంలోనే రెండు పడక గదుల ఇళ్లు

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, ఈనాడు, హైదరాబాద్, చంపల్‌గూడ, న్యూస్‌టుడే: మూసీలో ఆక్రమ నిర్మాణాల ఖాళీ వేళలపై ఎటువంటి తొందరపాటు ప్రదర్శించరాదని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రతి బాధిత కుటుంబంతో మాట్లాడి ఒప్పించిన తరవాతే నిర్వాసితులను అక్కడి నుంచి ఖాళీ చేయించాలని పేర్కొంది. దీంతో మూడు జిల్లాల కలెక్టర్లు మూసీలోని నిర్వాసితుల ఇళ్లకు స్వయంగా వెళ్లి మాట్లాడుతున్నారు. నిర్వాసితులకు ఇళ్లను కేటాయిస్తూ సమీపంలోనే రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని తాజాగా సర్కారు నిర్ణయించింది. హిమాయత్‌నగర్, అంబర్‌పేట, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల్లోని కుటుంబాలకు జియాగూడ, పిల్లి గుడిసెలు, నార్సింగి ప్రాంతాల్లో ఇళ్లు కేటాయించాలని రెండు జిల్లాల కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, కె.శశాంకలకు సూచించింది. దీంతో వారు శనివారం ఆయా ప్రాంతాల్లోని డబుల్ ఇళ్లను గుర్తించి మూసీ నిర్వాసితులకు కేటాయించారు. మలక్‌పేట ఎమ్మెల్యే బలాలతో కలిసి కలెక్టర్ అనుదీప్ చాదర్‌ఘాట్ మూసానగర్, వినాయక వీధి బస్తీల్లో పర్యటించారు. నిర్వాసితుల ఉపాధి విషయంలోనూ ప్రభుత్వం చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని వారు తెలిపారు. కాగా ఇళ్లు ఖాళీ చేసి కొత్త ప్రాంతాలకు వచ్చిన తమకు ఎలాంటి ఉపాధి అవకాశాలు లేవని కొందరు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తంచేశారు.



చాదర్‌ఘాట్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ అనుదీప్, మలక్‌పేట ఎమ్మెల్యే బలాల

## సమయమిద్దాం.. ఆపై అడుగేద్దాం

ఆక్రమణల తొలగింపులో ఇకపై ఆచితూచి అడుగేయాలని హైడ్రా నిర్ణయించింది. పెద్దల భారీ ఆక్రమ భవనాలపై ఉక్కుపాదం మోపాలని, సామాన్యుల విషయంలో ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసిన తరువాతే కూల్చివేతపై నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. హైడ్రా మీద విమర్శలు పెరిగిన ఈనేపథ్యంలో వారం, పదిహేను రోజుల ముందే నోటీసులు ఇచ్చిన తరువాతే కూల్చివేతలు చేపట్టాలని, ఏ జోన్‌లో ఉన్నా పేదల ఇళ్ల విషయంలో దూకుడుగా వెళ్లకూడదని నిర్ణయించింది. ఇదే సమయంలో ఎఫ్‌టీఎల్‌లో రెండు సర్వేలు నిర్వహించిన అపార్ట్‌మెంట్ల విషయంలో కఠినంగా వ్యవహరించాలని హైడ్రా భావిస్తోంది.



## చెత్త ఆటోలకు జీపీఎస్



ఈనాడు, హైదరాబాద్: గాడి తప్పిన పారిశుద్ధ్యాన్ని పట్టాలెక్కించేందుకు జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం తీసుకుంది. చెత్త ఆటోలన్నింటికీ జీపీఎస్ పరికరాలు అమర్చింది. ఆటోల కదలికలను జడ్సీలు, డీసీలు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ఎప్పటికప్పుడు తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది.

### 4,400 ఆటోలకు అమరిక

జీహెచ్ఎంసీ 4,500 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేసి.. వాటిని వ్యర్థాల సేకరణలో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న కుటుంబీకులకు ఇచ్చింది. దాదాపు 20శాతం ఆటోలు బాధ్యతను విస్మరించాయి. ఇంటింటి చెత్త సేకరణను గాడిలో పెట్టాలని కమిషనర్ ఆమ్రపాలి యంత్రాంగాన్ని ఆదేశించారు. దీంతో ఐటీ విభాగం అదనపు కమిషనర్ స్నేహశబరీష్, పారిశుద్ధ్య విభాగం అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌లు ఆటోలన్నింటికీ జీపీఎస్ పరికరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు 4,400 ఆటోలకు జీపీఎస్ పెట్టామని, పరికరాలను ఎవరైనా తొలగిస్తే.. ఆటోలను స్వాధీనం చేసుకోవాలని యంత్రాంగం హెచ్చరించింది.





## చిన్ని గుండెలకు భరోసానిద్దాం



బంజారాహిల్స్: చిన్నారుల గుండెలకు భద్రతను కల్పించాలని సినీ హీరో సాయి దుర్గాతేజ్ అభిప్రాయపడ్డారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా పుట్టుకతో వచ్చే గుండె జబ్బుల గురించి అవగాహన కల్పించేందుకు బంజారాహిల్స్‌లోని ప్యూర్ లిటిల్ హార్ట్స్ ఫౌండేషన్‌ఆధ్వర్యంలో శనివారం రెయిన్‌బో హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో వేడుకలు నిర్వహించారు. హృద్రోగ చికిత్సలు చేయించుకున్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. దుర్గాతేజ్ మాట్లాడుతూ.. ఫౌండేషన్‌కు రూ.5 లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. లారస్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, సీఈవో సత్యనారాయణ సంస్థ తరఫున రూ.25లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

## ఆర్థిక ఇబ్బందులతో తల్లీ కుమారుడు ఆత్మహత్య

బౌద్ధనగర్: రెండేళ్ల కిందట ఇంటి పెద్ద చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులు, ఇతర సమస్యలతో తల్లీకుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వారాసిగూడ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన నంపరి లక్ష్మణ్‌రావు, జయలక్ష్మి(63) దంపతులు. లక్ష్మణ్‌రావు విశ్రాంత బ్యాంకు ఉద్యోగి. 2020లో చనిపోయారు. వీరికి కుమార్తె (వివాహిత), కుమారుడు రవికాంత్ (36)ఉన్నారు. తండ్రి చనిపోయిన నాటి నుంచి ఆర్థిక సమస్యలు పెరిగాయి. దీంతో అప్పులపాలయ్యాడు. అప్పటికే బంధువులతో సంబంధాలు తగ్గిపోయాయి. రవికాంత్ ప్రైవేటు ఉద్యోగం చేసి వదిలేశాడు. సమస్యలతో మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో తల్లీకుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

## ఆరు కూడళ్లు.. రూ.826 కోట్లు

• కేబీఆర్ పార్కు చుట్టూ.. పైవంతెనలు, అండర్‌పాస్‌లు • రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరిన జీహెచ్ఎంసీ

కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ కష్టాలు త్వరలో పరిష్కారం కానున్నాయి. దాదాపు ఆరు కూడళ్లలో రూ.826 కోట్లతో జీహెచ్ఎంసీ భారీ ప్రాజెక్టును రూపొందించింది. పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణంతో కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న దారులు రూపురేఖలను మార్చేందుకు సిద్ధమైంది. ఇటీవలే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో అనుమతి రానుందని కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు హెచ్-సిటీ ప్రాజెక్టు కింద, రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టనున్నామన్నారు.

### ప్యాకేజీ-1లో రూ.421 కోట్లతో..

**జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు కూడలిలో..**

1. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఇంటికి వెళ్లే రోడ్డు నుంచి కూడలి మీదుగా 'వై' ఆకారంలో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదన. రోడ్డు నెం.45 నుంచి కేబీఆర్ పార్కు రోడ్డుకు(ఎన్టీఆర్ భవన్ వైపు), మరొకటి నేరుగా యూసఫ్‌గూడ రోడ్డుకు.
2. కేబీఆర్ పార్కు రోడ్డు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెం.36కు నాలుగు లైన్ల పైవంతెన
3. యూసఫ్‌గూడ వైపు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెం.45వైపు వెళ్లేందుకు రెండు లైన్ల పైవంతెన





### కేబీఆర్ పార్కు గేటు జంక్షన్..

1. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు కూడలి నుంచి క్యాన్సర్ ఆస్పత్రి వైపు వెళ్లేందుకు రెండు లైన్ల భూగర్భ మార్గం
2. ఐనాక్స్ మల్టీప్లెక్స్ (ఎల్బీప్రసాద్ ఆస్పత్రి ఎదురుగా) నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు 3లైన్ల పైవంతెన

### ప్యాకేజీ-2లో రూ.405 కోట్లు..

**రోడ్డు నెం.45 కూడలిలో..**

1. ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లేలా భూగర్భ మార్గం
2. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి రోడ్డు నెం.45 వైపు వెళ్లేలా 2 లైన్ల పైవంతెన

### ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో..

1. అపోలో ఆస్పత్రి రోడ్డు నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నం.45వైపు వెళ్లేలా 2 లైన్ల భూగర్భ మార్గం
2. ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి మహారాజ అగ్రసేన్ కూడలి వైపు 2 లైన్ల పైవంతెన

### మహారాజ అగ్రసేన్ కూడలిలో..


1. క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్‌నగర్ వైపు సాగేలా 2 లైన్ల అండర్‌పాస్
2. ఫిల్మ్‌నగర్ కూడలి నుంచి జూబ్లీహిల్స్ రోడ్డు నెం.12వైపునకు 2 లైన్ల పైవంతెన

### క్యాన్సర్ ఆస్పత్రి జంక్షన్ వద్ద

1. కేబీఆర్ పార్కు గేటు వైపు నుంచి మహారాజ అగ్రసేన్ కూడలి వైపు వెళ్లేలా 2 లైన్ల అండర్‌పాస్
2. మహారాజ అగ్రసేన్ కూడలి నుంచి బంజారహిల్స్ రోడ్డు నెం.10 వైపు 2 లైన్ల పైవంతెన

ఈనాడు, హైదరాబాద్







## ఇన్‌స్టాలో పరిచయం.. గదికి రప్పించి అఘాయిత్యం

యూసుఫ్‌గూడ: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మహిళపై అఘాయిత్యం చేసిన సంఘటన మధురానగర్ ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన మహిళ(30) అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తోంది. ఈ ఏడాది జూన్‌లో భర్తతో విడాకులు తీసుకుంది. ఇటీవల ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో శశికిరణ్‌రెడ్డి పరిచయం అయ్యాడు. తనకు మూవీ కార్యాలయం ఉందని అందులో పనిచేయాలని చెప్పాడు. ఈనెల 27న రాత్రి మధురానగర్‌లోని తన గదికి రావాలని శశికిరణ్‌రెడ్డి చెప్పడంతో అక్కడికి వెళ్లింది. ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎలాగోలా గది నుంచి బయట పడింది. విషయం రెండో అంతస్తులోని వారికి చెప్పడంతో వారు 100కు డయల్ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జైల్లో నేరస్థుడితో సావాసం.. తుపాకుల వ్యాపారం

• మహారాష్ట్ర నుంచి ఆయుధాలు తెప్పించి నగరంలో విక్రయాలు
• నిందితుడి అరెస్టు.. ఏడు దేశవాళీ తుపాకులు, తూటాలు స్వాధీనం

ఈనాడు- హైదరాబాద్: తన అవసరాలు, జల్సాలకు డబ్బు సరిపోదని భావించిన చిల్లర దొంగ ఏకంగా తుపాకుల వ్యాపారంలోకి దిగాడు. దొంగతనాలు చేసి జైల్లో ఉన్నప్పుడు ఓ నేరస్థుడితో సాన్నిహిత్యం పెంచుకుని అంతర్రాష్ట్ర ముఠాతో లింకు పెట్టుకున్నాడు. ఎల్బీనగర్‌లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఏపీలోని కాకినాడ పట్టణం మధురానగర్‌కు చెందిన బొల్లింకల సాయిరామ్‌రెడ్డి ఓ ఇంట్లో చోరీ చేయడంతో జైలుకెళ్లాడు. బయటకొచ్చిన తర్వాత హైదరాబాద్‌కు వచ్చి అమెజాన్ సంస్థ నాగోల్ విభాగంలో నాలుగు నెలలు పనిచేశాడు. డబ్బు సరిపోవడం లేదని ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ ఇంట్లో చోరీ చేసి పోలీసులకు పట్టుబడి చర్లపల్లి జైలుకెళ్లాడు. అప్పటికే ఓ కేసులో జైల్లో ఉన్న మహారాష్ట్రకు చెందిన నేరగాడు.. సాయిరామ్‌రెడ్డికి పరిచయమయ్యాడు. పుణెకు సమీపంలోని కడక్‌వాస్లా ప్రాంతంలో తుపాకులు విక్రయిస్తారని తెలుసుకున్నాడు. జైలు నుంచి బయటకొచ్చి నేరస్థుడు ఇచ్చిన వివరాల ఆధారంగా గుర్తుతెలియని వ్యక్తిని సంప్రదించాడు. అతడి ద్వారా మహారాష్ట్ర నుంచి ఏడు తుపాకులు, 11 తూటాలు తెప్పించాడు. ఒక్కో తుపాకీ రూ.20 వేలకు కొన్నాడు. శుక్రవారం సాయంత్రం నేరేడ్‌మెట్ పరిధిలోని ఆర్కేపురం ప్రాంతంలో ఉండగా.. మల్కాజిగిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ జానయ్య బృందం సాయిరామ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా తుపాకులు, తూటాలు లభించాయి. వెంటనే అతడిని నేరేడ్‌మెట్ పోలీసులకు అప్పగించారు.





స్వాధీనం చేసుకున్న తుపాకుల్ని చూపిస్తున్న కమిషనర్ సుధీర్‌బాబు, ఎస్‌వోటీ డీసీపీ రమణారెడ్డి

# ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట



పరీక్షలు చేయించుకుంటున్న రంగారెడ్డి

## పేదల అభ్యున్నతే ప్రధాని మోదీ ధ్యేయం

వనస్థలిపురం, న్యూస్‌టుడే: దేశంలోని పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రధాని మోదీ అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని భాజపా రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. వనస్థలిపురం సాహెబ్‌నగర్ శ్రీనేత్ర ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకుని, శిబిరాన్ని ప్రారంభించారు. ప్రజలంతా తమవంతుగా నెలకు ఒకసారి సేవాకార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, భాస్కరరావు, జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అంజన్‌కుమార్ గౌడ్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆర్టిజన్లను క్రమబద్ధీకరించండి



సౌత్ సర్కిల్ కమిటీ నూతన కార్యవర్గం

సైదాబాద్, న్యూస్‌టుడే: విద్యుత్ విభాగం సౌత్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 700 మంది ఆర్టిజన్లను క్రమబద్ధీకరించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ వికాస్ ఛైర్మన్ కె.ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మలక్‌పేటలో శనివారం సౌత్ సర్కిల్ (అస్మాన్‌గఢ్, చార్మినార్, బేగంబజార్) ఆర్టిజన్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్టిజన్ కన్వర్షన్ వికాస్ సౌత్ సర్కిల్ ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. ఛైర్మన్‌గా ఎం.రాము, కన్వీనర్‌గా సీహెచ్ సుభాష్, కో-ఛైర్మన్లుగా ఎస్.సురేశ్ గౌడ్, కె.మహేందర్, కో-కన్వీనర్లుగా మహమ్మద్ జైనుల్ షరీఫ్, టి.మహేందర్, సయ్యద్ మోయిన్, లక్ష్మీనారాయణ, కోశాధికారిగా సూరజ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ముజఫర్, పి.శ్రీనివాస్ నియమితులయ్యారు.

## నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ

బండ్లగూడ: బండ్లగూడలోని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నారు. ఎలక్ట్రికల్, సోలార్, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బ్యూటీషియన్ వంటి రంగాల్లో శిక్షణ ఉంటుంది. వివరాలకు 72880 63324.

## చెత్త సేకరణ రిక్షాల పంపిణీ

ఎల్బీనగర్, వనస్థలిపురం: శ్రీరామ్‌నగర్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య సిబ్బందికి చెత్త సేకరణ రిక్షాలు పంపిణీచేశారు. ● బీఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని కార్మికులకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి, పారిశుద్ధ్య విభాగం డీఈ నీలిమలు చెత్త సేకరణ రిక్షా అందజేశారు.

## ప్రగతి పనులకు శంకుస్థాపన

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డి నగర్ ఫేజ్-1 పార్కులో రూ.21 లక్షల వ్యయంతో ఓపెన్ జిమ్, పిల్లల ఆటవస్తువుల ఏర్పాటు పనులకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. దాసాంజనేయ ఆలయ ఛైర్మన్ ప్రదీప్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, సెక్రటరీ ధనరాజ్, ఉపాధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

## చంపాపేట అభివృద్ధికి పెద్దపీట

కర్మన్‌ఘాట్: ప్రత్యేక నిధులు మంజూరు చేయించి చంపాపేట డివిజన్ అభివృద్ధికి పెద్దపీట వేస్తామని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలో రూ.2.54 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. అధికారులు, కాలనీ ప్రతినిధులతో కలిసి శనివారం ఆయా కాలనీల్లో జరుగుతున్న పనులు పరిశీలించారు.

## రక్తదాన శిబిరం

మూసారాంబాగ్: దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీసాయి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంజీవని బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. దిలీప్‌రెడ్డి, శ్రీనివాసాచార్యులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ బాపూజీ ఆశయసాధనకు కృషి

ఎల్బీనగర్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ స్టేట్ బీసీ అడ్వకేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి కృష్ణ అన్నారు. శనివారం బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి కొండా లక్ష్మణ్ బాపూజీ, చాకలి ఐలమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. కొండారెడ్డి, జి.కృష్ణ, సదానందం, భిక్షమయ్య, రవీందర్, మహేశ్ పాల్గొన్నారు.

## బహుమతుల ప్రదానం

అక్బర్‌బాగ్: ఆరో సెమిస్టర్ ఉత్తీర్ణత సాధించిన శ్రీవాణి డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థులకు శనివారం గ్రాడ్యుయేషన్స్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

## కార్యకర్తలకు తగిన గుర్తింపు

నాగోలు: కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన పన్యాల జైపాల్‌రెడ్డిని శనివారం చైతన్యపురిలోని తన కార్యాలయంలో సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా లింగోజిగూడ నుంచి చైతన్యపురి వరకు కాంగ్రెస్ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు.

# శిథిలావస్థలో శాఖా గ్రంథాలయం

### నిధులున్నా.. భవన నిర్మాణంలో నిర్లక్ష్యం

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: వనస్థలిపురం శాఖా గ్రంథాలయం శిథిలావస్థకు చేరడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతికేళ్ల కిందట స్థానికంగా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో పక్కా భవనం అందుబాటులో లేకపోవడంతో స్థానిక ఎన్‌జీవోస్ కాలనీ సంక్షేమ సంఘ భవన ప్రాంగణంలోని రేకుల షెడ్డును తాత్కాలికంగా కేటాయించారు. తాత్కాలికంగా కేటాయించిన ఈ రేకుల షెడ్డులోనే నేటికీ గ్రంథాలయం నడుస్తోంది. రేకులు ధ్వంసం కావడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరింది. వేసవిలో ఉక్కపోతతో, వర్షాకాలంలో వర్షపునీటితో పాఠకులకు అవస్థలు తప్పడం లేదు.

నిత్యం వచ్చే పాఠకులు: సుమారు 100-120 మంది

గ్రంథాలయంలో పుస్తకాలు: 4,200కు పైగా..



గదుల లోపల ధ్వంసమైన రేకులు..

### నిధులు విడుదలైనా..

గతంలో స్థానికంగా సచివాలయంలో విధులు నిర్వహించే ఉద్యోగులు ఎక్కువగా ఉండేవారు. వారే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి గ్రంథాలయాన్ని మంజూరు చేయించుకున్నారు. ఐదేళ్ల క్రితమే 400 గజాల స్థలాన్ని ఎన్‌జీవోస్ కాలనీ హౌసింగ్ సొసైటీ గ్రంథాలయానికి కేటాయించింది. స్థలం సమస్య తీరడంతో గ్రంథాలయ అధికారులు భవన నిర్మాణానికి రూ.60 లక్షలు కేటాయించారు. త్వరలోనే భవన నిర్మాణ పనులు చేపడతామని అప్పట్లోనే ప్రకటించారు. సాంకేతిక సమస్యల పేరిట నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. పాతికేళ్ల కిందట వనస్థలిపురం పరిధిలో రెండు, మూడు కాలనీలే ఉండేవి. కాలక్రమేణా వందకుపైగా కాలనీలు ఏర్పాటయ్యాయి. జనాభా రెండు లక్షలు దాటింది. అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న ఎందరో నేడు విశ్రాంత ఉద్యోగులుగా మారారు. వారంతా కాలక్షేపానికి గ్రంథాలయానికి వస్తున్నారు. అయితే స్థానికంగా వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఇప్పటికైనా నూతన భవనాన్ని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



వనస్థలిపురం శాఖా గ్రంథాలయం

**ఇబ్బందులు ఉన్నాయి..: పద్మ, గ్రంథపాలకురాలు**

పక్కా భవనం లేకపోవడంతో సమస్యలు ఉన్నాయి. వర్షాకాలంలో వాననీరు రేకుల ద్వారా కిందకు పడుతుంది. ఎండాకాలంలో కూర్చునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నూతన భవన నిర్మాణానికి చర్యలు ప్రారంభమయ్యాయి. మట్టి పరీక్షల నిమిత్తం ఇప్పటికే మట్టిని సేకరించారు. త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులు మొదలవుతాయని భావిస్తున్నాం.

## నిర్వాసితులకు అండగా ఉంటా: ఎంపీ ఈటల

నాగోలు, న్యూస్‌టుడే: పేదల ఇళ్లు కూల్చితే.. వచ్చి అడ్డంగా నిలబడతానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రజలకు హామీ ఇచ్చారు. కొత్తపేట, చైతన్యపురి డివిజన్లలోని మూసీ పరివాహక ప్రాంతాలైన సత్యానగర్, న్యూమారుతీనగర్, ఫణిగిరి కాలనీల నిర్వాసితుల కోసం ఆయన శుక్రవారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. 12 గంటల పాటు ఎంపీ భైఠాయించడంతో మూసీ నదీ పరివాహక అభివృద్ధి సంస్థకు చెందిన తహసీల్దార్లు వచ్చి మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేశాకే.. తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో రాత్రి 10.30 తర్వాత ధర్నా విరమించారు. స్థానిక ప్రజలకు అండగా ఉంటానని, కూల్చివేతలు జరిగితే అర్ధరాత్రి ఫోను చేసినా వస్తానని హామీ ఇచ్చారు.



## బస్టాప్‌కు అడ్డుగా బారికేడ్లు



నల్గొండ కూడలి నుంచి చంచల్‌గూడ కూడలి వైపునకు వచ్చే మార్గంలో ప్రభుత్వ ముద్రణాలయం ప్రహరీకి అనుకుని ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్ ఏర్పాటు చేశారు. ఇక్కడే కొంతకాలంగా ఉక్కు వంతెన పనులు కొనసాగుతున్నాయి. అక్కడే బస్టాప్‌కు అడ్డుగా బారికేడ్లు పెట్టారు. బసులు కోసం ఎదురుచూసే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, సైదాబాద్

## అలుగు నిర్మాణం షురూ





నాగోల్ డివిజన్ ఫత్తుల్లాగూడ చెరువు అలుగు పునర్నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. జూలై 18న గుత్తేదారు యంత్రాలతో ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. అప్పట్లోనే స్థానికులు నిలదీశారు. అలుగు ఆధునికీకరణలో భాగంగా కూల్చివేసినట్లు అధికారులు సైతం పేర్కొన్నారు. సమస్యను వివరిస్తూ 'ఈనాడు'లో ఈ నెల 17న 'ఆధునికీకరణ అన్నారు.. అలుగు కూల్చారు' శీర్షికన కథనం ప్రచురించింది. అధికారులు స్పందించి.. శనివారం పునర్నిర్మాణ పనులు ప్రారంభించారు. – న్యూస్‌టుడే, బండ్లగూడ



## ప్రజా న్యాయ పీఠానికి విశేష స్పందన



కేసులు పరిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి, జడ్జిలు పట్టాభిరామారావు, శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: రంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో నిర్వహించిన జాతీయ ప్రజా న్యాయపీఠానికి (లోక్ అదాలత్) విశేష స్పందన లభించింది. సంస్థ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కక్షిదారుల సౌకర్యార్థం జిల్లాలో 33 ప్రజా న్యాయ పీఠం బెంచ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజా న్యాయ పీఠంలో కేసులు పరిష్కరించుకుంటే కలిగే ప్రయోజనాలను ఈ సందర్భంగా న్యాయమూర్తులు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 1,51,000 పైచిలుకు కేసులను పరిష్కరించినట్లు సంస్థ జిల్లా కార్యదర్శి పి.శ్రీదేవి ప్రకటించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డా.పట్టాభిరామారావు, ఇతర న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, పలు బ్యాంకులు, బీమా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హయత్‌నగర్: ఎంతటి జటిల సమస్య అయినా పరస్పర రాజీతో పరిష్కరించుకోవచ్చని హయత్‌నగర్‌లోని 14వ అడిషనల్ మెట్రోపాలిటిన్ కోర్టు న్యాయమూర్తి సల్మా ఫాతిమా అన్నారు. హయత్‌నగర్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,637 కేసులు పరిష్కారమయ్యాయి. 7వ అడిషనల్ జడ్జి సాకేత్ మిత్రా, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్లు నాగరాజు గౌడ్, అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, ఏపీపీ లావణ్య కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ జయంతి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, హయత్‌నగర్, న్యూస్‌టుడే: అతి పిన్న వయసులోనే అన్యాయాలను, అణచివేతలను నిర్భయంగా ఎదిరించిన ధీశాలి భగత్‌సింగ్ అని తెలంగాణ న్యాయవాదుల పరస్పర సహాయక సహకార సంఘం అధ్యక్షుడు పి.శ్రీనాథ్ అన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి గులగారి కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ హాలులో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు సదానందం, మీనాక్షి, మహ్మద్ సమి, వెంకట్‌రాములు, రామ్మూర్తి పాల్గొన్నారు.

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్‌లో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. నాయకులు సామిడి శేఖర్ రెడ్డి, సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, శ్రీదేవి, వెంకట్, వీరన్న, బాలు, ఉపేందర్ పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ప్రారంభం

వనస్థలిపురం: బీఎన్‌రెడ్డినగర్ బృందావన్ విడోస్ కాలనీలో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను శనివారం వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి ప్రారంభించారు. సీసీ కెమెరాలతో నేరాలు నియంత్రణలో ఉంటాయన్నారు. కాలనీ అధ్యక్షుడు శశికాంత్, కార్యదర్శి శివయ్య పాల్గొన్నారు.

## ముగిసిన నృత్య దర్శకుడు జానీ పోలీస్ కస్టడీ



కోర్టు ఆవరణలో జానీ

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: నృత్య దర్శకుడు జానీ పోలీసు కస్టడీ ముగిసింది. నాలుగు రోజుల పాటు విచారించిన నార్సింగి పోలీసులు శనివారం అతడిని రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి హరీశ.. వచ్చే నెల 3 వరకు రిమాండు పొడిగించగా, చంచల్‌గూడ జైలుకు తరలించారు. జిల్లా కోర్టు వద్ద జానీతో అతడి భార్య మాట్లాడారు. కోర్టు బయట విలేకరులు కేసు గురించి ప్రశ్నించగా.. నిందితుడు సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోయారు.

## టీపీసీసీ అధ్యక్షుడికి సత్కారం

కర్మన్‌ఘాట్: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను శనివారం కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ ఛైర్మన్ రఘుమారెడ్డి సత్కరించారు. స్వామి ప్రసాదం అందజేశారు.



### మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

| | |
|---|---|
| ఎల్బీనగర్: 76759 19030 | మలక్‌పేట: 80085 73284 |
| | హయత్‌నగర్: 98336 64897 |
| | కర్మన్‌ఘాట్: 94400 32872 |
| | బండ్లగూడ: 96034 78579 |
| | మూసారాంబాగ్: 79933 00559 |

న్యూస్‌టుడే, కర్మన్‌ఘాట్, సైదాబాద్

? హస్తినాపురం డివిజన్ పరిధి రాజీవ్‌శెట్టి నగర్ రోడ్డు నంబర్-2లో చెత్తను పారబోస్తున్నారు. రాకపోకల సమయంలో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.– శ్రీనివాస్, రాజీవ్‌శెట్టి నగర్

✓ సమస్యను స్థానిక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి, నివారణ చర్యలు చేపడతాం. రోడ్డుపై చెత్త వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం.
– బానోతు సుజాతానాయక్, కార్పొరేటర్, హస్తినాపురం

? సైదాబాద్ ఎల్ఐసీ కాలనీ ఉద్యానం పక్కన చెత్తాచెదారం పేరుకుపోతోంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.- ప్రభాకర్, సైదాబాద్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కార చర్యలు చేపడతాం.
– అనురాధ, ఏఎంవోహెచ్, మలక్‌పేట

## ఆడిపాడి.. సందడి చేసి..





దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఐడియల్ మహిళా డిగ్రీ కళాశాల స్వాగతోత్సవాన్ని 'యువన్- 2024' పేరిట శనివారం హస్తినాపురం పరిధిలోని ఓ వేడుకల మందిరంలో నిర్వహించారు. విద్యార్థినుల నృత్య, కూచిపూడి ప్రదర్శనలు, నాటికలు ఆకట్టుకున్నాయి. – న్యూస్‌టుడే, మూసారాంబాగ్

## మహిళల కొవ్వొత్తుల ర్యాలీ



నాగోలు, న్యూస్‌టుడే: హైడ్రాకు కనువిప్పు కలగాలంటూ కొత్తపేట, చైతన్యపురి డివిజన్ల మూసీ పరివాహక ప్రాంత నివాసిత మహిళలు శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. హైడ్రాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, కూల్చివేతలు ఆపాలని కోరారు.

## కుమారుడి వద్దకు వచ్చిన తండ్రి అదృశ్యం

సైదాబాద్, న్యూస్‌టుడే: కుమారుడి వద్దకు వచ్చి ఉంటున్న ఓ తండ్రి కనిపించకుండా పోయిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా గొల్లప్రోలు ప్రాంతానికి చెందిన చితారపు అగ్గియ్య (51) దినసరి కూలి. సలీమ్‌నగర్‌లో ఉంటున్న కుమారుడు నాగబాబు వద్దకు పది రోజుల క్రితం వచ్చాడు. 26న ఉదయం 8.30 గంటలకు ఇద్దరు మనుమళ్లను తీసుకుని నడుచుకుంటూ స్థానిక స్వామి వివేకానంద సెంటనరీ స్కూల్ వద్దకు వచ్చాడు. ఇద్దరిని పాఠశాలలో వదిలిపెట్టాడు. అనంతరం ఇంటికి చేరలేదు. పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌డీపీఎల్ మద్యంపై ఆబ్కారీ నజర్

ఈనాడు, హైదరాబాద్: విదేశీ, డిఫెన్స్ పేరుతో కల్తీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) విక్రయాలు నగరంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రముఖ బ్రాండ్లు, ఖరీదైన మద్యం సీసాలు సేకరిస్తున్న కొందరు, వాటిలో తక్కువ ధర ఉండే బ్రాండ్ల మద్యం నింపేసి అమ్ముతున్నారు. రాజస్థాన్, చండీగఢ్, గోవా, దిల్లీ, హరియాణాల నుంచి సైతం ఎన్‌డీపీఎల్ భారీగా వస్తోంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే నగర పరిధిలోనే ఎన్‌డీపీఎల్, కల్తీ మద్యం ఎక్కువగా అత్యధికంగా పట్టుబడుతోంది. ఈ ఏడాది ఆబ్కారీ శాఖ అధికారులు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కలిపి 55 కేసుల్లో 1058 లీటర్ల కల్తీ, ఎన్‌డీపీఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక బీదర్‌లో కొన్ని ముఠాలు డిఫెన్స్ పేరుతో నకిలీ మద్యం తయారుచేసి నగరానికి సరఫరా చేస్తున్నాయి. తాజాగా దసరా, వరుస సెలవుల నేపథ్యంలో నకిలీ మద్యం, ఎన్‌డీపీఎల్ రవాణాపై అధికారులు దృష్టి సారించారు. సరిహద్దులతో పాటు వివిధ కీలక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాలని నిర్ణయించారు.

**నిఘా పెంచాం..: – వీబీ కమలాసన్ రెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్**

రాష్ట్రంలోకి ఎన్‌డీపీఎల్ రాకుండా నిఘా పెంచాం. దసరా సందర్భంగా ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. ఇతర రాష్ట్రాలు, డిఫెన్స్ మద్యం విక్రయిస్తామని చెబితే ఆబ్కారీ శాఖ టోల్ ఫ్రీ నంబరు 1800 4252523లో సమాచారమివ్వాలి.

| జిల్లా | కేసులు | నిందితులు | మద్యం (లీ.) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 32 | 13 | 452 |
| రంగారెడ్డి | 23 | 43 | 606 |



మాట్లాడుతున్న వేదకుమార్

## చింత చెట్టూ... నువ్వు గ్రేట్...

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, ఉస్మానియా, న్యూస్‌టుడే: నగరంలో 116 ఏళ్ల క్రితం వచ్చిన వరదల్లో వేలమందిని కాపాడిన చింతచెట్టు.. నువ్వు గ్రేట్ అంటూ ఫోరమ్‌ఫర్ బెటర్ ఏ హైదరాబాద్, సివిల్ సొసైటీ బృందం ప్రతినిధులు అన్నారు. నాటి వరదల సందర్భంగా మృతులను స్మరించుకుంటూ శనివారం ఉస్మానియా ఆసుపత్రి ఆవరణలోని చింతచెట్టు కింద ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఫోరమ్ ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ ఛైర్మన్, అర్బన్ అండ్ రీజినల్ ప్లానర్ వేద కుమార్ అధ్యక్షత వహించారు. జనరల్ సెక్రటరీ శోభసింగ్, సభ్యులు శ్యాంప్రసాద్ రెడ్డి, రమణ నాయక్ ఉస్మానియా డాక్టర్ జైకేసర్, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కవిత, రిటైర్డ్ ఇంజినీర్ల సంఘం కన్వీనర్ శ్యామ్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

## సాన్విలో స్నాతకోత్సవం

చంపాపేటలోని సాన్వి జూనియర్, డిగ్రీ మహిళా కళాశాల విద్యార్థుల స్నాతకోత్సవం, స్వాతంత్ర్యోత్సవం శనివారం ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మానికారెడ్డి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీ గణేష్, ఛైర్మన్ వెంకటరెడ్డి, కళాశాల వ్యవస్థాపకులు అంజిరెడ్డి పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఐఎస్ సదన్



## కూరగాయల ధరలు

మెహిదీపట్నం: రైతుబజార్‌లో(శనివారం నాటి ధరలు, కిలో రూ.ల్లో) టమాటా 47, వంకాయ 35, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, కాకరకాయ 38, బీరకాయ 28, క్యాబేజీ 19, బీన్స్ 55, క్యారెట్ 37, దొండ 35, దిబ్బచిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 65, ఆలుగడ్డ 37, కీర 18, దోసకాయ 28, సొరకాయ 13, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 50, చామగడ్డ 35.

## డీఎస్‌ఆర్‌సీ కౌన్సెలర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: నాంపల్లి ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఖాళీగా ఉన్న డీఎస్‌ఆర్‌సీ కౌన్సెలర్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు పూర్తి వివరాలు, దరఖాస్తుల కోసం ఈ నెల 30 నుంచి అక్టోబర్ 7 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

## మైత్రికమిటీ సభ్యుల సహకారం మరువలేనిది

గోల్కొండ, న్యూస్‌టుడే: గోల్కొండలో జరగనున్న మిలాద్-ఉన్-నబీ, జల్సాతో పాటు రానున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో పోలీసులకు మైత్రికమిటీ సభ్యులు సహకారం అందించాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్‌ఫయాజ్ అన్నారు. శనివారం గోల్కొండ ఠాణాలో జరిగిన మైత్రికమిటీ సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గోల్కొండలో జరిగే బోనాలు, పండగలు, జల్సాల్లో మైత్రికమిటీ సభ్యుల సహకారం మరువలేనిదని తెలిపారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, అదనపు ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్, ఎస్‌ఐ రఫిక్, మైత్రి సభ్యులు పాల్గొన్నారు.

## డీజేలకు అనుమతి లేదు

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: వినాయక నవరాత్రులు, మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రజల సహకారంలో శాంతియుతంగా నిర్వహించామని ఆసిఫ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. దసరా ఉత్సవాల నిర్వాహకులు, ఫంక్షన్‌హాళ్ల యజమానులతో ఆసిఫ్‌నగర్ ఠాణాలో శనివారం సమావేశం నిర్వహించారు. డీజేలకు అనుమతి లేదని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత ఫంక్షన్‌హాళ్లలో సౌండ్ వినిపించకూడదని, ప్రజల కోసం తీసుకుంటున్న చర్యలకు అందరూ సహకరించాలన్నారు. ఎస్సై హైమ, ఏఎస్సైలు దేవేందర్, సుధాకర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీల విడుదలకు ఎంపీజే చేయూత

దూద్‌బౌలి, న్యూస్‌టుడే: మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్(ఎంపీజే) సంస్థ పేద ఖైదీలు జైలు నుంచి విడుదలకు చేయూతనిస్తుందని సంస్థ ప్రధాన కార్యదర్శి సలీముల్ హిందీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జామీనుపై విడుదలయ్యేందుకు కోర్టు అనుమతించినా.. నిరుపేద ఖైదీలు నిర్ణీత జరిమానా డబ్బులు చెల్లించలేకపోవడంతో జైలుల్లోనే మగ్గుతున్నారన్నారు. అలాంటి సంస్థ సహకారం పొందాలనుకునే వారు 040- 24503818, 9010320638 నంబర్లలో సంప్రదించవచ్చని సలీముల్ హిందీ చెప్పారు.

## ఉద్యోగ భద్రతకు 30న ధర్నా

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: 30న కార్మిక శాఖ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. కంచన్‌బాగ్‌లో శనివారం భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ హాజరై మాట్లాడారు. ఒప్పంద కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ సంఘటితంగా పోరాడాలని చెప్పారు. సీఐటీయూ నాయకులు శ్రవణ్‌కుమార్, టి.సత్తయ్య, మురళి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## పరశురాం ఆలయ పరిసరాల్లో ఉద్రిక్తత

బేగంబజార్, న్యూస్‌టుడే: ప్రముఖ వ్యాపార, వాణిజ్య కేంద్రమైన బేగంబజార్ ఛత్రి సమీపంలోని పరశురాం ఆలయం సమీపంలో దేవాదాయ శాఖకు చెందిన స్థలంలో ఆక్రమణల కూల్చివేత వివాదాస్పదంగా మారింది. న్యాయస్థానం తీర్పుతో దశల వారీగా అద్దె చెల్లిస్తానంటూ అద్దెకుంటున్న వారు సర్దిచెప్పడంతో దేవాదాయ శాఖ అధికారులు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది. అఫ్జల్‌గంజ్ పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వారసత్వ సంపద కాపాడుకోవాలి

అబిడ్స్, న్యూస్‌టుడే: చారిత్రక హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడటం, కళలను ప్రోత్సహించేందుకు ప్రజా సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఖైరతాబాద్ జడ్సీ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మోజంజాహీ మార్కెట్ ప్రాంగణంలో శనివారం రాత్రి గజల్, షహరీ కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు విద్యాధర్, ప్రశాంతి, భార్గవ్ నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, డా.వెంకటరమణ పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ

ఆసిఫ్‌నగర్: కొవిడ్ తర్వాత ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని ఉస్మానియా వైద్య కళాశాల సీనియర్ గుండె వ్యాధి నిపుణులు ప్రొఫెసర్ కృష్ణ మాలకొండారెడ్డి అన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని సైఫాబాద్ సైన్స్ కళాశాలలో వరల్డ్ హార్ట్‌డే వేడుకలు, కళాశాలలో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు నిర్వహించిన ఇండక్షన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జంక్, నూనె పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ లక్ష్మణ్ నాయక్, వైస్ ప్రిన్సిపల్ డా. నవనీత, తెలంగాణ సిటిజన్స్ కౌన్సిలింగ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు చకచకా

న్యూస్‌టుడే, జియాగూడ

నగరంలో ప్రసిద్ధిగాంచిన 350 ఏళ్ల ఘనచరిత కలిగిన చారిత్రక జియాగూడ రంగనాథస్వామి ఆలయ పునరుద్ధరణ పనులు పునఃప్రారంభమయ్యాయి. గతేడాది చివర్లో పనులకు ఆలయ నిర్వాహకులు శ్రీకారం చుట్టారు.

### నిష్ణాతులైన కళాకారులను రప్పించి..

తమిళనాడు, శ్రీరంగం పట్నంతో పాటు దేశవ్యాప్తంగా పేరుగాంచిన కళాకారులను ప్రత్యేకంగా రప్పించి రంగనాథుడి ఆలయ పునరుద్ధరణ పనులు వేగంగా చేపడుతున్నట్లు నిర్వాహకులు శృంగారం శేషాచార్యులు, బద్రీనాథాచార్యులు తెలిపారు.

### గుడిని విస్తరించి.. సౌకర్యాలు కల్పించి

తమిళనాడు శ్రీరంగపట్నంలోని చారిత్రక రంగనాథస్వామి పుణ్యక్షేత్రం తరహాలోనే జియాగూడ రంగనాథస్వామి దేవస్థానాన్ని పేర్కొనవచ్చు. ఈ గుడిని విస్తరించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం సకల హంగులతో ఆలయంలో వాస్తుప్రకారం పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రధాన ప్రవేశ ద్వారం వద్ద ఉన్న పురాతన రాజగోపురాన్ని



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి మూలవిరాట్టు

### తమిళనాడు శ్రీరంగం తరహాలో నిర్మాణం

మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రహరీలను 9 పీట్ల నుంచి 16 పీట్ల ఎత్తుకు పెంచడమే కాకుండా చుట్టూ ఆకాశమార్గాన మహావిష్ణువు దశావతారాల దేవతా విగ్రహాలు, మరోవైపు అష్టలక్ష్మీదేవత విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. దేవాలయం లోపల గర్భగుడిని రంగనాథ పెరుమాళ్ ఆలయ పునర్నిర్మాణం, గర్భగుడికి ఇరువైపులా లక్ష్మీదేవి ఆలయాన్ని గోపురం, రామానుజస్వామి గోపురం నిర్మిస్తున్నారు. గర్భగుడికి ఎదురుగా ఉన్న పురాతన రంగనాథస్వామి మండపంలోని కాంక్రీట్ పిల్లర్లకు స్యాండ్ బ్లాస్టింగ్ ప్రక్రియ చేయించి ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మండపం పైన ఉన్న శ్రీవారి దశావతారాల పురాతన ప్రాకార దేవతా విగ్రహాల స్థానంలో శ్రీరంగం తరహాలో ముఖమండపంపై వాసుదేవ పెరుమాళ్, అష్టలక్ష్మీ దేవతల సాకార విగ్రహాలను ఏర్పాటుచేయనున్నారు. ఆలయం ప్రవేశ ద్వారం వెనుకాల సుదర్శన పెరుమాళ్, నారసింహ పెరుమాళ్, పరమ పద పెరుమాళ్ విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించనున్నారు. ఆలయంలోని అభయాంజనేయస్వామి దేవాలయాన్ని కూడా పూర్తిగా పునఃనిర్మిస్తున్నారు. గర్భగుడికి కుడివైపున వైకుంఠ మండపం, దానిపైన మండపం చుట్టూ సాలరాం, శ్రీవారి నైవేద్య ప్రసాదాలకు పాకశాల, దేవతామూర్తుల అలంకరణ గృహం, ధాన్యాగారం, బయట గుడికి ఎదురుగా ఉన్న పురాతన కల్యాణ మండపంపై గాలిగోపురాల నిర్మాణం తదితర చారిత్రక పునరుద్ధరణ పనులను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. గుడి భూగర్భంలో ఉన్న శ్రీవారి పుష్కరిణిని కూడా ప్రత్యేకంగా తీర్చిదిద్దనున్నారు.



ఆలయం వెలుపల కొనసాగుతున్న ప్రహరీ పునరుద్ధరణ పనులు

### ప్రత్యేక వాహనాలు

శ్రీమన్నారాయణుడి సేవలు, ఉత్సవాలకు వినియోగించనున్న బ్రహ్మోత్సవ రథాన్ని ఇటీవలే ప్రత్యేకంగా తయారు చేయించారు. రంగనాథుడి సేవకు గజ వాహనం, హనుమంత వాహనం, గరుడ వాహనం, శేష వాహనం, అశ్వవాహనం, పల్లకీ వాహనాలను కూడా ప్రత్యేకంగా తయారు చేయిస్తున్నట్లు శేషాచార్యులు, బద్రీనాథాచార్యులు వివరించారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

– న్యూస్‌టుడే, కార్వాన్, సుల్తాన్‌బజార్, కంచన్‌బాగ్

? కార్వాన్‌లోని కుల్సుంపుర ప్రభుత్వ పాఠశాల వెనుకవైపు, రాంసింగ్‌పురలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు కొట్టుకుపోయాయి. గుంతలు పడ్డ రోడ్లపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది.
– సురేందర్‌సింగ్, రాంసింగ్‌పుర, శ్రీనివాస్, కార్వాన్

✓ సమస్యలున్న చోట మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. – విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈ, గుడిమల్కాపూర్

? గన్‌ఫౌండ్రి డివిజన్ ఇసామియాబజార్, సంతోషిమాత టెంపుల్ లేన్, మెహర్‌బాబా లేన్ ప్రాంతాల్లో కొద్ది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. – రాజేందర్‌కుమార్, వ్యాపారి, ఇసామియా బజార్

? బడీచౌడి, కుత్బిగూడ, రంగ్‌మహల్ ప్రాంతాల్లో విద్యుత్ దీపాలు వెలగక అంధకారం నెలకొంది. స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరుగుతున్నాయి. – రాజ్‌కుమార్ శ్రీవాత్సవ, ప్రైవేటు ఉద్యోగి, కుత్బిగూడ

? గౌలిగూడ, ట్రూప్‌బజార్, హనుమాన్‌టేక్డీ, బ్యాంకుస్ట్రీట్, పుత్లిబౌలి, 94బస్టాప్ లేన్ ప్రాంతాల్లో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు.
– పుట్ట యాదగిరిగౌడ్, చిరు వ్యాపారి, బ్యాంకుస్ట్రీట్

✓ త్వరలో సిబ్బందితో ఆయా ప్రాంతాల్లో పరిశీలించి పాడైపోయిన వాటికి మరమ్మతులు, కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. – నాగమణి, డీఈ, విద్యుత్తు విభాగం

? డీఎంఆర్‌ఎల్ కూడలి నుంచి పిసల్ బండ కూడలి వైపునకు వచ్చే మార్గం ఓ హోటల్ ఎదుట క్యాచ్‌పిట్లు రోడ్డుకు దిగువన ఉన్నాయి. రోడ్డుకు సమాంతరంగా ఎత్తు పెంచాలి. – ముజీబ్, కంచన్‌బాగ్

✓ చాంద్రాయణగుట్ట సర్కిల్-8 ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించి తగిన చర్యలు తీసుకుంటాం. – వెంకన్న, జడ్సీ

## సారస్వత పరిషత్తు సాహితీ పురస్కారాలకు ఎంపిక

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలోని విభిన్న ప్రక్రియలలో విశేష కృషి చేసిన ఎనిమిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు ప్రకటించింది. ఎర్రంరెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని ఆచార్య కాత్యాయని విద్మహేకు బహూకరిస్తారు. ఆచార్య పాకాల యశోదారెడ్డి పురస్కారాన్ని డాక్టర్ భాస్కర యోగికి, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సాహిత్య పురస్కారాన్ని మోత్కూరి నరహరికి, డాక్టర్ చింతపల్లి వసుంధరారెడ్డి జానపద సాహిత్య పురస్కారాన్ని ఆచార్య ఎన్ భక్తవత్సలరెడ్డికి, ఆలూరి బైరాగి కవితా పురస్కారాన్ని నాగవరం బాలరామ్‌కు, డా.వానమామలై వరదాచార్యుల పురస్కారాన్ని డాక్టర్ వెల్దండ సత్యనారాయణకు, ఆచార్య రావికంటి వసునందన్ సాహితీ పురస్కారాన్ని రేడియం (జె.కొండన్న)కు, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని పురస్కారాన్ని డాక్టర్ తిరుమల శ్రీనివాసాచార్యకు అందజేయనున్నారు. వచ్చే నెల 4న సాయంత్రం 5:30 కు బొగ్గులకుంటలోని పరిషత్ ప్రాంగణంలో పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య శివారెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో రూ.5 వేల నగదు, జ్ఞాపికతో సన్మానించనున్నారు.

## పైవంతెనకు కొత్తందాలు

బషీర్‌బాగ్ పైవంతెనకు 'స్వచ్ఛభారత్' ప్రతిబింబం చేలా



ప్రకృతి అందాలను అద్దుతున్నారు. అదేవిధంగా పిల్లర్లకు చార్మినార్, బిర్లా మందిర్, గోల్కొండ, కుతుబ్‌షాహీ టూంబ్స్ చిత్రాలను ఆవిష్కరిస్తున్నారు. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, నారాయణగూడ

## అత్తింటి వేధింపులు భరించలేక.. వివాహిత ఆత్మహత్య

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: అత్తింటి వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హుమాయున్‌నగర్ ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సైదేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 ఆగస్టులో టోలిచౌకి హకీంపేటలోని ఐఏఎస్‌కాలనీకి చెందిన రుహిసుల్తానా(35)కు మెదక్ జిల్లా తుప్రాన్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ముక్రరం(40)తో పెళ్లి అయ్యింది. వారికి ఆరు నెలల బాబు ఉన్నాడు. వివాహ సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని.. అదనపు కట్నం తీసుకురావాలని భర్త, ఆడపడుచు రహీమున్నీసా.. రుహిసుల్తానాను వేధిస్తున్నారు. కొద్ది కాలంగా ఆమె హకీంపేటలోని తల్లిగారింట్లో ఉంటోంది. ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం భర్త, ఆడపడుచుపై అల్వాల్ ఠాణాలో రుహిసుల్తానా వరకట్నం కేసు నమోదు చేసింది. శుక్రవారం రాత్రి టోలిచౌకిలోని అమ్మగారింట్లో అందరూ మాట్లాడుతుండగా రుహిసుల్తానా పడక గదిలోకి వెళ్లి తలుపులు పెట్టి, దుపట్టాతో సీలింగ్ ఫ్యానుకు ఉరేసుకుంది. ఇంట్లో నుంచి ఎంతకు రాకపోగా, బాబు ఏడుపులు వినిపించడంతో తలుపులు తెరిచేందుకు ప్రయత్నించారు. తెరుచుకోక పోవడంతో పొరుగు వారి సహాయంతో పగులగొట్టి చూడగా ఉరేసుకొని మృతి చెంది కనిపించింది. తల్లి అతియా బేగం(70) ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్‌కుమార్ పేర్కొన్నారు.

## నిర్వాసితులకు ఇళ్ల కేటాయింపు



నిర్వాసితులకు పత్రాలందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, తహసీల్దార్లు జ్యోతి, ప్రేమ్‌కుమార్, కార్పొరేటర్ దర్శన్

జియాగూడ, న్యూస్‌టుడే: హైడ్రా కూల్చివేతలతో ఇల్లు కోల్పోతున్న జుమ్మెరాత్‌బజార్ దేవీబాగ్ ఉప్పలమ్మ దేవాలయ సమీపంలోని మూసీనది ఒడ్డున ఉన్న 11 కుటుంబాలకు జియాగూడలో డబుల్ ఇళ్లను అధికారులు కేటాయించారు. డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్, ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతి, నాంపల్లి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్, జియాగూడ కార్పొరేటర్ బోహిని దర్శన్‌లు నిర్వాసితుల కుటుంబాలకు జియాగూడలోని 2బీహెచ్‌కే కాలనీలోని 5వ అంతస్తులో ఇళ్లను కేటాయించి వారికి ఇంటి తాళంచెవి, పత్రాలను అందజేశారు. కార్వాన్‌లోని కేసరి హనుమాన్, దరియాబాగ్, మూసీ ఒడ్డున ఇళ్లు కోల్పోనున్న 15 కుటుంబాలకు కూడా శనివారం రెవెన్యూ అధికారులు జియాగూడలో డబుల్ ఇళ్లు కేటాయించారు.

### ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం

బేగంబజార్: మూసీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాలైన చుడీబజార్ గణేశ్ దేవాలయం, అరుంధతి సేవా మండలి, జుమ్మేరాత్ బజార్, దేవీనగర్, అంబేడ్కర్ నగర్, ఉప్పలమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో శనివారం పర్యటించారు.

## మూసీ బాధితుల నిరసన.. వెనుదిరిగిన అధికారులు



ఆశంనగర్‌లో ఆందోళన

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: లంగర్‌హౌస్‌లోని ఆశంనగర్, డిఫెన్స్‌కాలనీ మూసీ బాధితులు గోల్కొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. శనివారం ఉదయం మరోసారి సర్వే చేపట్టేందుకు వచ్చిన రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ స్థానిక మజ్లిస్ నేతలతో కలిసి డిఫెన్స్‌కాలనీ, ఆశంనగర్ చేరుకుని బాధితులతో మాట్లాడారు. మరోసారి సర్వే చేపట్టాలని, ఎఫ్‌టీఎల్ రాళ్లను దాటి అధికారులు సరిహద్దులు నిర్ధారించారని ఎమ్మెల్యే ఆరోపించారు. డ్రోన్ సర్వే కాకుండా గ్రౌండ్ సర్వే చేపట్టాలని హైదరాబాద్ జాయింట్ కలెక్టర్‌ను కోరారు. అప్పటి వరకు కూల్చివేతలు చేపట్టవద్దని గోల్కొండ తహసీల్దార్ అహల్యను ఆదేశించారు.

చార్మినార్: బహదూర్‌పుర మండల కార్యాలయం ఎదుట శనివారం హౌజింగ్‌బోర్డు కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. తమ నివాసాలను కూల్చి వేయొద్దని ర్యాలీ చేపట్టారు.

## సర్వేకు సహకరించండి: ఎమ్మెల్యే



బాధితులకు నచ్చజెప్పున్న కౌసర్ మొహియుద్దీన్

కార్వాన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేకు సహకరించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తోపాటు రెవెన్యూ అధికారులు ప్రజలను కోరారు. మూసీ తీరంలోని దరియాబాగ్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేశారు. తమ ఇళ్లను కూల్చొద్దు, సర్వే అక్కర్లేదని నిరసన తెలుపుతున్న బస్తీవాసులను ఎమ్మెల్యేతో పాటు రెవెన్యూ అధికారులు వివిధ రకాలుగా నచ్చజెప్పారు. ఇప్పుడు కేవలం మార్కింగ్ వేస్తూ సర్వే మాత్రమే చేస్తున్నారని పేద ప్రజలకు అన్యాయం జరగకుండా అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని, బల్దియా, విద్యుత్, జలమండలి తదితర ప్రభుత్వ శాఖల అనుమతులున్నాయంటూ స్థానికులు పత్రాలు చూపించారు. కార్వాన్ కార్పొరేటర్ స్వామియాదవ్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కమీషన్ ఆశతో మత్తు ఇంజక్షన్ల విక్రయాలు

ఈనాడు, హైదరాబాద్: కండలు పెంచాలనే మోజులో ఉన్న యువతకు మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఆసిఫ్‌నగర్‌కు చెందిన సయ్యద్ అఫ్ఫాన్(22)ను అరెస్ట్ చేసినట్టు శనివారం నగర సీసీఎస్ డీసీపీ శ్వేత తెలిపారు. ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్న అఫ్ఫాన్ కమీషన్‌పై ఆశతో నిషేధిత మత్తు ఇంజక్షన్లను అమ్ముతున్నట్టు గుర్తించిన మెహిదీపట్నం జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్, సీసీఎస్ స్పెషల్ జోనల్ క్రైమ్ టీమ్ ఏసీపీ జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ భిక్షపతి బృందం నిందితుడి నివాసంలో తనిఖీలు నిర్వహించింది. 150 ఇంజక్షన్లను స్వాధీనం చేసుకుంది. శారీరక దృఢత్వం, వ్యాయామ సమయంలో యువత వీటిని వినియోగిస్తున్నట్టు గుర్తించారు. వైద్యుల సిఫార్సు లేకుండా వాడితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని పోలీసులు తెలిపారు.

కార్వాన్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా అసహజంగా కండలు పెంచడంతో పాటు మత్తు కలిగించే ఇంజక్షన్లు, మందుల్ని అమ్ముతున్న వ్యక్తిపై టప్పాచబుత్ర పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎ.రాములు, అడ్మిన్ ఎస్సై మహ్మద్ అంజద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్వాన్‌కు చెందిన రాజేష్(27) జిమ్‌లలో వ్యాయామం చేసే యువకులతో పాటు ఇతరులకు మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. డ్రగ్స్ కంట్రోల్ అధికారుల సహకారంతో శుక్రవారం రాత్రి నిందితుడిని పట్టుకొని అతని నుంచి సుమారు రూ.40వేల విలువ చేసే ఇంజక్షన్లు, ఇతర మందుల్ని స్వాధీనం చేసుకున్నారు.

## చదువుతోనే సంస్కారం




సమావేశంలో షహిస్తాష్‌గుప్తా, ఖలీదాపర్వీన్ విద్యావేత్తలు

నాంపల్లి, న్యూస్‌టుడే: చదువుతోనే సంస్కారం అలవరుతుందని.. నీతి నియమాలు లేని చదువు సమాజానికి ఏ విధంగానూ ఉపయోగపడదని జమాతే ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి షహిస్తాష్‌గుప్తా పేర్కొన్నారు. 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అంశంపై శనివారం నాంపల్లిలోని మదీనా ఎడ్యుకేషన్ సెంటర్‌లో ముస్లిం మహిళా విద్యావేత్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నైతిక విలువలు మనిషి వ్యక్తిత్వాన్ని, నడవడికను తీర్చిదిద్దుతాయన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతిభ అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నారే తప్ప.. మంచి వ్యక్తిత్వాన్ని అలవర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక కార్యకర్త ఖలీదాపర్వీన్, ముస్లిం మహిళా విద్యావేత్తలు అర్షియాయాస్మీన్, ఫౌజియాబేగం, డాక్టర్ రఫత్‌సీమా, మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ మరియాతబస్సుమ్, ప్రచార కమిటీ కన్వీనర్ డాక్టర్ అస్రముహ్సినా పాల్గొన్నారు.

## పట్టణ ప్రణాళిక విభాగంపై కమిషనర్ కన్నెర్ర

### ఏసీపీతో పాటు సెక్షన్ అధికారి బదిలీ



అబిడ్స్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్ (గోషామహల్) పట్టణ ప్రణాళిక విభాగంపై కమిషనర్ ఆమ్రపాలి కన్నెర్ర చేశారు. అక్కడ పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్ సయాదుద్దీన్‌తో పాటు సెక్షన్ అధికారి ముఖేశ్‌సింగ్‌పై బదిలీ వేటు వేశారు. ఏసీపీ స్థానంలో 10వ సర్కిల్(ఫలక్‌నుమా)లో పనిచేస్తున్న బి.మంజులాసింగ్‌ను, సెక్షన్ ఆఫీసర్ స్థానంలో 26వ సర్కిల్ (గాజులరామారం)లో పనిచేస్తున్న జేకే నరేశ్‌ను నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్‌లో పట్టణ ప్రణాళిక విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. నగరం నడిబొడ్డున ప్రముఖ హోల్‌సేల్ వ్యాపార కేంద్రాలకు నెలవుగా ఉన్న ఈ సర్కిల్ పరిధిలో పనిచేసే అధికారులపై తరచూ అవినీతి ఆరోపణలు రావడం, ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకుంటుండటం పరిపాటిగా మారింది. సర్కిల్‌లో ఒకే ఒక్క సెక్షన్ అధికారి ఉండటం కూడా అవినీతికి ఎక్కువ ఆస్కారం ఉంటుందని పలువురు వాపోతున్నారు. నిబంధనలు ప్రకారం.. నలుగురు ఉండాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నియామకాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

## ప్రైవేటు ఉద్యోగి అదృశ్యం



ధూల్‌పేట, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి అదృశ్యమైన ఘటన మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై షేక్ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా అర్బన్ కాలనీకి చెందిన **ఎం.సందీప్(28)** మార్కెటింగ్ ఉద్యోగి. ఈ నెల 27న అప్పర్ ధూల్‌పేటలోని హజారీ హోటల్ సమీపంలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో తప్పిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బెదిరించి.. రూ.4 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఫెడెక్స్ కొరియర్‌లో నిషేధిత వస్తువులున్నాయని బెదిరించి రూ.4 లక్షలు దోచేశారంటూ బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## గంజాయి కేసు.. ఐదుగురికి జైలు

మెహిదీపట్నం: బహిరంగంగా గంజాయి తాగుతున్న ఐదుగురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి ఏఎస్సై రామాంజనేయులు పెట్రోలింగ్ చేస్తుండగా నాంపల్లి, యూసుఫ్‌బాబా దర్గా ప్రాంతాల్లో రోడ్డుపై గంజాయి తాగుతూ పలువురు కనిపించారు. పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. చార్మినార్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సలీం(32), బహదూర్‌పురకు చెందిన మహ్మద్ ఇర్ఫాన్(20), మహ్మద్ వసీం(24), ఆగాపురలో ఉండే మహ్మద్ ఇంతియాజ్(20), షేక్ అఫ్రోజ్(50)లను పోలీసులు అరెస్టు చేసి నాంపల్లిలోని 2వ ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ఇమ్తియాజ్‌కు, సలీం, ఇర్ఫాన్, వసీంలకు 8రోజులు, అఫ్రోజ్‌కు 2 రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి ఎం.స్వామి తీర్పు చెప్పారు.



## బహుజన రక్షణ సమితి ఆవిర్భావం



లోగో ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డానియేల్ తదితరులు

బషీర్‌బాగ్: రాజ్యాధికారంతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా బహుజనులు ముందుకు సాగాలని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ సూచించారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బహుజన రక్షణ సమితి ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి లోగోను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బహుజనులు పాలితులుగా ఉండటం వల్లనే సమస్యలు పరిష్కారం కావడం లేదని, పాలకులుగా మారాల్సిన అవసరముందన్నారు. బహుజన రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పాకాల డానియేల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీశ్‌కుమార్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కొమ్ము స్వరూప, నాగమణి, సునీత, శ్వేత, భాస్కర్‌గౌడ్, ఎస్.గోపాల్ పాల్గొన్నారు.

## వివాదాస్పద ప్రచారం.. ఒకరి అరెస్టు

కేశవగిరి, న్యూస్‌టుడే: అమెరికా, ఫ్రాన్స్‌లపై యుద్ధం చేయాలని దేవుడు ఆదేశించాడని.. మా ఆర్మీలో చేరండంటూ తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తిని బండ్లగూడ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి పీలిదర్గా సమీపంలోని అబ్దుల్లా కాలనీ ప్రాంతంలో మహ్మద్ గౌస్‌ని షకీల్ బిన్ హనీఫ్ పిలిచాడు. మాటామాట కలుపుతూ... అమెరికా, ఫ్రాన్స్‌లపై యుద్ధం చేసేందుకు దేవుడు ఆదేశించాడని... మా ఆర్మీలో చేరాలంటూ కోరాడు. వివాదాస్పద వ్యాఖ్యలతో ఖంగుతున్న గౌస్ తన స్నేహితుడు మహ్మద్ అబ్దుల్ జుబేర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో స్థానికులు పోగై షకీల్ బిన్ హనీఫ్ నివసిస్తున్న అబ్దుల్లాకాలనీలోని ఇంటి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా ఇంటిలో ఉన్న మహ్మద్ ఆరీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. షకీల్ బిన్ హనీఫ్ పరారయ్యాడు. పట్టేపల్లి ఫాతిమానగర్‌కు చెందిన సమీర్(28), అదే ప్రాంతానికి చెందిన అల్తాఫ్(28), అఖిల్(27), ఫలక్‌నుమా తీగలకుంటకు చెందిన ఫైసల్(25)లపైనా కేసులు నమోదు చేసి వారికోసం గాలిస్తున్నారు.

# రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

## స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తి కొనసాగించాలి



వ్యర్థాలు సేకరిస్తున్న యువత

మణికొండ, నార్సింగి: మణికొండ నెక్నాంపూర్ చెరువులో ప్రవాహ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించారు. ఐటీ ఉద్యోగులు, యువత పెద్దఎత్తున పాల్గొని చెరువులో వ్యర్థాలు, పరిసర ప్రాంతాల్లో చెత్తను తొలగించారు. తమ తమ ప్రాంతాల్లో స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని ఈ సందర్భంగా ప్రవాహ్ సంస్థ నిర్వాహకులు మధులిక చౌదరి సూచించారు.

**గండిపేట వద్ద నేడు 5 కె స్వచ్ఛతా రన్:** స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం గండిపేట వద్ద 5 కె రన్ నిర్వహిస్తున్నట్లు నార్సింగి మున్సిపాలిటీ మేనేజరు యోగేష్ తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గండిపేట మెహుల్ కళాశాల వద్ద మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ వి.పి.గౌతం, ఒలింపియన్ మహిళా బాక్సర్ నిఖిత్ జరీన్ జండా ఊపి రన్‌ను ప్రారంభిస్తారన్నారు.



## మార్కెట్ ఛైర్మన్‌గిరిపై వీడని పీటముడి

**వర్గపోరుతో ఎటూ తేల్చని అధిష్ఠానం ● 'సర్దార్‌నగర్'పై ఆశావహుల ఎదురుచూపు**



షాబాద్‌లోని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

మొయినాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల కొన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం చేపట్టగా అందులో చేవెళ్ల శాసనసభ నియోజకవర్గంలోని సర్దార్‌నగర్ మార్కెట్ లేదు. దీనికి కారణం నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు గ్రూపులుగా విడిపోవడంతో ఎవరికి వారుగా పైచేయి సాధించే ఎత్తుగడలో నిమగ్నమవడమే. దీంతో కమిటీ నియామకంలో పీటముడి నెలకొంది. ఛైర్మన్‌గిరిపై ఆశలు పెట్టుకున్న ఆశావహులు ఎవరి వర్గంలో కొనసాగాలో అర్థం కాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.

చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ మండలాలున్నాయి. చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల్లోని మార్కెట్ కమిటీలకు ఛైర్మన్‌ల నియామకం పూర్తికాగా షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమించలేదు. ఇక్కడి వ్యవసాయ మార్కెట్ పరిధిలో మొయినాబాద్, షాబాద్ మండలాలు కొనసాగుతున్నాయి. పాతికేళ్లుగా ఇక్కడి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి షాబాద్ వాసులకే దక్కుతుంది. ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనేందుకు మొయినాబాద్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పైరవీలు మొదలుపెట్టారు. మరోవైపు నియోజకవర్గంలో పార్టీలో గ్రూపు తగాదాలు నెలకొన్నాయి. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పామెన భీంభరత్ కొనసాగుతుండగా.. భారాస నుంచి గెలిచి ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య మరో వర్గంగా ఏర్పడ్డారు. ఇక మండలాల వరకు వచ్చేసరికి నాలుగైదు గ్రూపులున్నాయి. ఇప్పటికే సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్, సభ్యుల జాబితాను భీంభరత్, ఎమ్మెల్యే ఎవరికి వారుగా అధిష్ఠానానికి అందజేశారు. దీంతో ఎవరి వర్గానికి పదవులు కేటాయించాలో తెలియని పార్టీలో సందిగ్ధత నెలకొంది. మూడో వర్గంగా మరికొంతమంది కాంగ్రెస్ శ్రేణులు ఈసారి మొయినాబాద్ మండలానికి చెందిన వారికే ఛైర్మన్ పదవిని కేటాయించాల్సిన్న డిమాండును తెరపైకి తెచ్చారు.

**అందరిలోనూ ఉత్కంఠ..**

సర్దార్‌నగర్ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ పదవి ఎవరిని వరిస్తోందనన్న ఉత్కంఠ నెలకొంది. మూడో వర్గంగా తెరపైకి వచ్చిన కొంతమంది జిల్లాల మొయినాబాద్‌కు వచ్చిన ఎమ్మెల్యే యాదయ్యను కలిశారు. ఈసారి తమ మండలానికే ఛైర్మన్ పదవిని ఇప్పించాలని కోరారు. కానీ ఎమ్మెల్యే నుంచి స్పష్టమైన హామీ లభించలేదని సీనియర్‌నేత ఒకరు తెలిపారు. సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ పదవుల పందేరంలో ఏ వర్గం నేతలు పైచేయి సాధిస్తారోనని నియోజకవర్గంలో చర్చ కొనసాగుతోంది.

## మూసీ నిర్వాసితుల్లో 22 మందికి ఇళ్ల అప్పగింత



రెండు పడకగదుల ఇళ్ల పట్టా అందజేస్తున్న ఆర్డీవో

అత్తాపూర్, న్యూస్‌టుడే: మూసీ అభివృద్ధిలో భాగంగా అత్తాపూర్ పరిధిలో ఇళ్లు కోల్పోతున్న 22 మందికి అధికారులు శనివారం రెండు పడక గదుల ఇళ్లను కేటాయించి తాళాలను అందజేశారు. నార్సింగి, జియాగూడల్లో ఉన్న ఇళ్లల్లో ఎక్కడైనా ఎంపిక చేసుకోవాలని సూచించగా నిర్వాసితులు పరిశీలించి ఎంపిక చేసుకున్నారు. ఇందులో అత్తాపూర్‌కు 2కి.మీ.దూరంలో ఉన్న జియాగూడలో ఇళ్లు కేటాయించాలని 15 మంది కోరగా వారికి శనివారం ఇళ్ల తాళాలు అందజేసి అక్కడికి పంపించినట్లు ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రాములు తెలిపారు. మరో ఏడు కుటుంబాలు నార్సింగిలో ఇళ్లు కావాలని కోరగా వారికి అక్కడ అందజేశారు. ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలో ముందువచ్చిన వారికి ఇష్టమైన చోట కేటాయిస్తామని, అక్కడయిపోతే మరోచోట కేటాయిస్తామని అధికారులు తెలిపారు.

**ఆర్డీవో కార్యాలయం ఎదుట భరత్‌నగర్ వాసుల ఆందోళన**

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం భరత్‌నగర్ వాసులు ఆందోళన నిర్వహించారు. మూసీ అభివృద్ధిలో భాగంగా తమ ఇళ్లను కూల్చివేయొద్దని వారు డిమాండ్ చేశారు. అధికారులు తమ ఇళ్లను అన్యాయంగా కూలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు బాధితులతో మాట్లాడారు. ఇళ్లు కోల్పోతున్న పేదలందరికి ఇళ్లు కేటాయిస్తామని వారిని సముదాయించారు. బాధితులు ముందుకొస్తే వెంటనే ఇళ్లు ఇస్తున్నామని, అనవసరమైన ఆందోళనతో సమయం వృథా చేసుకోవద్దని సూచించారు.

## పేదలకు అన్యాయం జరగకుండా చర్యలు: కలెక్టర్



రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: మూసీ నది పరీవాహక అభివృద్ధిలో భాగంగా నిర్వాసితుల తరలింపులో పేదలకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ విభాగాల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాకు వివరాలను వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలో రాజేంద్రనగర్, గండిపేట మండలాల్లో ఉస్మాన్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 11.7కి.మీ, బాపుఘాట్ నుంచి కమేల వరకు 4.కి.మీ, హిమాయత్‌సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 9కి.మీ.ల మేర మూసీ విస్తరించి ఉందన్నారు. మూసీ నదిలో మొత్తంగా 339 నిర్మాణాలను గుర్తించామన్నారు. ఇందులో 175 నివాస గృహాలున్నాయని, వాటిలో 99 శాశ్వత గృహాలు కాగా 76 రేకులతో నిర్మించిన ఇళ్లున్నట్లు తేలిందన్నారు. ఇందులో స్వచ్ఛందంగా ముందుకొచ్చిన 22 మందికి వారి ఇష్టప్రకారం శనివారం నార్సింగి, జియాగూడల్లోని రెండు పడకగదుల ఇళ్లు కేటాయించామన్నారు. ఇంకా చాలామంది స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని వివరించారు. ఇళ్లు కాకుండా షెడ్లు తదితర నిర్మాణాలతో కొంతమంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, వారిలో అర్హతను బట్టి ఇళ్లు కేటాయిస్తామన్నారు. అర్హులను గుర్తించడానికి 4 బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఇప్పటివరకు ఎవరినీ బలవంతంగా ఖాళీ చేయించలేదని, వారికి పరిస్థితిని వివరించి ఖాళీ చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఖాళీచేసిన 22 కుటుంబాలకు ఇళ్లు కేటాయించడం నుంచి వారిని తరలించేవరకు ప్రభుత్వమే ఖర్చులు భరిస్తుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రాములు తదితరులు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో వితంతువులకు పింఛన్లు



పింఛన్లు అందజేస్తున్న సురేందర్ గౌడ్

శంకర్‌పల్లి(చేవెళ్ల), న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఫించన్లు మంజూరు కాకపోవడంతో శంకర్‌పల్లి మండలం పర్వేదకు చెందిన 25 మంది వితంతువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వారికి నెలకు రూ. 2 వేల చొప్పున మాజీ సర్పంచి అనిత సురేందర్‌గౌడ్ సొంత నిధులతో శనివారం పింఛను అందజేశారు. ప్రభుత్వం నుంచి పింఛన్లు మంజూరయ్యే వరకు 25 మందికి ప్రతి నెలా 1న డబ్బు అందజేస్తానని తెలిపారు.

## దళితుల అభ్యున్నతికి నిరంతర కృషి: భాజపా

షాద్‌నగర్ న్యూటౌన్: అమెరికా పర్యటనలో రిజర్వేషన్లపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలతో దళితులు, గిరిజనులపై ఆ పార్టీ వైఖరి బయటపడిందని భాజపా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ అన్నారు. తాము అధికారంలోకి వస్తే భారతదేశంలో రిజర్వేషన్లను తొలగిస్తామని రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు షాద్‌నగర్‌లో శనివారం ఆందోళన చేపట్టారు. అనంతరం శ్రీవర్ధన్ రెడ్డి, అందె బాబయ్యలతో పాటు ఆయన విలేకరులతో మాట్లాడారు. రిజర్వేషన్ల విషయంలో ఎన్నికల ముందు భాజపాపై కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేశారన్నారు. పదేళ్లుగా దళితులు, గిరిజనుల అభ్యున్నతికి భాజపా ప్రత్యేక ప్రణాళికలతో కృషి చేస్తుందని తెలిపారు. సమావేశంలో యెంకనోళ్ల వెంకటేష్, నరసింహ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి

కొత్తూరు: వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పత్తి పంటలో చీడపీడల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు అన్నారు. రెడ్డిపాలెంలో శనివారం ఆయన వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు సుధా, శ్రీనివాస్‌తో కలిసి పత్తి పంటను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులకు రుణమాఫీ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం అందజేశారు.

## తుది ఓటరు జాబితా విడుదల

కొందుర్గు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు వార్డులు, గ్రామాల వారీగా తుదిఓటరు జాబితాలను శనివారం విడుదల చేసినట్లు ఎంపీవో లాలయ్య తెలిపారు. కొందుర్గు మండలంలోని 22 గ్రామ పంచాయతీలు, 186 వార్డులకుగాను 23,169 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు.

## కబ్జా నుంచి రూ.30 కోట్ల సర్కారు స్థలానికి విముక్తి



ప్రభుత్వ భూమిలో పెట్టిన బోర్డు వద్ద రెవెన్యూ అధికారులు

మొయినాబాద్: హైదరాబాద్ శివారులో పట్టాభూమికి ఆనుకుని ఉన్న సుమారు రూ.30 కోట్ల సర్కారు స్థలాన్ని కబ్జాచేయడమే కాకండా అక్కడ నిర్మాణాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జా చెర నుంచి ఆ భూమిని కాపాడారు. మొయినాబాద్ మండలం కనకమామిడి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబరు-510/పీలోని 5 ఎకరాల సర్కారు స్థలానికి సమీపంలో సర్వేనంబరు-261లో ప్రైవేటు పట్టా భూమి ఉంది. పట్టాభూమికి ఆనుకొనే విలువైన ప్రభుత్వ భూమి ఉండటంతో అక్రమార్కుడి కన్ను దీనిపై పడింది. ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు చుట్టూ ప్రహరీ నిర్మించాడు. లోపల గదుల నిర్మాణం చేపట్టగా సమాచారం అందుకున్న మొయినాబాద్ తహసీల్దార్ గౌతంకుమార్ తన సిబ్బందితో శనివారం ఘటనా ప్రదేశానికి చేరుకొని కొలతలు తీయించారు. ఆక్రమణలో అయిదు ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించి అక్కడి నిర్మాణాలను తొలగించారు. ప్రభుత్వ భూమిలో బోర్డును సైతం ఏర్పాటు చేయించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా సర్కారు భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## భగత్‌సింగ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



చేవెళ్లలో నివాళులర్పిస్తూ..

షాద్‌నగర్ న్యూటౌన్, కొందుర్గు, చేవెళ్ల, న్యూస్‌టుడే: లక్ష్యసాధన కోసం భగత్‌సింగ్ చేసిన పోరాటాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని నాయకులు అన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శనివారం షాద్‌నగర్, కొందుర్గు, చేవెళ్లలో భగత్‌సింగ్ విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ షాద్‌నగర్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయా సంఘాల నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింహులు, ఎంఈవో మనోహర్, కుర్మయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనునాయక్, పద్మారెడ్డి పాల్గొన్నారు. కొందుర్గులో భగత్‌సింగ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నరేందర్, యాదగిరి నవీన్, రాఘవేందర్, చేవెళ్లలో కార్యక్రమంలో అనంతరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, మచ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## హిందువులను అవమానిస్తున్న వైఎస్ జగన్: తెదేపా

షాద్‌నగర్: తిరుపతి లడ్డూ విషయంలో వైఎస్ జగన్ మాట్లాడుతున్న తీరు హిందు జాతిని అవమానపరిచేలా ఉందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తిరుమల ఆలయంలోకి వెళ్లేందుకు గతంలో రాష్ట్రపతిగా ఉన్న అబ్దుల్ కలాం, కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీలు కూడా డిక్లరేషన్‌పై సంతకం చేశారని గుర్తు చేశారు. అలాంటిది ఒక్క సంతకం చేయడానికి ఇదెక్కడి మతం అంటూ జగన్ మాట్లాడడం హిందువుల సంప్రదాయాలను, సనాతన ధర్మాన్ని అవమానించడమేనన్నారు. తనకే అవకాశం లేకుంటే దళితులు ఎలా వెళతారని అనడం హాస్యాస్పదమన్నారు.

## డబ్ల్యూహెచ్‌ఆర్పీసీ జాతీయ ఉపాధ్యక్షుడిగా సల్మాన్ అహ్మద్

శంషాబాద్: ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్(డబ్ల్యూహెచ్‌ఆర్పీసీ) జాతీయ ఉపాధ్యక్షుడిగా శంషాబాద్ మండలం హమీదుల్లానగర్‌కు చెందిన మహమ్మద్ సల్మాన్ అహ్మద్ ఎంపికయ్యారు. ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో శనివారం దిల్లీలో నిర్వహించిన సదస్సులో ఆయనకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లీగల్ స్టడీస్ విభాగంలో దక్కిన డాక్టరేట్ పురస్కారాన్ని సినీనటి శిల్పాశెట్టి అందజేశారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం తన వంతు కృషి చేస్తానని అహ్మద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

శంషాబాద్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన శంషాబాద్ మున్సిపల్ పరిధి సాతంరాయిలో శనివారం చోటు చేసుకుంది. ఆర్జీఐఏ పోలీసుల వివరాల ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన బషీర్(24) ప్రైవేటు ఉద్యోగి. గగన్‌పహాడ్ నుంచి తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయల్దేరాడు. సాతంరాయి బస్టాప్ వద్దకు రాగానే ఎదురుగా వేగంగా వచ్చిన ఓ డీసీఎం బషీర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

## పారా మెడికల్ విద్యార్థినులతో అనుచిత ప్రవర్తన

చేవెళ్ల, న్యూస్‌టుడే: చేవెళ్లలోని బాబూ జగ్జీవన్‌రామ్ పారా మెడికల్ కళాశాలకు చెందిన విద్యార్థులు కొన్ని రోజులుగా అప్రెంటిస్ కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారు. శానిటేషన్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న జె.రాజు కొందరు విద్యార్థినులపై చేతులు వేస్తూ అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపల్ రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న షీ టీం సభ్యులు శనివారం ఆసుపత్రిని సందర్శించి వివరాలు సేకరించారు. విచారణలో విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు తేలడంతో అతడిని ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ విధుల నుంచి తొలగించారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని పోలీసులు విద్యార్థినులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

## శిశుమందిరాలతో ఉత్తమ సమాజ నిర్మాణం: బండి సంజయ్



బండి సంజయ్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: ఉత్తమ సమాజ నిర్మాణం కోసం శిశుమందిరాలు పనిచేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం గండిపేట మండలం బండ్లగూడజాగీర్‌లోని సరస్వతి శిశుమందిరంలో గోకరి ఆనంద్‌గౌడ్ ఆర్థిక సహాయంతో రూ.1.70కోట్లతో నిర్మించిన తరగతి గదులను విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకర్‌రెడ్డి, సరస్వతి విద్యాపీఠం అధ్యక్షుడు తిరుపతిరావు, కార్యదర్శి సీతారాములు, రవీంద్రశర్మ తదితరులతో కలిసి సంజయ్ ప్రారంభించారు. అంతకుముందు నిర్వహించిన పాదపూజ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో జరిగిన విధ్వంసంపై సంజయ్ స్వయంగా పాడిన పాట అందరినీ మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమంలో బొద్దు సుధాకర్‌రెడ్డి, బొర్ర భూపాల్‌గౌడ్, ప్రశాంత్‌నాయక్, శేఖర్‌ముదిరాజ్, మల్లారెడ్డి, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి వైపుగా మహిళలు అడుగేయాలి: వీర్లపల్లి

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఉపాధి దిశగా మహిళలు అడుగులు వేయాలని, ప్రభుత్వం వారికి అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో అలియా సుల్తానా ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారికి శనివారం షాద్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మహిళలకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో శోభారాణి, విశాల, విజయశ్రీ, శైలకుమారి తదితరులు పాల్గొన్నారు.



స్వయం సహాయక మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో శనివారం సంగెం గ్రామంలో స్వయం సహాయక మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిళలకు వాటిని అందజేసి మాట్లాడారు. స్థానికంగా అదనపు ఆదాయ వనరులను పెంచుకునేందుకు ఇది మంచి మార్గమన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ ఏపీఎం భగవంతు, వీరేశ్, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌అదాలత్‌లో 2,798 కేసుల పరిష్కారం

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: లోక్‌అదాలత్ ద్వారా కేసులు సత్వరంగా పరిష్కారం చేయడానికి అవకాశం ఉంటుందని రాజేంద్రనగర్ మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, 11వ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ నీలిమ అన్నారు. శనివారం ఉప్పర్‌పల్లిలోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా మొత్తం 2798 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటిలో ఇరువర్గాల వారు రాజీపడిన కేసులు 257 ఉండగా, డ్రంకెన్ డ్రైవ్ కేసులు 1904, పరిపాలనకు సంబంధించి 326, పెట్టి కేసులు 74, విద్యుత్ చౌర్యం కేసులు 117, బ్యాంకు కేసులు 5 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు మెజిస్ట్రేట్‌లు రాజ్‌కిరణ్, అంకిత్, శిక్షణలో ఉన్న మెజిస్ట్రేట్‌లు స్వరిక, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గ్రామీణం: చేవెళ్ల కోర్టు ఆవరణంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ట్రాఫిక్‌కు సంబంధించిన 415 కేసులను పరిష్కరించి రూ.11,16,000 జరిమానా వసూలు చేశారు. 74 కేసుల్లో ఇరు వర్గాలకు రాజీ కుదిర్చారు. 75 చిన్న కేసులను పరిష్కరించి రూ.3లక్షలకు పైగా జరిమానా విధించారు. 970 పెట్టీ కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య, జూనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తీర్చాలని జలమండలి జీఎంకు వినతి

బండ్లగూడజాగీర్: జలమండలి జీఎం మహేందర్‌నాయక్ శనివారం బండ్లగూడజాగీర్ ఒకటో డివిజన్‌లో పర్యటించారు. తాగునీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ ఆయనకు విన్నవించారు. సమీపంలో ట్యాంకులు నిర్మించి ప్రారంభించినా నీటిసరఫరా చేపట్టడం లేదన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని జలమండలి జీఎం వారికి హామీ ఇచ్చారు.

## కాశీ అన్నపూర్ణ సత్రం కార్యవర్గంలో చోటు



టీజీ వెంకటేష్‌తో శంకర్, శ్రీనివాస్‌గుప్తా

షాద్‌నగర్ న్యూటౌన్: కాశీ అన్నపూర్ణ సత్రం కమిటీ కార్యవర్గంలో షాద్‌నగర్‌కు చెందిన మలిపెద్ది శంకర్ ఉపాధ్యక్షుడిగా, మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యారు. తిరుపతిలో శనివారం నిర్వహించిన సమావేశంలో తమకు ఈ బాధ్యతలు అప్పగించారని శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ ఛైర్మన్, తెదేపా నాయకుడు టీజీ.వెంకటేష్‌ను సన్మానించి బాధ్యతలు అప్పగించినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్టీసీ కార్గోసేవలను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్ న్యూటౌన్: వ్యాపారులు, రైతులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా సరకులను రవాణా చేయడానికి ఆర్టీసీ నిర్వహిస్తున్న (లాజిస్టిక్స్) కార్గోసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉష, కార్గో విభాగం ఇన్‌ఛార్జి శ్రీనివాస్ కోరారు. అందరికి అందుబాటులో ఉండేందుకు ప్రతి మండల కేంద్రంలో బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కౌంటర్ల లేని మండల కేంద్రాలకు కొత్తగా కౌంటర్లను ఇవ్వడానికి చర్యలు చేపట్టినట్లు ఔత్సాహికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నకిలీ దస్త్రాలతో ఇంటి స్థలం విక్రయం.. నలుగురిపై కేసు

శంషాబాద్, న్యూస్‌టుడే: నకిలీ దస్త్రాలను సృష్టించి ఓ ఇంటి స్థలాన్ని విక్రయించిన నలుగురిపై శనివారం శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా బాలనగర్ మండలం చిన్నరేవెల్లికి చెందిన తిరుమలయ్య-రామేశ్వరమ్మ దంపతులు వ్యవసాయ కూలీలు. ఉపాధి కోసం ఊటుపల్లికి వచ్చి ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తూ జీవిస్తున్నారు. ఊటుపల్లిలోని ఓ వెంచర్‌లో 240 చదరపు గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి రామేశ్వరమ్మ పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కుటుంబ అత్యవసర ఖర్చుల కోసం ఈసీఐఎల్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద ఇంటి స్థలం దస్తావేజులను పెట్టి రూ.50 వేల రుణం తీసుకున్నారు. ఇంటి స్థలంపై కన్నేసిన శ్రీనివాస్ నగదును తిరిగి చెల్లించినా దస్తావేజులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. అనంతరం తనకు తెలిసిన జిలానీ, జ్యోతి, బ్రహ్మంతో కలిసి రామేశ్వరమ్మ ఏజీపీఏ చేసినట్లు నకిలీ దస్తావేజులను శ్రీనివాస్ సృష్టించాడు. సిద్ధాంతికి చెందిన సురేఖకు విక్రయించడంతో ఆమె కుటుంబ సభ్యులు ఇంటి స్థలాన్ని చదును చేశారు. అనుమానం వచ్చిన తిరుమలయ్య మీసేవా కేంద్రంలో ఇంటి రికార్డులను పరిశీలించగా 2024 ఆగస్టు 23న సురేఖకు జిలానీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఉంది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**క్రైమ్ కార్నర్**

## నకిలీ పాస్‌పోర్ట్‌తో ప్రయాణించిన వ్యక్తి అరెస్టు

శంషాబాద్: నకిలీ పాస్‌పోర్ట్‌తో ప్రయాణించిన ఓ వ్యక్తిని భద్రతాధికారులు అరెస్టు చేసిన సంఘటన శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షాజహాన్ గతంలో సౌదీ అరేబియాలోని రియాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో అబ్దుల్ హకీం పాస్‌పోర్ట్‌పై తన ఫొటోను పెట్టుకుని సౌదీ అరేబియన్ ఎయిర్‌లైన్స్ విమాన సర్వీస్‌లో స్వదేశానికి బయల్దేరాడు. శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన షాజహాన్ ప్రవర్తనపై అనుమానం వచ్చిన ఇమ్మిగ్రేషన్ అధికారులు క్షుణ్నంగా తనిఖీలు చేయగా నకిలీ పాస్‌పోర్ట్‌గా గుర్తించారు. ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## కుటుంబ గొడవలతో భర్త బలవన్మరణం

కేశంపేట: కుటుంబ గొడవలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజ్‌కుమార్ వివరాల ప్రకారం... కేశంపేట మండలం దత్తాయపల్లికి చెందిన మామిడిపల్లి నర్సింహ(35) కొంత కాలంగా మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో డబ్బుల కోసం ఇతరుల దగ్గర అప్పులు చేస్తుండడంతో భార్యతో అతడికి తరచూ గొడవలు జరుగుతున్నాయి. రోజూ మాదిరిగా ఈ నెల 16న తాగి వచ్చి గొడవ పడటంతో భార్య గంగన్నగూడెంలోని బంధువుల ఇంటికెళ్లింది. దీంతో మనస్తాపానికి లోనైన నర్సింహ శుక్రవారం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు.





## సందడిగా జోనల్ స్థాయి క్రీడాపోటీలు

మహేశ్వరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. శనివారం మహేశ్వరం జోనల్ స్థాయి ఖో-ఖో పోటీలు తుక్కుగూడ పాఠశాల ఆవరణలో జిల్లా వ్యాయామ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జోనల్ కార్యదర్శి డిల్లీ రవి కుమార్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు ప్రారంభించారు. బాలుర విభాగంలో 50 జట్లు, బాలికల విభాగంలో 30 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో అండర్-17 ఎంజేపీ మహేశ్వరం, అండర్-14 జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల తుక్కుగూడ, బాలికల విభాగంలో టీజీటీడబ్ల్యూఆర్ఎస్ మహేశ్వరం గెలుపొందాయి.

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలకేంద్రంలోని ఉన్నతపాఠశాల మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు సందడిగా సాగాయి. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలకు సంబంధించిన బాలికల, బాలురకు సంబంధించిన నాలుగు జట్ల నుంచి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ పాండు చెప్పారు.

## తలకొండపల్లి తహసీల్దార్‌గా నాగార్జున

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి తహసీల్దార్‌గా నాగార్జున శనివారం విధుల్లో చేరారు. ఇక్కడి విధుల్లో ఉన్న తహసీల్దార్ రంగారెడ్డి కలెక్టరేట్‌లోని యూఎల్‌సీ విభాగానికి బదిలీ అయ్యారు.

## స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ

తుర్కయాంజాల్ పురపాలిక: పురపరిధిలో స్వచ్ఛత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఛైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధరెడ్డి సూచించారు. శనివారం తొర్రూర్‌లో మున్సిపాలిటీ పాలకవర్గం సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించారు.

# మహేశ్వరం

•మహేశ్వరం • ఇబ్రహీంపట్నం • కల్వకుర్తి

## రైతుల సీలింగ్ భూములు అన్యాక్రాంతం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన సీలింగ్ పట్టాల రైతులు శనివారం మండల తహసీల్దార్ సుదర్శన్ రెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. ప్రభుత్వం పేదలకు సీలింగ్ భూముల్లో పట్టాలిచ్చిందని, 18 మంది రైతులకు చెందిన సీలింగ్ భూములను కొందరు అక్రమంగా అన్యాక్రాంతం చేశారని, విచారించి తమకు న్యాయం చేయాలన్నారు. సీలింగ్ పట్టాలు కలిగిన రైతులు అందరికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు.

## రాజీమార్గమే రాజమార్గం

ఆమనగల్లు, న్యూస్‌టుడే: క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీ కుదుర్చుకుని పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి, లోక్ అదాలత్ ఛైర్మన్ కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు కోర్టులో శనివారం లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 153 కేసులను పరిష్కరించారు. ఏపీపీ కార్తీక్, ఆమనగల్లు, కడ్తాల్, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఆమనగల్లు ఎస్‌ఐలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## గున్‌గల్ పంచాయతీ రికార్డుల పరిశీలన

యాచారం: ఉత్తమ పంచాయతీల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయిలో ఎంపికైన యాచారం మండలం గున్‌గల్ గ్రామ పంచాయతీ రికార్డులను పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ శనివారం పరిశీలించారు. గ్రామ పంచాయతీకి సంబంధించి 250 వివరాలను ఇదివరకు ఆన్‌లైన్ చేశారు. వాటిలో నుంచి 16 అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రత్యేక అధికారి, తహసీల్దారు అయ్యప్ప, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, గ్రామ కార్యదర్శి శోభరాణి పాల్గొన్నారు.

# ప్రయాణానికి నిత్యం పాట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: శివారు ప్రాంతాల్లో అనేక విద్యాసంస్థల్లో వేలాది మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. నగరంతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని పలు హాస్టళ్లలో ఉంటూ చదువుతున్న విద్యార్థులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కళాశాలకు రోజు వెళ్లొచ్చే వారూ ఉంటారు. నిత్యం నగరం నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని వివిధ గ్రామాలకు, అటు యాదాద్రి భువనగిరి జిల్లాలోని కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతుంటాయి.



అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జాతీయ రహదారి కూడలి ఉదయం రద్దీ ఇలా..

### కాలు పెట్టే చోటున్నా బస్సు వెంట పరుగులు

అబ్దుల్లాపూర్‌మెట్ కూడలికి పదుల సంఖ్యలో ప్రైవేటు హాస్టళ్లు ఉన్నాయి. వేలాది మంది విద్యార్థులు అక్కడ ఉంటూ బీటెక్, బీఫార్మసీ, ఫార్మాడీ, ఎంబీఏ తదితర ఉన్నత చదువులు చదువుతుంటారు. ఈ క్రమంలో నిత్యం ఉదయం వేళ నగరం నుంచి ప్రయాణికులతో కిక్కిరిసి వచ్చే ఆర్టీసీ బస్సుల్లో కాలుపెట్టే చోటు దొరికినా చాలన్నట్లు విద్యార్థులు బస్సుల వెంట పరుగులు తీస్తుంటారు. విద్యార్థినులు సైతం ఫుట్‌బోర్డు మీద చోటు లభించినా.. గమ్యం చేరేందుకు ఆతృతగా బస్సుల్లో ఎక్కుతుంటారు. ఫుట్‌బోర్డులపై వేలాడుతూ.. ట్రాఫిక్ మధ్యలో బస్సులను ఎక్కేందుకు ప్రమాదకరంగా విద్యార్థులు పరుగులు తీస్తుంటారు.



ఆర్టీసీ బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ..

### ఉదయం, సాయంత్రం మరింత కిక్కిరిసి..

రాష్ట్ర ప్రభుత్వం బాలికలు, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడంతో ఈ ఏడాది బస్సుల్లో విద్యార్థినుల సంఖ్య మరింతగా పెరిగింది. శివారు కళాశాలలకు వందలాది మంది విద్యార్థులు ఆటోల్లో వెళుతున్నా.. ఆర్టీసీ బస్సుల్లో మాత్రం కాలుపెట్టే చోటు లేనంతగా రద్దీ ఉంటోంది. ఉదయం, సాయంత్రం అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి మీదుగా అటు గ్రామాలకు, ఇటు నగరానికి రాకపోకలు సాగించే ఏ బస్సయినా కిక్కిరిసి ఉంటుంది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచాలని పలువురు కోరుతున్నారు.

IN THE COURT OF THE HON'BLE II JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT, AT L.B.NAGAR
O.S.No. 638 of 2024
Between:-
Chiluka Surender And another ..Plaintiffs
And
1. Smt.Kadaveru Archana
2. All Concerned ..Defendants
To
ALL CONCERNED
Take notice that the Plaintiffs filed the above suit for Declaration declaring the Plaintiffs and Defendant No.1 as the Legal Heirs and Successors of Late Smt. C.Shyamala, W/o.Chiluka Surender, who died on 30-12-2023 and the suit is stands posted to 15/10/2024. If any person or persons having any Objections or Claims they may appear before the above Court on 15/10/2024 at 10.30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.
(BY ORDER OF COURT)
Sd/- M/s. K.Raja Reddy, A.V.Sujith Kumar, Advocates, Hyd.
Counsel for the Plaintiffs
Cell No. 9848065161

## పంచాయతీలకు నిధుల విడుదల

ఆదిభట్ల: రంగారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ఆర్థిక సంఘం రూ.7.48 కోట్ల నిధులను విడుదల చేసినట్లు జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి సురేష్ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. 3116 గ్రామ పంచాయతీల్లోని సిబ్బందికి రూ.3.13 కోట్లను కేటాయించామన్నారు.

## పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

జాపాల (మంచాల): నాలుగో శనివారం (నో బ్యాగ్‌డే) సందర్భంగా జాపాల ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలను తీసుకువచ్చి ప్రదర్శించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయులు బీమ్లానాయక్ అన్నారు.

## ఓటర్ల తుది జాబితా ప్రచురణ

మహేశ్వరం, కందుకూరు, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల ఎన్నికలకు ఓటరు ముసాయిదా తుది జాబితాను శనివారం మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డుపై, పంచాయతీ కార్యాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. మహేశ్వరం మండలం 30 పంచాయతీల్లోని 258 వార్డుల్లో మొత్తం 43,033 ఓటర్లు ఉన్నారు. కందుకూరు మండలం 35 పంచాయతీల్లోని 312 వార్డుల్లో మొత్తం 50,769 ఓటర్లు ఉన్నారని తెలిపారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను ప్రచురించి అన్ని గ్రామ పంచాయతీలకు పంపినట్లు ఎంపీడీవో వెంకటమ్మ చెప్పారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతారని చెప్పారు.

యాచారం: యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని 232 వార్డుల్లో మొత్తం 48,495 మంది ఓటర్లు ఉన్నారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద జాబితాను ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత విడుదల చేయగా గ్రామాల వారీగా గ్రామ కార్యదర్శులు జాబితాను విడుదల చేసి ప్రతులను నోటీసు బోర్డులో ఉంచారు. 390 అభ్యంతరాలు రాగా.. వాటిని పరిష్కరించినట్లు అధికారులు చెప్పారు.

## సమాజ శ్రేయస్సే లక్ష్యంగా సాంకేతికత అభివృద్ధి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: విద్యార్థులు తమ ప్రతిభకు సృజనాత్మకతను జోడించి సమాజం కోసం శాస్త్ర సాంకేతికతను వినియోగించే లక్ష్యంతో ముందుకు సాగాలని కలాం యూత్ ఎక్సలెన్స్ ఫౌండర్ నరేష్ ఇండియన్ పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లిపూర్‌లోని అన్నమాచార్య కళాశాలలో ఈసీఈ, సీఎస్ఈ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఆవిష్కార్ సాంకేతిక సదస్సును నిర్వహించినట్లు కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.అభిషేక్‌రెడ్డి తెలిపారు. డీఆర్‌డీఓ శాస్త్రవేత్త నిలాంగ్ త్రివేది పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. రోబోలు, డ్రోన్లు తదితరాలను విద్యార్థులు ఆవిష్కరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ చాటిన పలువురు విద్యార్థులకు రూ.లక్ష విలువైన బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ డా.పీవీ కృష్ణమూర్తి, కన్వీనర్లు డా.ఆరెంపుల శ్రీనివాసరావు, వి.రమేష్‌బాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న కలాం యూత్ ఎక్సలెన్స్ ఫౌండర్ నరేష్, వేదికపై శాస్త్రవేత్త నిలాంగ్ త్రివేది తదితరులు

# అసమాన పోరాట యోధుడు భగత్‌సింగ్

న్యూస్‌టుడే బృందం: భగత్‌సింగ్ పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఆయన ఆరుట్లలో నివాళులు అర్పించారు. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. యాచారం మండలం మాల్‌లో భగత్ సింగ్ చిత్రపటం వద్ద డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య, మండల అధ్యక్షులు విప్లవ కుమార్ తదితరులు నివాళి అర్పించారు. తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో సీపీఎం నాయకుడు జె.పెంటయ్య నివాళి అర్పించారు.



కుంట్లూర్ ఆర్ఎన్ఆర్ కాలనీలో..



ఆరుట్లలో..

## ఆకట్టుకున్న విద్యార్థుల ప్రతిభ

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్ మెట్ మండలం బాటసింగారం ప్రభుత్వ పాఠశాలలో టాలెంట్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ అంశాలపై నమూనాలు రూపొందించి ప్రదర్శించారు. మండల విద్యాధికారి జగదీశ్వర్, సీఎన్ఓ రమేష్, ప్రధానోపాధ్యాయురాలు సంతోష, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మహేశ్వరం: తుక్కుగూడ పురపాలక ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన బరిగెల హేమలత శనివారం జెన్నాయిగూడ లక్ష్మీనర్సింహస్వామి, శ్రీనగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురపాలక పట్టణ భాజపా అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, మాధవరెడ్డి, శ్రీశైలం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ బాధ్యతల స్వీకరణ

మంచాల: మంచాల ఎంఈఓగా రాందాస్ (బోడకొండ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## మూగ జీవులపై కరుణ చూపండి

ఆర్కేపురం: వీధి శునకాల రక్షణ బాధ్యత అందరిదని సేవ్ డాగ్స్ వ్యవస్థాపకురాలు ఉమాదేవి అన్నారు. ఆర్కేపురంలో జీహెచ్ఎంసీ, పీఎఫ్ఏ సంస్థ సౌజన్యంతో వీధి శునకాలకు యాంటీ రేబీస్ టీకాలను వేసి, వాటికి ఆహారం నీటి ట్యాంకులను ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ జంతువుల పట్ల దయ చూపాలని కోరారు.

## పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



మీర్‌పేటలో స్వచ్ఛత కార్యక్రమంలో మేయర్ దుర్గదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ విక్రమ్‌రెడ్డి, ఎన్ఐసీ ప్రతినిధులు

మీర్‌పేట న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని వక్తలు పేర్కొన్నారు. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ హైదరాబాద్ రీజినల్ కార్యాలయం ఆధ్వర్యంలో మీర్‌పేట కార్పొరేషన్ 16వ డివిజన్ ఆర్‌సీఐ రోడ్డులో స్వచ్ఛత-2024 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎన్ఐసీ అసిస్టెంట్ మేనేజరు కృష్ణప్రసాద్ సారథ్యంలో స్థానిక కార్పొరేటర్ ఎ.అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో ఎన్ఐసీ సిబ్బంది, స్థానికులు, మీర్‌పేట మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది కలిసి లయన్స్ భవన్ పరిసరాలతో పాటు మెయిన్‌రోడ్డును శుభ్రం చేశారు. మీర్‌పేట మేయర్ దుర్గదీప్‌లాల్, డిప్యూటి మేయర్ విక్రమ్‌రెడ్డి, ఎన్ఐసీ డీజీఎం ఆర్.లలితకళ, జిల్లెలగూడ గీతాంజలి లయన్స్ క్లబ్ ఛైర్మన్ ఎస్.సుధాకర్‌రెడ్డి, బంజార నాయకుడు దీప్‌లాల్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది 250 మందికి ప్రమాద బీమా పత్రాలు అందజేసి సన్మానించారు.

## తాజా మాజీ ఎంపీపీ కమ్లీ భర్త మృతి

కడ్తాల్ (ఆమనగల్లు), న్యూస్‌టుడే: కడ్తాల్ మండల పరిషత్తు తాజామాజీ ఎంపీపీ కమ్లీ భర్త, కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీపావత్ మోత్యానాయక్ (48) అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మైసిగండిలోని స్వగృహంలో మృతిచెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీసింగ్, ఆమనగల్లు తాజామాజీ ఎంపీపీ అనిత, తాజామాజీ జడ్పీటీసీలు తదితరులు నివాళి అర్పించారు.

## భార్యాపిల్లలు అదృశ్యం

పహాడీషరీఫ్: భర్త సినిమాకు వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో భార్య పిల్లలు కనిపించకుండా పోయారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి కథనం ప్రకారం.. మామిడిపల్లి రంగనాయకుల కాలనీలో ఉండే ముదావత్ సాయికుమార్, సుజాత(24)లు ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి మనోజ్(5), ధనుష్(2)లు సంతానం. ఈ నెల 27న భర్త సాయికుమార్ తుక్కుగూడలో దేవర సినిమా చూడటానికి వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు భార్యాపిల్లలు కనిపించకుండా పోయారు. అంతటా ఆరా తీసినా ఫలితం లేక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇంజనీరింగ్ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డిప్యూటీ సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సుబ్బరాంరెడ్డి సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయనతో పాటు యాంటీ నార్కోటిక్స్ సీఐ శ్రీనివాస్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ జీవన్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ డ్రగ్స్ ద్వారా యువత భవిష్యత్తును నాశనం చేయడానికి కొంత మంది ప్రయత్నిస్తుంటారని, వారికి దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ ఎక్కడైనా విక్రయిస్తే టోల్ ఫ్రీ 87126 71111 నంబరుకు వెంటనే ఫోన్ చేయాలని, డ్రగ్స్‌కు బానిసలుగా మారిన విద్యార్థులను మార్చడానికి టోల్ ఫ్రీ నంబర్ 14446కు ఫోన్ చేయాలన్నారు. గురునానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ జీఎస్ కోహ్లీ, ఎండీ సైనీ, డైరెక్టర్లు, ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సుబ్బరాంరెడ్డి, శ్రీనివాస్‌రావు, జీవన్‌రెడ్డి తదితరులు



## సార్వత్రిక ప్రకటన

మా క్లయింట్లు (i) ఎస్. అనిల్ కుమార్ రెడ్డి తండ్రి స్వర్గీయ ఎస్. రామచంద్రారెడ్డి, (ii) ఎస్. సునిల్ రెడ్డి తండ్రి స్వర్గీయ ఎస్. రామచంద్రారెడ్డి, (iii) బుద్ధం అనితారెడ్డి తండ్రి స్వర్గీయ ఎస్. రామచంద్రారెడ్డి, (iv) తోట సునితారెడ్డి తండ్రి స్వర్గీయ ఎస్. రామచంద్రారెడ్డి గారి సూచనల మేరకు ప్రజానీకానికంతటికి తెలియజేయునది ఏమనగా దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తులకు వారు సర్వహక్కులుగల యజమానులు మరియు స్వాధీనతాదారులుగా ఉన్నారు. ఇటీవల వారి తల్లి శ్రీమతి ఎస్. కమలాభాయ్ భర్త స్వర్గీయ ఎస్. రామచంద్రారెడ్డి వారిని తన న్యాయవారసులుగా వెల్లడించి మరణించారు. ఆమె జీవితకాలంలో, ఎల్.బి.నగర్ వద్ద రంగారెడ్డి జిల్లా, గౌరవనీయ II అడిషనల్ జిల్లా జడ్జి సమక్షంలో O.S.నెం.377/2023 ద్వారా టైటిల్ వెల్లడి కొరకు మరియు శాశ్వత నిషేధాజ్ఞ కొరకు స్వయంగా దావా దాఖలు చేశారు. అది అపరిష్కృతంగా ఉన్నది. తన కుమారులు మరియు కుమార్తెలకు దిగువ తెలిపిన షెడ్యూలు ఆస్తులను సమానంగా ఇవ్వడానికి రిజిస్టర్డ్ విల్‌డీడ్‌ను కూడా ఆమె రాశారు. ఏవిధంగానూ ఎలాంటి హక్కులు లేని కొందరు థర్డ్‌పార్టీలు వారి యజమాన్యత మరియు స్వాధీనత హక్కులతో షెడ్యూలు ఆస్తుల మీద జోక్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని నా క్లయింట్లకు తెలియవచ్చింది. నా క్లయింట్లు మినహా, మరెవరూ షెడ్యూలు ఆస్తుల మీద ఎలాంటి హక్కులు కలిగి లేరని ఇందుమూలముగా తెలియజేయడమైనది. అందువలన, సర్వహక్కులుగల యజమానులతో కాకుండా, మరెవ్వరితోనూ ఏవిధంగానూ షెడ్యూలు ఆస్తులకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు కుదుర్చుకొనరాదని హెచ్చరించడమైనది. ఈ నోటీసును కాదని ఏదేని లావాదేవీ కుదుర్చుకొన్నట్లయితే, అది వారి స్వంత నష్ట పూచీ మీద చేసినట్లు అవుతుంది మరియు ఏవిధంగానూ సదరు లావాదేవీకి నా క్లయింట్లు ఎలాంటి బాధ్యత వహించరు.

### షెడ్యూలు ఆస్తులు

రంగారెడ్డి జిల్లా, కందుకూరు గ్రామం మరియు మండలం రెవిన్యూ పరిధిలలో గల ఎక.81.01 గుంటల విస్తీర్ణపు వ్యవసాయ భూములు యావత్తు. సదరు భూములు 14 వేర్వేరు ప్రాంతాలలో ఉన్నవి. అందువలన అవి నిర్దిష్ట సరిహద్దులతో వివిధ ఐటములుగా చూపబడినవి.

**ఐటం నెం.1**

| క్ర.సం. | సర్వే నెం. | మొత్తం విస్తీర్ణం (ఎ.గుంటలు) | బుద్ధం బావి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 3 | 0-23 | ఉత్తరం: S.కమలాభాయ్; దక్షిణం: కుషాల్ రెడ్డి HMDA వెంచర్; తూర్పు: S.కమలాభాయ్; పడమర: T.జంగారెడ్డి |
| 2 | 4 | 0-09 | |
| 3 | 208 | 0-05 | |
| 4 | 209 | 0-32 | |
| 5 | 15 | 0-29 | |

**ఐటం నెం. 2**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | దోశం బావి, సంపతేని బొంద సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 17 | 1-20 | ఉత్తరం: అట్ల నర్సింహ; దక్షిణం: S.కమలాభాయ్; తూర్పు: S.కమలాభాయ్; పడమర: అవినాష్ రెడ్డి |
| 2 | 43 | 1-25 | |

**ఐటం నెం. 3**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 20 | 0-30 | ఉత్తరం: S.నరోత్తం రెడ్డి; దక్షిణం: టి.సంజీవ్‌రెడ్డి మరియు ఇతరులు; తూర్పు: A.అవనీష్ రెడ్డి; పడమర: S.ఊర్మిలా రెడ్డి |
| 2 | 21 | 0-09 | |
| 3 | 26 | 0-15 | |
| 4 | 29 | 0-17 | |

**ఐటం నెం. 4**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | మావిళ్ల బావి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 32 | 0-14 | ఉత్తరం: S.నరోత్తం రెడ్డి; దక్షిణం: S.శ్రీనివాస్ రెడ్డి; తూర్పు: S.నరోత్తం రెడ్డి; పడమర: శ్రీనివాస్‌రెడ్డికి రోడ్ |
| 2 | 33 | 0-17 | |
| 3 | 34 | 1-02 | |
| 4 | 35 | 0-24 | |
| 5 | 36 | 0-29 | |
| 6 | 37 | 0-16 | |
| 7 | 38 | 0-10 | |
| 8 | 39 | 0-20 | |
| 9 | 40 | 0-13 | |

**ఐటం నెం. 5**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | జాలు ఒడికె సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 30 | 0-38 | ఉత్తరం: రోడ్; దక్షిణం: S.శ్రీనివాస్ రెడ్డి; తూర్పు: రోడ్; పడమర: S.నరోత్తం రెడ్డి |
| 2 | 31 | 0-01 | |
| 3 | 57 | 0-14 | |
| 4 | 62 | 0-23 | |

**ఐటం నెం. 6**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | తుపాకి చెరువు సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 63 | 2-24 | ఉత్తరం: S.సూర్యప్రకాష్‌రెడ్డి; దక్షిణం: రోడ్; తూర్పు: చిలుకల జంగయ్య; పడమర: రోడ్ |

**ఐటం నెం. 7**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | బొనసుల బావి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 78 | 8-30 | ఉత్తరం: S.కమలాభాయ్; దక్షిణం: రాజేందర్‌రెడ్డి మరియు ఇతరులు; తూర్పు: రాజేందర్‌రెడ్డి మరియు ఇతరులు; పడమర: రోడ్ |

**ఐటం నెం. 8**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | ఎడోగోని బావి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 80 | 0-22 | ఉత్తరం: రోడ్; దక్షిణం: S.శ్రీనివాస్‌రెడ్డి; తూర్పు: రోడ్; పడమర: S.నరోత్తం రెడ్డి |
| 2 | 81 | 0-23 | |
| 3 | 82 | 6-05 | |

**ఐటం నెం. 9**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | ఇడుపలుగుల గడ సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 994 | 14-22 | ఉత్తరం: గోపిరెడ్డి మరియు ఇతరులు; దక్షిణం: రాజేందర్ రెడ్డి; తూర్పు: కందుకూరు నుండి గూడూరు రోడ్; పడమర: హేమలతారెడ్డి నుండి పర్మా రోడ్ |

**ఐటం నెం. 10**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | కిష్టమ్మ చెలుక సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 502 | 3-39 | ఉత్తరం: S.వెంకట్‌రెడ్డి మరియు ఇతరుల భూమి; దక్షిణం: గంగిడి పుల్లారెడ్డి మరియు ఇతరులు; తూర్పు: రోడ్; పడమర: S.సత్యనారాయణ రెడ్డి మరియు S.నరోత్తం రెడ్డి |

**ఐటం నెం. 11**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | తుమ్మలపంపు సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 803 | 0-10 | ఉత్తరం: పద్మ భాగ్యమ్మ భర్త యాదయ్య; దక్షిణం: S.సుగుణాకర్ రెడ్డి; తూర్పు: టి.కృష్ణారెడ్డి; పడమర: ప్రభుత్వ భూమి |
| 2 | 804 | 0-18 | |
| 3 | 805 | 0-14 | |
| 4 | 806 | 0-18 | |
| 5 | 807 | 0-17 | |
| 6 | 808 | 0-15 | |
| 7 | 809 | 0-18 | |
| 8 | 810 | 0-16 | |
| 9 | 816 | 0-19 | |
| 10 | 817 | 0-09 | |
| 11 | 844 | 0-14 | |
| 12 | 845 | 0-13 | |
| 13 | 849 | 0-19 | |
| 14 | 850 | 0-14 | |

**ఐటం నెం. 12**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | పట్టికొయ్య గడ్డకి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 998 | 6-01 | ఉత్తరం: S.నరోత్తమ్‌రెడ్డి; దక్షిణం: ప్రభాకర్ రెడ్డి నుండి గ్రామ రోడ్; తూర్పు: ఫార్మా రోడ్; పడమర: S.నరోత్తమ్ రెడ్డి |
| 2 | 999 | 4-29 | |
| 3 | 1000 | 4-18 | |

**ఐటం నెం. 13**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | చింత తోటకి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 1001 | 10-17 | ఉత్తరం: S.శ్రీనివాస్‌రెడ్డి; దక్షిణం: కొడిగంటి అంజయ్య మరియు ఇతరులు; తూర్పు: రోడ్; పడమర: రోడ్ |
| 2 | 1002 | 1-02 | |

**ఐటం నెం. 14**

| క్ర.సం. | సర్వే నెం. | విస్తీర్ణం (ఎ.గుంటలు) | తుపాకి చెరువుకి సరిహద్దులు |
|---|---|---|---|
| 1 | 1009 | 0-30 | ఉత్తరం: రోడ్; దక్షిణం: S.సుగ్నాకర్ రెడ్డి; తూర్పు: S.రంగారెడ్డి; పడమర: S.విఠల్ రెడ్డి |

సం/- కిరణ్ పాలకుర్తి & అసోసియేట్స్, అడ్వకేట్స్
ఫ్లాట్ నెం.202, వందన సెలెస్టా అపార్ట్‌మెంట్స్, ప్లాట్ నెం.1, రోడ్ నెం.13, అలకాపురి కొత్తపేట, హైదరాబాద్-500035.
M: 7893663999, 9885162435 / kiranjdg@gmail.com

## కనులపండువగా నల్సార్ స్నాతకోత్సవం

శామీర్‌పేట, న్యూస్‌టుడే: నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయంలో ప్రముఖుల ప్రసంగాలు, విద్యార్థుల కోలాహలంమధ్య 21వ స్నాతకోత్సవం కనులపండువగా శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మ తమదైన శైలిలో విద్యార్థులను ఉత్తేజపర్చారు. రాష్ట్రపతి మధ్యాహ్నం 12.15నుంచి 3.12 గంటల వరకు సమయాన్ని వెచ్చించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ కులపతి జస్టిస్ ఆలోక్ ఆరాధే స్నాతకోత్సవాన్ని మధ్యాహ్నం 12.20గంటలకు ప్రారంభించారు. విద్యార్థులకు పట్టాల పంపిణీ, ఉత్తమ విద్యార్థులకు 57 బంగారు పతకాల ప్రదానం పూర్తయ్యేవరకు రాష్ట్రపతి వేదికపైనే ఉన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిఎస్.నరసింహన్, రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, నల్సార్ వీసీ ఆచార్య శ్రీకృష్ణదేవరావు, రిజిస్ట్రార్ ఎన్.వాసంతి, కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా పాల్గొన్నారు. బీఏ ఎల్‌ఎల్‌బీలో 10 బంగారు పతకాలను సాధించిన విద్యార్థి భవ్య జోహరి, 7 బంగారు పతకాలు సాధించిన అమిషీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ముఖ్య అతిథి ప్రశంసలు అందుకున్నారు.

## హృద్రోగ సమస్యలతో అధికంగా మరణాలు



సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంగీతారెడ్డి

మాదాపూర్, న్యూస్‌టుడే: హృద్రోగ సమస్యలతో అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని అపోలో హాస్పిటల్ ఎండీ డాక్టర్ సంగీతారెడ్డి అన్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్(ఏహెచ్‌ఏ), ఇంటర్నేషనల్ లైజన్‌కమిటీ ఆన్ రెసిసిటేషన్, అపోలో హాస్పిటల్ ఆధ్వర్యంలో మాదాపూర్ హెచ్ఐసీసీలో హృదయ సంబంధ వ్యాధుల నిర్వహణపై శనివారం సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంగీతారెడ్డి హాజరై మాట్లాడారు. అపోలో ఎమర్జెన్సీ విభాగం హెడ్ డాక్టర్ ఇమ్రాన్ సుభాన్ మాట్లాడుతూ.. చికిత్స విధానాలపై వైద్యులు, నర్సులకు సరైన శిక్షణఇవ్వడం సదస్సు లక్ష్యమన్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ సచిన్ మీనన్, ఏహెచ్ఏ ఇంటర్నేషనల్ బిజినెస్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ క్రిస్‌డీ ఎస్పోసిటో తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాల నివారణ



సదస్సుకు హాజరైన సీపీ అవినాష్ మహంతితో ఐఎస్‌ఏసీఏ ప్రతినిధుల బృందం

మాదాపూర్, న్యూస్‌టుడే: అవగాహన, అప్రమత్తతో సైబర్ నేరాల నివారణ సాధ్యమని సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి అన్నారు. పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ 1930 నంబరు గుర్తుపెట్టుకోవాలనారు. శనివారం మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఐఎస్ఏసీఏ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీపీ హాజరై ప్రసంగించారు. రాష్ట్ర ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ.. దేశంలో నిమిషానికో రెండు సైబర్ కేసు నమోదవుతోందన్నారు. గంటకు రూ.80లక్షల డబ్బును కొల్లగొడుతున్నారన్నారు. ఐఎస్ఏసీఏ హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షులు జీసీఎస్‌శర్మ, ఉపాధ్యక్షులు దినేశ్‌దాస్, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి వెంకట్‌రామ్, మెంబర్‌షిప్ డైరెక్టర్ రాజ్‌పవర్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనల ఉల్లంఘన.. 17 పబ్బులపై కొరడా

ఈనాడు, హైదరాబాద్: అనుమతికి మించి శబ్దాలతో స్థానికులకు అసౌకర్యం కలిగిస్తున్న 17 పబ్బులపై సైబరాబాద్ పోలీసులు కేసులు నమోదుచేశారు. పోలీసులు, కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారులతో కూడిన మూడు బృందాలు శుక్రవారం సాయంత్రం తర్వాత మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం తదితర ప్రాంతాల్లోని పబ్బులపై ఒకేసారి దాడులు చేశాయి. నిబంధనల ఉల్లంఘనను గుర్తించి 17పబ్బులపై కేసు నమోదుచేసినట్లు మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్ తెలిపారు.

## ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.





సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

**మరిన్ని వివరాలకు..**
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

## విద్యపై ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిద్దాం: ప్రొ.శాంతా సిన్హా



వేదికపై ప్రతినిధులు ఎంఏ షకీల్, పీఎల్ విశ్వేశ్వర్‌రావు, అశోక్ అగర్వాల్, ప్రొ.శాంతా సిన్హా, నవిక హర్షే

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వాలు విద్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) మాజీ ఛైర్‌పర్సన్ ప్రొ.శాంతా సిన్హా అన్నారు. ఎంవీ ఫౌండేషన్, చైల్డ్ రైట్స్‌ఫోరం, మదర్స్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో విద్యపై బహిరంగ చర్చ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న వాలంటీర్లు వారి ప్రాంతాల పాఠశాలల్లో సమస్యలపై వివరించారు. రాష్ట్రంలోని చాలా పాఠశాలల్లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవన్నారు. శాంతా సిన్హా మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ సమస్య పరిష్కారమయ్యేవరకు పోరాటం చేయాలన్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది అశోక్‌అగర్వాల్ ప్రసంగించారు. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి అధ్యక్షతన వహించగా ప్రొ.పీఎల్ విశ్వేశ్వర్‌రావు, హైకోర్టు న్యాయవాది ఎంఏ షకీల్, ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ రీసెర్చ్ ముఖ్యఅధికారి నవికహర్షే, వివిధ సంస్థల ప్రతినిధులు పృథ్వీరాజ్, తేజ, శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

## మంచి అలవాట్లతోనే జీవన ప్రమాణాలు మెరుగు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.శ్రీధర్ కస్తూరి, హృద్రోగ నిపుణులు

బేగంపేట, న్యూస్‌టుడే: మంచి అలవాట్లతోనే జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి, ఇంటర్నేషనల్ కార్డియో థోరాసిక్ సర్జన్ డా.శ్రీధర్ కస్తూరి అన్నారు. రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామంలేదా వాకింగ్ చేస్తూ ఒత్తిడి లేని జీవనం అలవర్చుకోవాలన్నారు. ప్రపంచ హార్ట్ డే వేడుకలను శనివారం బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆసుపత్రిలో నిర్వహించారు. డా.శ్రీధర్ కస్తూరి రాసిన కేస్ బెస్ట్ ఓటీటీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. సీనియర్ కార్డియాలజిస్టులు శైలేందర్‌సింగ్, ఎస్.విజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్.రాజారాం, సందీప్ జనార్దన్, నరసింగరావు, డి.లింగస్వామి, ప్రణయ్, కావ్య పాల్గొన్నారు. హృద్రోగ చికిత్సలు, ఇతర సేవలందించిన పలువురిని సత్కరించారు.

## తుపాకీతో కాల్చుకొని ఏఆర్ కానిస్టేబుల్ బలవన్మరణం



బాలకృష్ణ

ఆదిభట్ల, న్యూస్‌టుడే: ఆర్థిక కారణాలతో మొదటిసారి ఆత్మహత్యాయత్నం చేయగా.. ప్రాణాపాయం నుంచి బయటపడిన ఓ ఏఆర్ కానిస్టేబుల్‌కి సొంత ఊర్లో, స్నేహితుల నుంచి అవమానాలు ఆగలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై తుపాకీతో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మంచాల గ్రామానికి చెందిన దూసరి సత్తయ్య గౌడ్ కుమారుడు బాలకృష్ణ గౌడ్ (28) ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. నెలనుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ట్రెజరీ గార్డ్ రూమ్‌వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం తెల్లవారు జామున 3:30 గంటలకు కలెక్టరేట్‌లోని బాత్రూంలోకి వెళ్లి తుపాకీతో తలకు కాల్చుకొని కుప్పకూలాడు. తోటి ఉద్యోగులు గమనించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఇతడు రెండేళ్ల కిందటే ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు ప్రయత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ విషయమై గ్రామంలో, స్నేహితుల నుంచి తరచూ అవమానాలు ఎదురవుతున్నాయని, వీటిని తట్టుకోలేకే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐజీ సుమతి పేరిట ఫేస్‌బుక్ నకిలీ ఖాతాలు

ఈనాడు, హైదరాబాద్: మాయగాళ్లు ఏ ఒక్కరినీ వదలట్లేదు.. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు లక్ష్యంగా చేసుకొని మోసాలకు తెగిస్తున్నారు. ఎస్ఐబీ ఐజీపీ బి.సుమతి పేరిట ఫేస్‌బుక్ నకిలీ ఖాతాలు సృష్టించారు. నగర సైబర్‌క్రైమ్ పోలీసులకు ఆమె ఫిర్యాదుచేశారు. బి.సుమతి పేరిట అధికారికంగా ఫేస్‌బుక్ ఖాతా నిర్వహిస్తున్నారు. ఆమె పేరుతో ఏకంగా 18 నకిలీ ఖాతాలను సృష్టించిన మాయగాళ్లు స్నేహ అభ్యర్థన పంపుతున్నారు. స్పందించిన వారి నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఆమె గుర్తించి సైబర్‌క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అప్పులు భారమయ్యాయి.. ఆత్మహత్య చేసుకుంటున్నా

### భార్యకు సెల్ఫీ ఫొటో పెట్టి.. ఆటో డ్రైవర్ బలవన్మరణం



సెల్ఫీ ఫొటో పెట్టిన వీరేశ్

కాప్రా, న్యూస్‌టుడే: 'నిన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. అప్పులు భారమయ్యాయి. నిన్ను, పిల్లలను బాగా చూసుకోలేక పోతున్నా.. సారీ నేను చనిపోతున్నాను.. క్షమించు' అని భార్యకు కాల్ చేసి, వాట్సాప్‌లో సెల్ఫీ ఫొటోపెట్టి భర్త బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ నర్సింహ్మా కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన పత్లావత్ వీరేశ్(28) ఆటో డ్రైవర్. బతుకుదెరువుకు వచ్చి చర్లపల్లిలోని బీఎన్‌రెడ్డినగర్‌లో ఉంటున్నారు. అతని భార్య ప్రైవేటు ఉద్యోగి. వీరికి 9, 7ఏళ్ల వయసు కుమార్తెలున్నారు. అప్పుల బాధతో ఆటోను అమ్మేశాడు. అప్పులిచ్చినవారు ఒత్తిడి ఎంచారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యకు కాల్ చేసి చెప్పి సెల్ఫీ ఫొటో పంపి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. వెంటనే అన్న గోపాల్‌నాయక్ ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితంలేకపోయింది.

## గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఓ మహిళను దారుణంగా హత్య చేసి చెత్తకవర్‌లో చుట్టి ఇళ్లమధ్య పడేసిన ఘటన షాద్‌నగర్‌లో శనివారం వెలుగుచూసింది. ఏసీపీ రంగస్వామి, సీఐ విజయ్‌కుమార్‌లు వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాసకాలనీలో గుర్తుతెలియని మహిళ(40) మృతదేహం పడి ఉంది. స్థానికులు సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చెవికమ్మల కోసం దుండగులు మహిళ చెవులు కత్తిరించి అనంతరం హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## సంతానోత్పత్తిలో సవాళ్లను అధిగమించాలి: డా.భాస్కర్‌రావు



వైద్య నిపుణులతో కలిసి సదస్సును ప్రారంభిస్తున్న డా.భాస్కర్‌రావు

బేగంపేట, న్యూస్‌టుడే: సంతానోత్పత్తిలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలని కిమ్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డా.భాస్కర్‌రావు అన్నారు. ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బేగంపేటలోని తాజ్ వివంతా హోటల్‌లో శనివారం 'ఫెర్టి ప్రొటెక్ట్ -2024' 11వ అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా.భాస్కర్‌రావు మాట్లాడుతూ సంతానోత్పత్తి సంరక్షణలో ఆధునిక విజ్ఞానం, పరిశోధనలు పంచుకునేందుకు వైద్య నిపుణులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ ఛైర్‌పర్సన్ కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్ హెడ్ డా.వైజయంతి, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు డా.మాధురి పాటిల్ తదితరులు ప్రసంగించారు.

## ఎలక్ట్రిక్ వాహనం టెక్నీషియన్‌గా ఉచిత శిక్షణ

అంబర్‌పేట: డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని యువతకు ఎలక్ట్రిక్ వాహనాల సర్వీస్, మెయింటెనెన్స్ టెక్నీషియన్‌గా మూణ్నెల్ల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని సీనియర్ మేనేజర్ రాఘవేందర్‌రావు శనివారం వెల్లడించారు. 18-28 ఏళ్లలోపు వయసు కలిగి.. ఐటీఐ, డిప్లొమాలో ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటో మొబైల్ కోర్సులు పూర్తిచేసిన వారు శిక్షణకు అర్హులన్నారు. 91541 69212, 96036 90068 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలన్నారు.

| చికెన్ ధరలు | | | |
|---|---|---|---|
| ఫాంరేటు | 125-00 | డ్రెస్డ్ | 213-00 |
| రిటైల్ | 147-00 | స్కిన్‌లెస్ | 243-00 |

# చిట్టి గుండెలకు అండగా నిలిచి.. ఆనందాన్ని పంచి!

### బ్రిటన్ వైద్యబృందం సారథ్యంలో విజయవంతంగా గుండె చికిత్సలు

నిమ్స్, న్యూస్‌టుడే: ఆ చిట్టి గుండెలకు పెద్ద కష్టమే వచ్చింది. ఏ కార్పొరేట్ ఆస్పత్రికి పోయినా రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తేల్చి చెప్పారు. అంత మొత్తం చెల్లించలేక తల్లిదండ్రులు పడరాని పాట్లు పడ్డారు. పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో బ్రిటన్ వైద్య బృందం ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తోందని తెలిసి ఆశగా ఆస్పత్రికి పరుగులు పెట్టారు. రోజుల వ్యవధిలోనే చిట్టి గుండెల కష్టాలు తీరాయి. ఏ తల్లిని చూసినా తన బిడ్డ గుండె చప్పుడు ఇకఆగదని ఆనందంతో మురిసిపోతున్నారు. బ్రిటన్ వైద్య బృందం, నిమ్స్ వైద్యుల సహకారంతో పూర్తయిన 18మంది చిన్నారుల శస్త్ర చికిత్సలతో వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

### ప్రైవేటుకు వెళ్తే రూ.5లక్షలడిగారు



మాపాప జస్మిక(ఏడాది)కి కొన్ని నెలల క్రితమే గుండెలో రంధ్రం ఉందని రక్తసరఫరా సక్రమంగా జరగడం లేదని తెలిసింది. కార్పొరేట్ ఆస్పత్రికెళ్తే రూ.5లక్షలు అవుతుందన్నారు. అంత చెల్లించలేక నిమ్స్‌లో ఉచితంగా చేస్తున్నట్లు తెలిసి ఇక్కడికి వచ్చాం. 3 రోజుల క్రితం శస్త్ర చికిత్సను పూర్తి చేశారు. 26న పాప పుట్టినరోజునువైద్యులే నిర్వహించారు. **- నాగమణి, హయత్‌నగర్**

### ప్రాణాలు నిలిపిన నిమ్స్



ఇందుమతి(6) రెండేళ్లున్న సమయంలోనే నాన్న వాళ్ల అమ్మపై అనుమానంతో చంపడంతోపాటు పాపను చంపేందుకు యత్నించి ఆత్మహత్య చేసుకున్నాడు. పాప ప్రాణాలతో బయటపడింది. అప్పటినుంచి కాపాడుకుంటున్నాం. 25 రోజుల క్రితం తీవ్రజ్వరం వస్తే నిలోఫర్‌కి తీసుకెళ్లాం. గుండెకు రంధ్రం ఉన్నట్లు తేలింది. నిమ్స్‌కు వస్తే చికిత్స చేశారని చిన్నారి పెదనాన్న మోతీలాల్ చెప్పారు. **- మోతీలాల్, ఇందుమతి పెద్దనాన్న**

### శస్త్రచికిత్సలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉంది



ఇండియాలో చిన్నారులకు శస్త్ర చికిత్సలు చేసేందుకు ఓ బృందం వెళ్తున్నట్లు తెలిసింది. నన్నూ ఆహ్వానించారు. వారంపాటు నిర్వహించిన ప్రతి ఆపరేషన్ కీలకమైంది. వైద్యులందరూ శ్రమించి చికిత్స అందించారు. అందరూ కోలుకుంటున్నారు. ఈ అనుభావాన్ని ఎప్పటికీ మరిచిపోలేను. **- డాక్టర్ బర్‌బారా, బ్రిటన్**

### వచ్చే ఏడాది కూడా నిర్వహిస్తాం



విజయవంతగా చిన్నారుల గుండె శస్త్రచికిత్సలు పూర్తి చేశాం. వచ్చే ఏడాది కూడా నిర్వహిస్తాం. 14 రోజుల పాప దగ్గరి నుంచి 12ఏళ్ల చిన్నారి వరకు నిర్వహించాం. విదేశంలో స్థిరపడినా సొంత రాష్ట్రంలో ఇలాంటి వైద్యం అందించడం ఆనందాన్నిస్తోంది. ఈతరహా చికిత్సల కోసం నిమ్స్ వైద్యులు ఎంతో శ్రమిస్తున్నారు. **- రమణ ధన్నపనేని, బ్రిటన్ వైద్యుడు**

### దాతలు రక్షణగా నిలబడాలి



బ్రిటన్ వైద్య బృందంతో నిమ్స్ వైద్యులు

గుండె సమస్యలతో బాధపడే చిన్నారులు వేలమంది ఉన్నారని బ్రిటన్ వైద్య నిపుణుడు రమణ ధన్నపనేని అన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రి కార్డియోథొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, బ్రిటన్‌బృందం సమన్వయంతో చేసిన ఉచిత గుండె శస్త్రచికిత్సలు శనివారం ముగిశాయి. ఆస్పత్రి వైద్యులు బ్రిటన్ బృందాన్ని సత్కరించారు. రమణ మాట్లాడుతూ వారం పాటు 700 మంది చిన్నారులను పరీక్షించామని, సంక్లిష్టమైన 18మంది చిన్నారులకు చికిత్సలను పూర్తి చేశామన్నారు. బ్రిటన్ వైద్యులు వెళ్లిపోయినా, ఇక్కడ చికిత్సలు కొనసాగుతాయని డా.అమరేశ్వరరావు చెప్పారు. అసోసియేట్ డీన్ సాయిసతీశ్, వైద్యులు ప్రవీణ్, రామకృష్ణ, బ్రిటన్ వైద్యులు పాల్గొన్నారు.

**NOTICE**

To: 1] **Manikonda Sayamma, W/o. late Muthiah,** R/o. 1-24, Gachibowli Village, Serilingampally Mandal, Ranga Reddy District, Hyderabad.
2] **S.V.Badari Narayan, S/o. late Venkata Chary,** R/o.1-2-593/59, Flat no.503, Lotus Gagan Vihar Apartments, Gagan Mahal, Domalguda, Hyderabad.
3] **Srinivas R. Satuluri, S/o. late Venkata Chary,** Residing at 3, Cardinal Road, Kommodel, New Jersey 07733 USA
4] **Kommanduri Janaki, W/o. K.K. Narayan,** R/o D-Block, G-1, SBI Officers Quarters, Opp. Hyderabad Central University, Gachibowli, Hyderabad-500019.
5] **Padmavathi Nandyal, W/o. Ranganath Nandyal,** R/o 462-B, First Floor, 15th cross, Ideal Homes Town ship, Rajarajeshwari Nagar, Bangaluru - 500989
6] **D. Venkateshwar Rao S/o D. Pattabhi Ramaiah,** R/o 8-3-319, Yellareddyguda, Hyderabad.

Take notice that the above Appeal, **AS.No.380/2024** on the file of the High Court for the State of Telangana, at Hyderabad, is preferred by T Prabhakar Rao, against the decree and judgment in **O.S.No.104/2023** of the Court of the VI Additional District Judge, Ranga Reddy District, at Kukatpally, dated **22-04-2024**. Along with the appeal, **IA.No. 1/2024** is filed praying for grant of an interim injunction in favour of the appellant in respect of the suit schedule property. In view of the fact that the notices sent to you by registered post acknowledgment were returned un-served and un-claimed, the Hon'ble Court by an order dated **12-09-2024** ordered issuance of notice through substituted service by way of paper publication. Hence this notice. Therefore, you are hereby put on notice that the above appeal along with the **IA.No.1/2024** stands posted to **16-10-2024** for your appearance before the Hon'ble Court and you may appear on the said date of hearing before Hon'ble Court to represent your cause in the matter, failing which, the matter would be decided in your absence.

Sd/- **P.BALAJI VARMA,** Advocate
#6-3-570/1, 6th Floor, Diamond Block, Lumbini Rockdale, Somajiguda, Hyderabad-500082.
Mobile : 9848033188



**ఇబ్రహీంపట్నం (జనహర్ష)** కోహెడ, రాందాస్‌పల్లి, మంగళ్‌పల్లి, కొంగరకలాన్, ఆదిబట్ల, తుర్కయాంజల్, నాదర్‌గుల్, మహేశ్వరం & శంషాబాద్ (VVR వెంచర్)లలో ప్లాట్స్ అమ్మాలన్నా, కొనాలన్నా. Ph: 7523941456

### SECUNDERABAD

**266 Sq.Yards** W/F AP Text Book Colony Gunrock 200 Sq.Yards N/W/F Kiran Enclave Diamond Point ✆ 9949986656, 9533633010.

**Sec'bad, Bowenpally,** Soujanya Colony, East Face 154, 240 & West Face 200 Sq.yds For Sale. Gated Community. Ph: 7842649941.

**Risala Bazar** 111 S/Y G 1BHK 1st Flr, 2BHK W/F 3 Years old 1 Cr. Comm Plot Sale. Lalaguda Shanti Ngr. N/F 76 S/Y 75L Neg. ✆ 9346126453.

**Mahendra Hills,** Secunderabad four plots side by side each 125sq.yds x 4Plots= 500yds. With construction permission Owner: 9989125678.

### SHADNAGAR

**Launching &** Dussera Offer: Buy 242 Sq.Yds Farm Plot get Free 1 BHK Farm House 6999/- per Sq.Yd. Shadnagar nr. RRR 9676606974.

**Balanagar 544,** Sqyds Corner Plot East 80 Feet South 60 Feet, 2 Side Roads Open Plot Sale Ph: 9182536594

**Kothur, HMDA** Approved Villa Plots on JP Darga Road with all Development at very Reasonable Cost for dtls. ✆ 9951080002.

**TLR Ventures** DTCP Approved with LP No. 09/2024 Villa Plots @ Shadnagar. Beside Bangalore Highway, Bank Loan. 9000053259.

**నెల నెలా** వాయిదాలో 100 గజాలు షాద్‌నగర్, కంసంపల్లి 50 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ, DTCP & RERA. ✆ 8074969747.

### SHAMSHABAD

**Just 5Km** away from Shamshabad Bus Stand Amazing 100 Sq.Yd Plot @ A1 Township on Main Rd & Opp. Petrol Pump. 7207638475/ 9985550628.

**Timmapur &** Kothur Plots E/W- Face- North East Corner 200 to 500 Sq.yd Highway- Walkable Distance. Ph: 9397820459

**Special Discount** for Govt/ Rtd/ VRS Persons. Best Investment Installment basis, Bangalore Highway @ Thimmapur & Shameerpet. HMDA Plots. Ph: 9000227227.

**హైదరాబాద్ బెంగళూరు** హైవే రాజాపూర్ పోలేపల్లి సెజ్‌లో 1500 స్క్వేర్ యార్డ్స్ ఓపెన్ ప్లాట్స్ అమ్మకం contact: 7675012057

**HMDA&RERA PLOTS**
100 Acres Venture with 5 Acres Club House Bangalore Highway Facing Venture
**SHAMSHABAD @KOTHUR**
@16999/- per sq yard
5 GRAMS GOLD FREE
First 10 Members
Bank Loans available
70952 72552

### SRISAILAM HIGHWAY

**Kadthal, Nr.** 4th City - 140 / 165 E / W facing & 650 sq.yds 3 Roads Plot & 1012 sq.yds 2 Roads DTCP Approved Gated Community Fully Developed plots, Spot Regd. Only Genuine Buyers. Call Owner: 970066 8034

**Plots for** Sale. Nr. Skil University, 4th City, Meerkhanpet, Amazon, 200ft Rd, DTCP Aprd, Low Price. Ph: 8121282933, 9704702089

**8 Lakhs** discount on Land Lord share Villa Plots @ Kadthal- Srisailam H/W nr Future City & Pharma City. Raja- 9966744544.

**HYD Fortune** Butterfly City కడ్తాల్ ముచ్చర్ల 4th సిటికి దగ్గరలో 60 & 40ft CC రోడ్స్, క్లబ్ హౌస్ & స్విమ్మింగ్ పూల్, సూల్స్ Etc. గజం. 14,500/-. 200 S/Y, 400 S/Y కలవు. ✆ 96182 82731.

**ఆమనగల్ RRR** దగ్గర హైవే ఫేసింగ్ 444 గజాల (50x80) కమర్షియల్ ప్లాట్స్ కలవు DTCP RERA అప్రూవ్ ఫ్రీ సైట్ విజిట్. Ph: 9848950095

**శిల్పారామవ రియల్ట్** కార్పొరేషన్ పెద్దకందుకూరు, హైదరాబాద్ అప్రూవ్ లేఅవుట్ నందు 500 గజాల ప్లాటు అమ్మబడును. రూ. 22,000/-. Ph: 8526529999, 7794900000.

**FARM PLOTS**
ఫామ్ ప్లాట్స్, శ్రీశైలం రోడ్, మహేశ్వరం మరియు కందుకూరు
Size: 242, 484 sqyds,
క్లబ్ హౌస్ & ప్లాంటేషన్, గేటెడ్ కమ్యూనిటీ, ఫ్రీ మెయింటనెన్స్
9676171633

### TUKKUGUDA

**New Mark** Gardenia @ Thukkuguda- Thumloor, HMDA Layout, 300+ Yds Premium Villa Plots, behind MAK BTR. ✆ 7095888808.

### UPPAL

**Habsiguda X** Roads, Excellent Commercial Plot 150 Sq.Yds 30'x45'. No further road cutting. Ph: 9676852254, 9866662254.

**Uppal- Medipally,** Satya narayanapuram, Road No: 12, West Facing, 320 Sq.yds Plot For Sale. LRS Approved. Ph: 9440215640

**Open Plot** for Sale. Uppal, Narapally, 222 Sq.Yds. & Hi-Tech City Gopanpally 500 Sq.Yds Sale. Cont: 9182766552/ 9700357352.

**Commercial Plot** for Sale 1000 S/Y at Boduppal main Road 2 Sides Road N/S & Choutuppal Vijayawada Highway 333 S/Y S/E Plot. ✆ 8639727876, 9490748338.

### VIKARABAD

**3 Lakhs** Per Guntas Plots Sale Buy Back Grantee. Gated Community. @ Kodangal, Vikarabad. Contact: 7989753138.

### YADAGIRIGUTTA

**కొలనుపాక జైన్** టెంపుల్ వద్ద 100ft రోడ్ హైవేకి ఆనుకొని ఉన్న కమర్షియల్/ రెసిడెన్షియల్ 150 చ.గ.ల ప్లాట్లు అమ్మబడును, రెడీ టు కన్‌స్ట్రక్షన్. Ph: 9908523058

### SHANKARPALLI

**Best of** Best Location. Pragati Resorts Plot for Sale. Gated Pollution Free Environment. Pl Call: 9440044466, 7660044466.

**JB's Infra** వారి అతితక్కువ ధరలో @ మోమిన్‌పేట. DTCP Appvd. ప్రీమియం లేఅవుట్ VKB Dt. Spl ఆఫర్- 7500/- P. Sq.Yd. 9010277299, 9032645065.

### ALWAL

**HMDA plots** at Shamirpet ORR 26,000/- per sq/yd. and Alwal flat- 1050 sq.ft. 45 lakhs. Contact: 9247500442, 9866555247.

### KOMPALLY

**Devarayamjal, 267Sq.Yds** W/F, Plot in Sai Mahalaxmi Residency, Opp: Danube Home Warehouse, No Brokers. Ph: 9502303968.

### GENERAL

**Plots for** Sale HMDA Approved Bhongir 300 Sq.Yds N/E Facing and near Ramoji Film City Malkapur 266 Sq.Yds E/F Direct Buyers. ✆ 9949178495.

**Janachaitanya Housing** Previous Ventures Plots at Attapur, Miyapur, Shameerpet & Vijayawada Highway. Sell or Buy. Ph: 9346666329.

**Plots for** sale in Attapur, Hyderguda prime location. No brokers. Pls contact: 9100028927/ 9000221625.

**800 Sq.yds** for sale at peddagolconda facing service road of ring road. Contact: 9848274893/ 9246522275

**Mangalpally 271** yards 40x61, 40 feet road sagar hiway face Villa lay out. Ph: 9440960464

**Open Plots** for Sale 200 Sq.yds E/F at uppal Peerzadiguda & 387 Sq.yds Hayathnagar Defence Cly. Ph: 9989093939

**Hyderabad to** Nizamabad Road (NH-44) Biknoor Village E/F and W/F 3000 Sq/Yd. Rs. 25,000/- per Sq/Yd. (Neg) Highway corner Plot. Ph: 8121012034.

**Comm. plot** 372 sq.yrds for sale on Dharam Karam Road, Ameerpet, near Nature cure hospital. contact: 9676120725

**NH - 163** Commercial & Farmland 18, 10, 5 Guntas, Gated Community, @ Mannaiguda to Parigi Road & Chevalla 14 Guntas Land for Sale. ✆ 8639727876, 9490748338.

**Plots sale** and purchase, area wise Agents Marketing persons, Telecallers Computer knowledge, loans arrange agents, Experience Persons. Salary 20,000/- p.m. Timings 9.30am to 6 pm. Office at Yapral. Please Cont: 9849091343

**తెల్లాపూర్, మైహోమ్** సాముక్, వజ్రం హైరెంజ్ అపార్ట్‌మెంట్స్‌కి, మంతన ఇంటర్నేషనల్ స్కూల్‌కి ఆనుకొని 75 గజాల కమర్షియల్ స్థలం అమ్మబడును. ఫోన్: 9885286593.

### COMMERCIAL SPACE FOR SALE

**North East** Facing with MNC Tenants at Paradise Circle getting Rent 18K P/M for 6 Yrs. Lease Agreement on 782 Sq.Ft. Office Space Sale. Ph: 9885558755, 9849078692.

**Narsing to** Kokapet 200 Feet Road Facing Commercial Space for Sale. Please Contact: 7207897528.

**15199 Sft,** Prime Commercial shop in Abids Tenant reputed Indian MNC Annual rent 1.95 cr + GST For sale on 6% ROI basis. Contact: 9550119977, 9849722255

**Commercial Property** for Sale consisting Ground Floor, 1&2&3 Rd. Floor each Floor 1600 Sft & 4th Floor of 800 Sft, Total with Plinth Area of 7200 Sft on Plot bearing No.11, in Survey No.28, admeasuring 215 Sq.Yd. Situated @ Laxmiguda (V)- Rajendranagar Municipality, RR (Dt) P. Month. Rental to Siri Chaitanya School. 9063441022.

**Hostel Building For Sale at KPHB**
Monthly Rent Getting 5 Lakhs
North West Corner
9848 66 1666




### SHOP FOR SALE

**Two Shops** 305+305 Each for Sale/ Lease Lower G/F. Swapnalok Complex S.D. Road Suitable Computer Hardware, Medical Distributions, Botique, Jewellery Workshops, Godown/ any Contact: 9885558755/ 9849078692.

### LEASE

**12000 Sft** Industrial Shed for Lease at I D A Bollaram 100 H.P Power. Contact: 9491202179

**Nagarjunsagar Highway** Road Bit, Village Chintapally from LB Nagar 75 Kms suitable for any Companys, Manufacturing unit 8 Acres. 9000352923.

**LEASE/COMMERCIAL**
AMEERPET, 5692 Sft., on 2nd Floor of Asian Satyam Mall Commercial Complex Cum Multiplex (AAA Mall). Rs. 100/- per Sft., & 06 months deposit.
Ph: 84979 49944

### LEASE/ RENT

**G+2 building** 4000 sft & big sheds on 1Acre Open land @ 100ft ECIL Keesara Rd Vardhana School opp. Ph: 9290515034

**Plots 1100** & 600 sq.yd @ Lakkaram nr Choutuppal & 300 sq.yd @ suryavamshi cly on vijayawada highway. Ph:9398187684

**Commercial space** for rent, opp: narayana college, drs colony. kothapet. G+3 sft 8000- Hostel, hospital, offices. Ph: 9966626662

**East Facing** Duplex House with Perfect Vastu in 600 Sq.Yds with 4200 Sq.Ft Builtup Area for Commercial purpose (Suitable for Offices, Kindergarden School, Boutiques) is available for Lease at Rd. No.12, Banjara Green Colony, Banjara Hills. 09845348223.

**Space Available** on Lease/ Rent for Doctor Super Market/ Pharmacy/ Saloon & Spa in Gtd Commty @ Bachupally towards Nizampet Rd. Int. ✆ 9154829359.

**హన్మకొండ బాలసముద్రం** మేన్‌రోడ్ న్యూబస్టాండ్ దగ్గర సెల్లార్ 4 ఫ్లోర్స్ 26000 Sft బిల్డింగ్ హాస్పిటల్/ కార్పొరేట్ బిజినెస్‌లకు కిరాయికి కలదు. సెల్: 9908829988.

**బిల్డింగ్ కిరాయికి ఇవ్వబడును**
**BUILDING FOR RENT**



**BUILDING FOR RENT**
మహబూబ్‌నగర్‌లో తెలంగాణ చౌరస్తా నుండి పాత బస్టాండ్ దారిలో MBC చర్చి ఎదురుగా G+3 ప్రతి ఫ్లోర్ 1600 S.feet తో పార్కింగ్ వసతి గల బిల్డింగ్ కిరాయికి (Building for Rent) ఇవ్వబడును. (Front side Cellar Parking, Bore Facility)
● కమర్షియల్ ● ఆఫీసులకు
● బ్యాంక్‌లకు ● షాపింగ్‌మాల్స్ ● ఆసుపత్రులు లకు అనుకూలంగా అన్ని వసతులు గలవు.
Contact: 9849052377 8977014863

### WANTED

**Wanted Site** For Development (400 yds - 2000 yds) @ Kukatpally, Madhapur, Kondapur & Gachibowli. Tapasya Infra. Ph: 9390333339

**Required Commercial** Property (Minimum 25000 Sft) or Open Space (Minimum 3 acres of land) for Lease/Rent suitable for Residential College at Greater Hyderabad surrounding areas. WhatsApp: 9642899799.

**స్కూల్ బిల్డింగ్ కావలెను**
ఒక ప్రముఖ విద్యాసంస్థకు 10,000 చ॥అ॥ నుండి 25,000 చ॥అ॥ వరకు నిర్మించిన/ నిర్మించబడుతున్న బిల్డింగ్ స్కూల్ కొరకు మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, ఖాజాగూడ, మణికొండ, అలకాపురి, నార్సింగ్, షేక్‌పేట్, తెల్లాపూర్, నల్లగండ్ల, కోకాపేట్ పరిసర ప్రాంతాలలో దీర్ఘకాలిక లీజుకు కావలెను. ఆసక్తిగల యజమానులు/ మధ్యవర్తులు సంప్రదించగలరు.
✆ 9059652999 9059651999

**1 ఎకరం భూమి లీజు పై కావలెను**
**మస్జీద్ బండ, కొండాపూర్**
పరిసర ప్రాంతాలలో, సమతల స్థలము, సరిహద్దు గోడ కలిగి/ లేక, విద్యుత్తు కనెక్షన్ కేటాయించబడి ఎటువంటి వివాదాలు లేనిది, పేరొందిన గృహ నిర్మాణ సంస్థ వారికి, తమ నిర్మాణ రంగ కార్మికుల తాత్కాలిక వసతి కై 2 సం. రాల లీజు పై కావలెను.
ఆసక్తికల యజమానులు వెంటనే 7396591110, 9000128578 నెంబర్లలో సంప్రదించగలరు.

### PROPERTY FOR SALE

**HUDA G+3** Commercial Building in 234 square yards for sale, lift available, North Facing, Suitable for Banks/ Corporate Offices/ Show rooms, 100ft Main Road Facing, Tellapur Radial Road 7, Nallagandla. Ph: 9392331048

**Gachibowli- 200** yds @8cr, Rent: 4L, 1300 yds Sq.yd @1.30L, Comm Building @20cr Rent: 10L & 300, 500, 1000 yds. Ph: 9100587259

### LEASE/ SALE

**Fully Furnished** 2000 sft Office Space for Sale/Lease Prime location on main road above Cult Fit, Dr. A.S. Rao Nagar. Plug and play setup, ideal for BPOs, IT firms, educational institutions. Ready to move in! Ph: 9502781318

**1150 yds** 29000 SFT N/F, Lease/Sale, com.Building @kharkhana, Vikrampuri, suitable for hospitals, etc.no Brokers. Ph:8297435457

### AGRICULTURE LANDS

**3 Acres** Land for Sale @ Mominpet, Manna-pur 36 Lac per Acre, Black Soil, Clear Title Land. Owner No: 9700071161

### FARM HOUSES

**Mudimiyala Kancha** village just 13km from moinabad bus stop 10guntas, 5guntas and 20guntas. Ph: 9246195543

### TO LET

**Large 2BHK** Furnished Flat for Rent with hot Water, AC in Santoshnagar Colony, Saidabad, Hyd. Cont: 7286081430.

**3BHK, N/F,** Ground Floor for Rent at Sri Sainagar Colony near JNTU, Kukatpally. For Families only. Ph: 9391061464.

**3BHK flat** 2100 sft for rent Srinagar Colony. Expecting rent of 65k & maintenance 7k Ph: 98489 21148

**For Rent** 3BHK Indp House H.no.7-27-095 Ground Floor New Asha Officers Clny Ramakrishna puram Sec-bad. Ph:9703328470

**Office space** 2BHK rent @ SR Nagar, 1100 sft, East facing, Newly constructed, Lift available, 300 meters from Metro. Phone: 9676665324

**Commercial Premises** at Raigiri - Yadagiri Gutta Rd. GF + FF 2400 Sft, all amenities Rent Rs. 24000/-. Contact 9848013434.

**Darga Husain** Shahwali, Nr Western Plaza, 2BHK, W/F, Total-10 Flats, 2nd, 4th & 5th Flrs, 1000sft on Rent. Ph: 9030826557, 8897473185

**3BHK Jubilee** Hills, near HUDA Layout- Pakshi Circle, 4th Floor, East Facing, 2000 Sft, 2 Car Parkings. Not for Offices. Ph: 9985200608.

**Barkatpura Newly** Constructed Deluxe 2/3 BHK Flats For Rent. Ph: 9398124038, 9393937665

**Office Space** 1285 Sq.Ft. Flat No. 303 & 304, 3rd Floor, E/F Sri Sai Elite Alwyn Cross Roads, Miyapur. ✆ 9848611817, 9989277781.

### COMMERCIAL

**Having a** Retail Property PRANAVA VAISHNOI BUSINESS PARK Beside Harsha Toyota. 2181 Sft Ground Floor for Showroom Shops Per Sft 190/- Rent. ✆ 90934 55555.

**KPHB Cly,** Ph-VI Opp.Pickn Buy Stores Comm Space, 2nd & 5th Flr, each 2125 Sft, for IT/ Banks/ Clinics/ Gym etc. Ph: 9963643586.

**Kondapur Hitech** City 10,000 Sft, 150 Seats, Fully Furnished for Rent in Western Aqua 'A' Grade Building. ✆ 8309437058, 9505487487.

**Prime Commercial** Rent Masab Tank, Vijayanagar Colony, Doctor, Dentist, Office, Lift+ Park. Ph: 8801794841, 9849298844.

**Commercial Building** G+1 (5000 Sft Ramp Facility Avbl to Ground Floor to 1st Floor) Cellar Parking Space 2500 sft. Avbl well set for 2 Wheeler Showrooms Building located @ New Bowenpally to Balanagar Road. 9000556688.

**Miyapur,** HMT Swarnapuri Colony, School/ College Building for Lease G+5 Floors, North East Corner, 2100 Sft per Floor, Lift, Ramp, 2/4 Classrooms/ Floor, with Generator. 9502146716.

**2BHK Indp** House, Ground floor E/F Comm/Resi Indraprastha Enclave near Traffic PS Nagole Rent 20k. Ph: 7702537369

**M.K.Nagar (OU-Campus)** 4,500 Sft I, II, III floors for Lease/ Rent for School/ Hostel/ Study Circle/ Banks/ Offices/ & Ground floor Shatter for 30 yrs running Clinic attached Medical Shop & Lab. contact: 9246213748. (9 A.M to 9 P.M)

**Shops And** Godown For Rent At Hitension Wire Road, Sainikpuri. Shop-250 Sft Each Godown-1000 Sft. Ph: 7901691311

**Commercial Space** for Rent @ Kachiguda- Nimboliadda 2000 Sft, 1st Floor, Rent Rs. 18/- per Sft ✆ 9908998975 for Godowns, Ware House.

**Com. Space,** Pragathinagar, G/F- 12'x30' Ideal for Clinic, Diagnostics, Showrm & 1st Flr 12'x30' for Clinic, B.Parl. Botiq ✆ 8074965286.

**New Commercial** Building, Ground, 1st, 2nd & 3rd Floor Medipally Main Road Viharika Colony, near Bachpan School, 5500 Sq.ft. For Bank/ ATMs/ Offices/ Furniture/ Cloth Showrooms/ Schools/ Institutes/ Offices Etc. ✆ 9849193950, 9666984400.

**For Rent** Two Independent Corporate Office Spaces 960 Sq.Ft & 1200 Sq.Ft, Furnished in A- Block on 7th Floor, Swapnalok Complex, SD Road, Secunderabad with Front side Parade Ground Greenery View @ SMS/ Call: 9398316172.

**చిక్కడపల్లిలో కమర్షియల్** స్పేస్ ఆఫీస్ కొరకు అద్దెకు ఇవ్వబడును. 1st ఫ్లోర్, 2nd ఫ్లోర్, 3rd ఫ్లోర్ పెంట్ హౌస్. మెట్రో పిల్లర్-1124. ఫోన్. 9346932991

**చంపాపేట్, సాగర్** హైవే మెయిన్ రోడ్‌లో 5500 Sft, షట్టర్ & గోడౌన్ రెంటల్ కొరకు 100% వాస్తు, ఫాల్స్ సీలింగ్, గ్లాస్ కప్ బోర్డ్స్, పుల్లీ ఫర్నిష్డ్. ఫోన్: 8500443841.

### WANTED

**700-1000 Sq.Yards** Of Open Land For Lease For Sports Arena. In And Around: Hitec City, Madhapur, Gachibowli, Kondapur, Manikonda, Gandipet & Kokapet. Contact: 9032830222.

**Require 2500** to 3000 Sft Warehouse Shed (Kirby/ RCC) with Fire NOC on Long Lease in & around Autonagar/ Jeedimetla/ Nacharam/ Kandlakoya areas, for a reputed Chemical Company with good approach Roads & abundant Parking place for heavy Vehicles. Cont: 9393218003.

### JOBS

**Wanted Exp/** Freshers Telecallers (Female), Electricians,& Service Engineer, Helpers Field Work, UPS Battery Company. near JNTU. 9966308585, 8106634040.

**Prakash Hyundai** Nizamabad Requires Below Staff: Spares Parts Manager: 5-6 Yrs Exp., Spares Parts Assistant: 2 Yrs Exp., Contact: 9133311667 (Whatsapp), Email: hrprakashyundai@gmail.com

**Wanted Experienced** "Sales Managers" for a Reputed Construction Company at Kompally. ✆ 9000216443, 9000216448.

**Female Office** Assistants- 6 Qua: Any Degree. & Accountants Required., Moul-ali, Hyd. ✆ 94920 06789 / 98856 88299.

**Wanted Nurses,** Reception Staff, Lab Technician & Marketing Persons for new Hospital @ Madhapur. Fresher/ Experienced. Ph: 8121120257.

**Trainee/ Helper** For Fire, Security Alarm, Co. ITI Elect/ Electronics 1y House Wiring/ Fire Alarm Exp. Ph: 9346938649

## భారత్-జపాన్ స్నేహబంధం మరింత బలపడాలి



జ్యోతి వెలిగిస్తున్న తకాహసి మునియో

మాదాపూర్, న్యూస్‌టుడే: భారత్-జపాన్ దేశాల మధ్య ఎన్నో ఏళ్లుగా స్నేహబంధం కొనసాగుతుందని, అది మరింత బలపడాలని కాన్సుల్ జనరల్ జపాన్ ఇన్ చెన్నై తకాహషి మునియో అన్నారు. శనివారం నా రా జపాన్ హబ్ ఆధ్వర్యంలో "హైదరాబాద్ జపాన్ ఫెస్టివల్ 2024"ను మాదాపూర్‌లోని సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్ సెంటర్(సీసీఆర్‌టీ)లో ప్రారంభించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తోషిబా కంపెనీ సీఎండీ హిరోషి ఫురుట, విశ్రాంత ఐపీఎస్ అధికారి ఎస్.కె.జయచంద్ర, నా రా జపాన్ హబ్ వ్యవస్థాపకులు రామభద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన కళాకృతులు ఆకట్టుకున్నాయి.

## వీగన్ ఆహారం మానవాళికి మంచిది



స్టాల్ పరిశీలిస్తున్న అమల

మాదాపూర్, న్యూస్‌టుడే: వీగన్ ఆహారం తీసుకోవడం వల్ల మన ఆరోగ్యంతో పాటు భూగోళానికి మంచిదని సినీనటి అక్కినేని అమల అన్నారు. శనివారం మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హైదరాబాద్ వీగన్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. రెండేళ్లుగా వీగన్ ఆహారం తీసుకుంటున్నట్లు చెప్పారు. వీగన్ ఎంతో ఆరోగ్యకరమైన ఆహారమన్నారు. వీగన్ రుచిగా ఉండదనేది కేవలం అపోహ మాత్రమేనన్నారు. సినీ దర్శకులు శశికిరణ్ తిక్క, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ కె.లక్ష్మి తదితరులున్నారు.

## నిత్య విద్యార్థిగా ఉంటేనే అన్నింటా విజయం



ప్రసంగిస్తున్న అనూజా బషీర్

శామీర్‌పేట, న్యూస్‌టుడే: పట్టుదల, క్రమశిక్షణతో నిత్య విద్యార్థిగా ఉంటేనే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఫ్లెక్సీక్లౌడ్ సీఈవో సహ వ్యవస్థాపకురాలు అనూజా బషీర్ పేర్కొన్నారు. శనివారం శామీర్‌పేట తూంకుంటలోని విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా వచ్చారు. జీవితంలో లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికతో ముందుకు సాగితే విజయం వరిస్తుందని వివరించారు. గౌరవ అతిథి టెక్ మహీంద్రా వైస్ ప్రెసిడెంట్ పునీత్ గుప్తా మాట్లాడుతూ, విశ్వ విశ్వాని ఇనిస్టిట్యూట్‌లో నేర్చుకున్న విద్యను ఆయా రంగాల్లో విజయాలను పొందేందుకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డాక్టర్ జయశ్రీ వెలుతక్కల్, కళాశాల అధ్యక్షుడు జీఎస్ఎస్.వెంకటేశ్వర రావు, డైరెక్టర్ డాక్టర్ లక్షణ్‌కుమార్ మాట్లాడారు. పలు విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు.

## ఎస్టీ కులాల యువతీ యువకులకు నేడు ఉచిత రిజిస్ట్రేషన్లు



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఎస్టీల్లోని బంజారా, కోయ, గోండు, ఎరుకల కులాలకు చెందిన యువతీయువకుల కోసం 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం 29 తేదీన సోమాజిగూడలోని 'ఈనాడు కార్యాలయంలో జరగనుంది. వివాహాల కోసం ఎదురుచూస్తున్న వారంతా.. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పాల్గొని ఉచితంగా ప్రొఫైల్ రిజిస్టర్ చేయించుకోవచ్చు. పూర్తి వివరాలకు 91549 92572, 91543 40820 ఫోన్‌నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



పత్రాన్ని విడుదల చేస్తున్న శ్రీరాం బిరుదవోలు, టి.హనుమాన్ చౌదరి, శ్రీకిషన్‌బద్రుకా, గోపీనాథ్‌రెడ్డి, అభిరామకృష్ణ తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 'సైబర్ జెనస్' పేరిట జరిగిన సదస్సులో వక్తలు పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలోని బద్రుకా కళాశాల ప్రాంగణంలో 'సీఏడీఆర్‌టీ' ఆధ్వర్యంలో జరిగిన సంబంధిత సదస్సుకు.. డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, నాస్కామ్ సీఈవో డా.శ్రీరాం బిరుదవోలు, బీబీసీఐటీ గవర్నింగ్ బాడీ ఛైర్మన్ డా.టి.హనుమాన్ చౌదరి, బద్రుకా విద్యాసంస్థల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొ.అభిరామకృష్ణ, డైరెక్టర్ డా.డీవీఎన్ఎస్ మూర్తి, విశ్రాంత ఐపీఎస్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడారు.

## కలశ నాయుడికి ఆసియా ఐకాన్ అవార్డు



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అతిపిన్న వయస్కురాలైన సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందిన నగరానికి చెందిన కలశ నాయుడు ఆసియా ఐకాన్ 2024 అవార్డును అందుకున్నారు. శ్రీలంక రాజధాని కొలంబోలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన వేడుకల్లో కొలంబో గవర్నర్ సెంథిల్ చేతుల మీదుగా అవార్డు స్వీకరించారు. ఓవైపు చదువుకుంటూ మరోవైపు సేవా కార్యక్రమాలతో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని అతిథులు 11 ఏళ్ల చిన్నారిని అభినందించారు.

## చిత్రకళను అందరూ ఆదరించాలి



ప్రదర్శనలో చంద్రశేఖర్, సీతారెడ్డి, పద్మావతి, వకుళాభరణం, సుమన్, అంజనీకుమార్, రజని తదితరులు

రాంనగర్, న్యూస్‌టుడే: చిత్రకళను ప్రతీ ఒక్కరూ ఆదరించాలని పలువురు ప్రముఖులు కోరారు. శనివారం రాత్రి హోటల్ మారియట్‌లో.. వీఎస్ఎల్ విజువల్ ఇంటర్నేషనల్ ఆర్ట్ గ్యాలరీ, కళానిధి ఆర్ట్స్ సంయుక్తాధ్వర్యంలో చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పద్మావతి, రహదారుల భద్రత డీజీ అంజనీకుమార్, తిరుమల బ్యాంక్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖర్, విశ్రాంత ఐపీఎస్ అజయ్‌మిశ్రా, నటుడు సుమన్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీతారెడ్డి హాజరయ్యారు.


## ఎకోజెన్ నుంచి కాలుష్యరహిత జనరేటర్లు



జనరేటర్లను ప్రారంభిస్తున్న కింకర్, కార్తీక్, కేశవ్, ప్రసాద్ తదితరులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అశోక్ లేలాండ్‌కు చెందిన ఎకోజెన్ నుంచి మార్కెట్‌లోకి సరికొత్త కాలుష్యరహిత జనరేటర్లను విడుదల చేసింది. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అశోక్ లేలాండ్ సౌత్ జోనల్ మేనేజర్ కింకర్ సహా, సౌత్ మేనేజర్లు కార్తీక్, కేశవ్ రాజన్, ఎకో జెన్ ఎండీ బోళ్ల ప్రసాద్, సీనియర్ మేనేజర్ రాజీవ్ మాథుర్ ఆవిష్కరించారు. ఎకో జెన్ ఎండీ మాట్లాడుతూ.. ప్రస్తుతం 15 నుంచి 250 కిలో వాట్ల జనరేటర్లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. డైరెక్టర్ బోళ్ల మౌనిక, తేజస్ చౌదరి పాల్గొన్నారు.

## వృద్ధురాలి హత్య కేసులో యువతికి జీవిత ఖైదు



వసుంధరా లక్ష్మి

మూసాపేట, న్యూస్‌టుడే: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి కత్తితో దాడిచేసిన కేసులో ఓ యువతికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎలగపూరి నాగేశ్వరరావు తెలిపిన ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాకు చెందిన గడ్డం వసుంధరాలక్ష్మి(20) పదేళ్ల క్రితం నగరానికి వలసొచ్చింది. 2016లో నల్లగండ్లలో ఓ విల్లాలో పనిచేసేది. పక్కనే ఉండే ఉమాదేవి(69) ఇంట్లో చొరబడి ఆమెను కత్తితో పొడిచి నగలు లాక్కుంది. ఉమాదేవి కేకల వల్ల ఇరుగుపొరుగువారు రావడంతో వసుంధరా లక్ష్మి తానూ పొడుచుకుంది. తరువాత ఉమాదేవి చనిపోగా.. వసుంధరా లక్ష్మి ఆరోగ్యం మెరుగైంది. ఈ కేసులో రంగారెడ్డి 6వ అదనపు జిల్లా జడ్జి సి.పావని నిందితురాలికి యావజ్జీవ ఖైదు విధించారు.

# ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

## ముగిసిన జోనల్ టోర్నమెంట్



విజేత జట్లతో విద్యాశాఖ అధికారులు

వెంగళ్‌రావునగర్: ఎర్రగడ్డ డాన్‌బాస్కో పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఖైరతాబాద్, షేక్‌పేట్ జోనల్ టోర్నమెంట్ పోటీలు శనివారం ఘనంగా ముగిశాయి. అండర్-14, 17 బాలురు, బాలికలకు ఖోఖో, కబ్బడి ఆటల పోటీలలో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. విజేతలుగా నిలిచి విద్యార్థి బృందాలకు పాఠశాలల వారిగా ఫెడరేషన్ అధ్యక్షుడు, ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి ఎం.శ్యాముల్‌రాజ్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు.

## ఖాతాలోకి డబ్బు పంపిస్తానని మోసం

యూసుఫ్‌గూడ: డబ్బులు డిపాజిట్ చేయడానికి వెళ్లిన ఓ వ్యక్తిని బురిడికొట్టించి రూ.35 వేలను తస్కరించిన ఘటన ఇది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన దశరథ్‌సింగ్ ఈనెల 22న రాత్రి మధురానగర్ మెట్రోస్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎం డిపాజిట్ యంత్రంలో తన సోదరుడికి రూ.35 వేలు డిపాజిట్ చేయడానికి వెళ్లాడు. అక్కడ ఓ అపరిచిత వ్యక్తి తనకు నగదు రూ.35 వేలు ఇస్తే ఖాతాలోకి పంపుతానని నమ్మించడంతో దశరథ్‌సింగ్ ఇచ్చాడు. ఆ వ్యక్తి డబ్బులు పంపినట్లు సందేశం చూపించి తర్వాత వస్తాయంటూ అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తక్కువ ధరకు ఫ్రిడ్జ్ పేరుతో టోకరా

యూసుఫ్‌గూడ,: తక్కువ ధరకు డబుల్‌డోర్ ఫ్రిడ్జ్ ఇప్పిస్తానని బురిడి కొట్టించిన ఘటన ఇది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌కు చెందిన సబ్బన్న బ్యాండు మేళం నిర్వహిస్తుంటాడు. ఈనెల 27న ఓ వ్యక్తి జూబ్లీహిల్స్ ప్రాంతంలో తన యజమాని కుమార్తె వివాహం అక్టోబరు 1న ఉందని, అందుకు బ్యాండు అవసరముందని చెప్పాడు. రూ.18 వేలకు బేరం కుదిరింది. యజమాని కుమార్తె కోసం చేసిన షాపింగ్‌లో డబుల్‌డోర్ ఫ్రిడ్జ్ బహుమతిగా వచ్చిందని, దాన్ని రూ.12 వేలకు విక్రయిస్తామని నమ్మించడంతో సబ్బన్న అతడికి నగదు ఇచ్చాడు. ఫ్రిడ్జ్ తీసుకురావటానికి సబ్బన్న తన సహాయకుడు సాయిని పంపాడు. జూబ్లీహిల్స్ ప్రాంతంలోని ఓ ఇంట్లోకి వెళ్లిన వ్యక్తి ఎంతకు తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిల్మ్‌ఛాంబర్‌లో జానీ మాస్టర్ భార్య ఫిర్యాదు

ఫిల్మ్‌నగర్: ఫిల్మ్‌నగర్‌లోని తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో జానీ మాస్టర్ భార్య ఆయేషా అలియాస్ సుమలత శనివారం ఫిర్యాదు చేశారు. కోరియోగ్రాఫర్‌గా పనిచేయడానికి తన భర్తను వలలో వేసుకొని యువతి తప్పుడు కేసు పెట్టిందని, ప్రేమ పేరుతో తన భర్తను వేధింపులకు గురిచేసిందని ఛాంబర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమెపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు, పిల్లలకు ఏం జరిగిన కేసు పెట్టిన యువతి, ఆమె తల్లిదే బాధ్యతని తెలియజేశారు. న్యాయం చేయాలని ఆమె కోరారు.

## విద్యార్థి అదృశ్యం

ఫిలింనగర్, న్యూస్‌టుడే: మదర్సాకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన ఇది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం... టోలిచౌకి పారామౌంట్‌కాలనీలో నివసించే రుక్ముద్దీన్, షాబా బేగం దంపతుల కుమారుడు షేక్‌షాబాద్ పాషా ఈనెల 23న ఉదయం సమీపంలోని మదర్సాకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఎంత గాలించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

## దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: నడిచి వెళ్తున్న యువకుడిపై దాడిచేసి, చరవాణి ఎత్తుకెళ్లిన కేసులో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. మధురానగర్ ప్రాంతంలో ఈనెల 26న అర్ధరాత్రి నడిచి వెళ్తున్న నవీన్ అనే యువకుడిపై బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు దాడిచేసి చరవాణి ఎత్తుకెళ్లారు. సీసీ ఫుటేజీల ఆధారంగా బేగంపేట్‌కు చెందిన రాహుల్, చందానగర్‌కు చెందిన దొండ రాకేష్, మధురానగర్‌కు చెందిన ముత్యాల అజయ్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మధురానగర్ పోలీసులకు వాళ్లను అప్పగించారు.

## అనారోగ్యంతో ఏఆర్ ఎస్సై మృతి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని మొదటి పటాలంలో ఏఆర్‌ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బొజ్జ జనార్దన్(57) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. బెటాలియన్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నగరంలోని ఓ ప్రముఖ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనివార్య కారణాతో ఆ ఆసుపత్రిలో చేర్చుకోకపోవడంతో, అమీర్‌పేట్‌లోని మరో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్యం క్షీణించడంతో గుండెపోటు వచ్చింది. వైద్యులు సీపీఆర్ చేసినా ప్రాణం దక్కలేదు. మొదటగా తీసుకెళ్లిన ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుని ఉంటే ప్రాణాలు దక్కేవని మృతుడి సన్నిహితులు, కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## భగత్‌సింగ్ తెగువ భావితరాలకు స్ఫూర్తి

భగత్‌సింగ్ జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో నివాళులు అర్పించారు. ఆయన పోరాటం యువతకు స్ఫూర్తి అని వక్తలు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, పంజాగుట్ట, హిమాయత్‌నగర్, ఫిల్మ్‌నగర్



హిమాయత్‌నగర్‌లో ఏఐవైఎఫ్ ర్యాలీ

## తొమ్మిదేళ్లుగా ఇళ్ల కోసం నిరీక్షిస్తున్నాం



డిగ్నిటీ కాలనీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

బోరబండ: 'తొమ్మిదేళ్లుగా రెండు పడకగదుల ఇళ్లకోసం నిరీక్షిస్తున్నాం. మాకు కేటాయించిన తర్వాతే మిగిలిన ఇళ్లను మూసీ నిర్వాసితులకు అప్పగించాలి' అని ఎస్పీఆర్ హిల్స్ కమలానగర్ డిగ్నిటీ కాలనీ 2బీహెచ్‌కే లబ్ధిదారులు డిమాండ్ చేశారు. శనివారం ఇళ్ల సముదాయం వద్ద నిరసన తెలిపారు.

## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు బర్దన్ ఘనతే

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి ఏబీ బర్దన్ శతజయంతిని పురస్కరించుకొని హిమాయత్‌నగర్‌లోని సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈటీ నరసింహ మాట్లాడుతూ.. బర్దన్ తన జీవితాన్ని ప్రజల కోసమే త్యాగం చేశారన్నారు. పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలపైన నిరంతరం రాజీలేని పోరాటాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్ బోస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశంలోని ప్రభుత్వ సంస్థలను బలహీనపరుస్తూ.. కార్పొరేట్ శక్తులకు సహజ వనరులను, సంపదను కట్టబెడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సీనియర్ నాయకులు ప్రేమ్‌పావని, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## పేరుకుపోయిన నాచు.. వ్యర్థాల కుప్పలు

- అధ్వానంగా బతుకమ్మ నిమజ్జన కుంటలు
- ఇప్పటికీ ప్రారంభంకాని అభివృద్ధి పనులు



కృష్ణకాంత్‌పార్కులో ఓ కుంట దుస్థితి



చెత్తాచెదారం

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: మరో ఐదు రోజుల్లో బతుకమ్మ వేడుకలు ప్రారంభంకానున్నాయి. బతుకమ్మలను నిమజ్జనం చేసే యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్కు ఆవరణలోని బతుకమ్మ నీటి కుంటల అభివృద్ధి పనులు మాత్రం ఇప్పటి వరకు ప్రారంభం కాలేదు. ఆయా కుంటల్లోకి దిగేందుకు మెట్లు దెబ్బతినటమే కాకుండా చెత్త, నాచు పేరుకుపోయి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పరిధిలోని యూసుఫ్‌గూడ, వెంగళ్‌రావునగర్, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ, శ్రీనగర్‌కాలనీ డివిజన్లకు చెందిన వందల మంది మహిళలు బతుకమ్మ ఆడిన తర్వాత కృష్ణకాంత్ పార్కు ఆవరణలోని నీటి కుంటలలో నిమజ్జనం చేస్తుంటారు. గతంలో బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి పదిరోజుల ముందు నుంచే కుంటల వద్ద అవసరమైన ఏర్పాట్లు, అభివృద్ధి పనులు మొదలయ్యేవి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుంటలలో చెత్త తొలగించి శుభ్రం చేయడంతో పాటు దెబ్బతిన్న దారి మెట్లకు మరమ్మతులు, విద్యుత్తు దీపాలు, భద్రత సదుపాయాలు కల్పించాలని మహిళలు కోరుతున్నారు.

**రెండు రోజుల్లో ప్రారంభిస్తాం..**

ఈ విషయంపై జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకియా సుల్తానా స్పందిస్తూ, కృష్ణకాంత్‌పార్కులో బతుకమ్మ కుంటల వద్ద అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు ఉన్నతాధికారులకు పంపించామన్నారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామన్నారు.

## టీపీపీఎస్ రాజకీయ విభాగ ప్రధాన కార్యదర్శిగా ప్రవల్లిక

నారాయణగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం (టీపీపీఎస్) రాష్ట్ర రాజకీయ విభాగ ప్రధాన కార్యదర్శిగా బొమ్మ ప్రవల్లిక నేత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కమర్తపు మురళి, మాచర్ల రామచంద్రం, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు.



## చిన్నారి రైతులు.. నమూనా బజార్

శ్రీకృష్ణానగర్‌లోని సాయిరాం పాఠశాలలో శనివారం ఏర్పాటుచేసిన నమూనా రైతు బజార్‌లో విద్యార్థులు రైతుల వేషధారణలతో ఆకట్టుకున్నారు. వాళ్ల రకాల కూరగాయలను కౌంటర్లలో ఏర్పాటు చేసుకుని విక్రయించారు. విద్యార్థులకు అవగాహను కల్పించడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. – యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే

## క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలతో సిద్ధిఖీ అధికారులు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యూసుఫ్‌గూడలోని మొదటిపటాలం ప్రాంగణంలో సోమవారం ప్రారంభమైన వార్షిక క్రీడోత్సవాలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టగ్గాఫ్‌వార్, టెన్నిస్, క్యారమ్స్, చెస్, 100, 400, 1500 మీటర్ల పరుగు పోటీలు నిర్వహించారు. డీఐజీ సిద్ధిఖీ గెలుపొందిన వారికి పతకాలతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ, అదనపు కమాండెంట్లు నరేందర్‌సింగ్, రామకృష్ణ, అసిస్టెంట్ కమాండెంట్లు అప్పారాయ్, భాస్కర్, చంద్రశేఖర్, ఆర్‌ఐలు శంకర్, సురేష్, సాంబయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజ సేవే రోటరీ క్లబ్ లక్ష్యం

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సమాజసేవే లక్ష్యంగా రోటరీ క్లబ్‌లోని ప్రతి ఒక్క సభ్యుడు పనిచేస్తున్నారని ఆ సంస్థ 2025-26 కాబోయే అధ్యక్షుడు మారియో సీజర్ అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఈస్ట్ రోటరీ క్లబ్ హోస్ట్‌గా వ్యవహరిస్తూ రోటరీ జిల్లా 3150 ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న జోన్-7 సభ్యత్వ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..** (ఉ.10 నుంచి మ.1 గంట మధ్య)

| | |
|---|---|
| ఖైరతాబాద్ | 80085 73345 |
| జూబ్లీహిల్స్ | 80085 73352 |
| బంజారాహిల్స్ | 80085 73348 |

షేక్‌పేట, న్యూస్‌టుడే: ? వినోబానగర్ ఫేజ్-2లో రెండు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదు.– నాగరాజ్, వినోబానగర్, ఫేజ్–2

✓ వీధిదీపాలను పరిశీలించి మరమ్మతులు చేస్తాం. –సుశ్మ, ఏఈ, జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగం.

## విద్యుత్తు మరమ్మతులకు ఆధునిక వాహనాలు

ఈనాడు, హైదరాబాద్: నగరంలో విద్యుత్తు అంతరాయాల సమయంలో మరింత వేగంగా సేవలు అందించేందుకు సెంట్రల్ బ్రేక్‌డౌన్ గ్యాంగ్(సీబీడీ)లకు యుటిలిటీ వాహనాలను సమకూర్చాలని డిస్కం నిర్ణయించింది. వాహనాలు ఎలా ఉండాలనేదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. హైదరాబాద్ సెంట్రల్, సౌత్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ సర్కిల్స్‌లో కలిపి 11 వరకు సీబీడీ బృందాలు ఉన్నాయి.

## డా.విజయభారతి మృతికి సంతాపం



ఖైరతాబాద్, న్యూస్‌టుడే: బొజ్జా తారకం సతీమణి, రాష్ట్ర ఇరిగేషన్ కార్యదర్శి రాహుల్ బొజ్జా తల్లి డా.విజయభారతి మృతికి సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఛైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య సంతాపం తెలిపారు. పులే జీవిత చరిత్రను తొలిసారిగా తెలుగు సమాజానికి అందించిన మహనీయురాలని కొనియాడారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ ఛైర్మన్‌గా ఉన్నపుడు దళితుల హక్కులకోసం కీలకంగా పనిచేశారన్నారు.

## సంక్షిప్త సమాచారం

### భవన్స్‌లో 'తెలంగాణ జానపద గేయాలు'

జూబ్లీహిల్స్: భారతీయ విద్యాభవన్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో 'తెలంగాణ జానపద గేయాలు' అనే అంశంపై పలు కార్యక్రమాలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిక శాఖ సారథి సభ్యులు డా.లింగా శ్రీనివాస్, శంకర్, నరేష్, సృజనకిషోర్, వీణ, సైదమ్మ జానపద గేయాలను పాడి ఆకట్టుకున్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాగతోత్సవం

పంజాగుట్ట, న్యూస్‌టుడే: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, సంప్రదాయ వేషధారణ, ఫ్యాషన్ షోలతో ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో కొత్త విద్యార్థులకు స్వాగతోత్సవం (ఫ్రెషర్స్ డే) వేడుకలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు.

### అక్టోబరు 5న బతుకమ్మ సంబురాలు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: బతుకమ్మ సంబరాలు అక్టోబరు 5న సాయంత్రం 4గంటల నుంచి 9గంటల వరకు బంజారాహిల్స్ సాగర్‌సొసైటీ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గ మహిళలు తరలిరావాలని ఆయన కోరారు. శనివారం భాజపా మహిళా మోర్చా నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

### సామాన్యుల సంక్షేమమే ఆప్ లక్ష్యం

హిమాయత్‌నగర్: సామాన్య ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఉద్యమిస్తోందని పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. శనివారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో నగరానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రరాము గౌడ్, డా.సాల్మన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### 4 నుంచి బ్రహ్మోత్సవాలు

యూసుఫ్‌గూడ: శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబరు 3 నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు, వచ్చేనెల 4 నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసాశర్మ తెలిపారు. ఈ మేరకు కరపత్రాలు ఆవిష్కరించారు.

## అన్ని జిల్లా కేంద్రాల్లో ఏబీసీ కేంద్రాలు




కరపత్రాలను విడుదల చేస్తున్న అమల, గౌతం, సంధ్య, మల్లీశ్వరి, డా.వకీల్, డా.ప్రవీణ్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: రేబిస్ ప్రబలకుండా రాష్ట్ర వ్యాప్తంగా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. శనివారం ప్రపంచ రేబిస్ నియంత్రణ దినోత్సవాన్ని బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానం వద్ద బ్లూ క్రాస్ హైదరాబాద్, యానిమల్ వెల్ఫేర్ సొసైటీతో కలిసి 'మిషన్ రేబిస్' పేరుతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీపీ గౌతం మాట్లాడారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్) కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. బ్లూక్రాస్ నిర్వాహకురాలు అక్కినేని అమల మాట్లాడుతూ.. బ్లూ క్రాస్ ద్వారా 30 ఏళ్లుగా ప్రతి ఏటా 10వేల కుక్కలకు స్టెరిలైజ్ చేస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్ మల్లేశ్వరి, సీడీఎంఏ జేడీ సంధ్య, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి, డాక్టర్లు చక్రపాణి, వివేకానంద్, డబ్ల్యూవీఎస్ ప్రతినిధి ప్రియాంకవీర్, ఏఎంహెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## కంటి మీద కునుకు ఉండటం లేదు

### తెలంగాణ భవన్‌లో మూసీ బాధితుల గోడు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరిట తమ నివాసాలు తొలగించడం సరికాదని బాధితులు కన్నీటిపర్యంతరం అయ్యారు. శనివారం తెలంగాణ భవన్‌కు వచ్చిన పలువురు మాజీ మంత్రి హరీశ్‌రావుకు తమ గోడు వెల్లబోసుకున్నారు. న్యాయం చేయాలని కోరారు.

**పైసా పైసా కూడబెట్టి కట్టుకున్నా: దివ్య, సన్‌సిటీ**



ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న మా ఇల్లు బఫర్‌జోన్‌లో ఉందని అధికారులు కూలుస్తామంటున్నారు. పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న ఇల్లు కూలిపోతే తట్టుకునే శక్తి మాకు లేదు. కంటి మీద కునుకు ఉండట్లేదు. మూసి అభివృద్ధి అంటూ మమ్మల్ని ఇబ్బంది పెట్టడం సర్కారుకు తగదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

**ఇన్నాళ్లకు బఫర్‌జోన్ గుర్తొచ్చిందా? సౌమ్య, గందంగూడ**



ఎప్పుడో నిర్మించుకున్న మా ఇంటిని ఉన్నట్టుండి అధికారులు బఫర్‌జోన్‌లో ఉందని అంటున్నారు. తాముంటున్న స్థలంకు రిజిస్ట్రేషన్ అయ్యింది. అన్ని అనుమతులున్నాయి. ఇన్నేళ్ల తరువాత బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ అని చెబుతూ అధికారులు కూల్చడానికి సిద్ధమవడం ఎంతమాత్రం తగదు. గతంలోనే ఈ స్థలం బఫర్‌జోన్‌లో ఉందని చెబితే కొనుగోలు చేసేవారం కాదు. ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇంటికి బ్యాంకు ఈఎంఐలు చెల్లిస్తున్నాం. అధికారులు కూల్చివేతల నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి.

## అక్కినేని నాగేశ్వరరావు లెజెండ్



పుస్తకాన్ని ఆవిష్కరించిన రఘురామ కృష్ణంరాజు, చిత్రంలో పార్వతీశం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: సినీ రంగంలో అక్కినేని నాగేశ్వరరావు ఒక లెజెండ్ అని పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం శాసనసభ్యుడు కె.రఘురామ కృష్ణంరాజు అన్నారు. యువ కళావాహిని ఆధ్వర్యంలో సారిపల్లి కొండలరావు సారథ్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల ముగింపు సందర్భంగా, ఎస్.వి.రామారావు రచించిన 'అక్కినేని ఆణిముత్యాలు' గ్రంథావిష్కరణ, అంకితోత్సవ సభ శనివారం రాత్రి రవీంద్ర భారతిలో నిర్వహించారు సాహితీవేత్త డా.ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణతో కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటే మన భవిష్యత్తు ఎలా ఉంటుందో అక్కినేని నాగేశ్వరరావు జీవితమే ఉదాహరణ అన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాళి రఘురామ్, నేత్రవైద్య నిపుణుడు డా.హరీశ్ లక్ష్మణ్ మాట్లాడారు. సీనియర్ జర్నలిస్టు జి.వల్లీశ్వర్ గ్రంథపరిచయం చేశారు. లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. సాహితీ కిరణం-యువకళావాహిని సంయుక్త నిర్వహణలో అక్కినేనిపై వ్యాసరచన, కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన పొత్తూరి సుబ్బారావు, విజయదుర్గ, పొత్తూరి విజయలక్ష్మిలను సత్కరించారు.

# కూకట్‌పల్లి

## స్టాన్‌ఫోర్డ్ టాప్ సైంటిస్టుల జాబితాలో అధ్యాపకుడికి చోటు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: అమెరికా స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఇటీవల ఎల్సెవియర్ అంతర్జాతీయ స్థాయిలో ప్రకటించిన టాప్ 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో జేఎన్‌టీయూ హెచ్ కళాశాల గణిత విభాగం కాంట్రాక్ట్ సహాయ అధ్యాపకుడు **బెజవాడ శంకర్‌గౌడ్** చోటు సంపాదించారు. గణితశాస్త్రంలో 128 పరిశోధన పత్రాలను ఆవిష్కరించారు. అనులేఖనాల ప్రామాణిక గణాంకాలు హెచ్ ఇండెక్స్ వివిధ రకాల సూచికలను పరిగణనలోకి తీసుకొని ఈ జాబితాలో చోటు కల్పించారని శంకర్‌గౌడ్ చెప్పారు. తోటి అధ్యాపకులు ఆయన్ని అభినందించారు.

## జేఎన్‌టీయూలో మీట్ ది అచీవర్


కన్నయ్యనాయుడితో అధికారులు, విద్యార్థులు

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్ సెంటర్(యూఐఐసీ) ఆధ్వర్యంలో శనివారం గోల్డెన్ జూబ్లీహాల్‌లో మీట్ ది అచీవర్ కార్యక్రమం జరిగింది. సాంకేతిక సలహాదారుడు నాగినేని కన్నయ్యనాయుడు పాల్గొని హైడ్రాలిక్ గేట్లు, హ్యాండ్లింగ్ పరికరాల రూపకల్పన, అభివృద్ధి, నిర్వహణ తదితరాలపై నైపుణ్యం, అనుభవనాలను విద్యార్థులతో పంచుకున్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి, యూఐఐసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.రజని, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జె.సురేశ్‌కుమార్, డాక్టర్ కామాక్షిప్రసాద్ ముఖ్యఅతిథికి జ్ఞాపిక అందజేసి సన్మానించారు.

## రాజీ పడ్డారు.. పరిష్కారం పొందారు
### లోక్ అదాలత్ వేదికగా 10,087 కేసులకు విముక్తి


మహిళకు అవార్డు పత్రాన్ని అందజేస్తున్న జిల్లా అదనపు న్యాయమూర్తి తిరుపతి

మూసాపేట, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి కోర్టులో శనివారం నిర్వహించిన 'లోక్ అదాలత్' కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలకు సంబంధించి మొత్తం 12 బెంచ్‌లను ఏర్పాటు చేయగా 10,087 కేసులు పరిష్కరించడం విశేషం. ఆయా బెంచ్‌ వారిగా కక్షిదారులు రాజీపడుతున్నట్లుగా సమర్పించిన దరఖాస్తులను న్యాయమూర్తి ఆధ్వర్యంలోని ప్రతినిధులు పరిశీలించారు. అప్పటికప్పుడు సదరు కేసులకు చెందిన 'అవార్డు ప్రపత్రాల'ను న్యాయమూర్తి చేతులమీదుగా బాధితులకు అందజేశారు. మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి.తిరుపతితోపాటు సీనియర్ సివిల్ జడ్జిలు, మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్‌లు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్డదిడ్డం.. ప్రమాదాలకు ఆహ్వానం


దిమ్మెల నుంచి వస్తున్న వాహనాలు

### ప్రశాంత్‌నగర్ జంక్షన్‌లో అయోమయం


ఎదురెదురుగా రాకపోకలు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఒకప్పుడు వారే ట్రాఫిక్ సిగ్నల్స్ కావాలని అడిగారు. ఇప్పుడు మళ్లీ అదే ట్రాఫిక్ విభాగం వారు మూసేశారు. కార్మికులు, ఉద్యోగులు వేలాదిమంది నిత్యం రోడ్డు దాటే పరిస్థితుల దృష్ట్యా అక్కడ ఏర్పాట్లు అవసరం. పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్ ఉంది. ఇక సిగ్నల్స్ కూడా ఉన్నప్పటికీ.. ప్రస్తుతం జంక్షన్ మూసేయడంతో అలంకారప్రాయమయ్యాయి. పాదచారులు రోడ్డు దాటేందుకు దిమ్మెలు తీయడంతో.. ఇటుగా ద్విచక్ర వాహనాలతోపాటు ఆటోలు అడ్డదిడ్డంగా రాకపోకలు సాగిస్తుండడం ప్రమాదకరంగా మారింది. ఇంత జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టకపోతుండడం ఆందోళన కలిగిస్తుంది. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ జంక్షన్‌లో నెలకొన్న పరిస్థితుల గురించి తెలుసుకుందాం.

**ఎవరు బాధ్యులు?:** ప్రశాంత్‌నగర్ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఏర్పాటుచేయాలని రెండేళ్ల క్రితం పోలీసులు పట్టుబట్టి జీహెచ్‌ఎంసీతో నెలకొల్పించారు. రూ.20 లక్షలకు పైగానే వెచ్చించారు. వై జంక్షన్ దాటగానే.. బాలానగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కేవలం 300మీటర్ల వ్యవధిలోనే ఈ సిగ్నల్స్ ఉండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలంగా మారింది. ఇటీవల ఇక్కడ వరద కాలువ నిర్మాణం సందర్భంగా జంక్షన్‌ను తాత్కాలికంగా మూసివేయాల్సి రావడం.. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవడం చకచక జరిగిపోయాయి. ఇక ఆ పనులు పూర్తయి.. ఇప్పటికే రాకపోకలు పునరుద్ధరించినప్పటికీ.. జంక్షన్‌లో సిగ్నల్స్ ఉన్నప్పటి కంటే.. లేనప్పుడే.. ట్రాఫిక్ సాఫీగా సాగుతుండడాన్ని తెలిపోయింది. దీంతో సిమెంట్ దిమ్మెలు ఏర్పాటుచేసి శాశ్వతంగా మూసివేశారు. పాదచారుల సౌలభ్యం కోసం ఒక దిమ్మె తీసి ఉంచారు. కొందరు ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగేలా చేసుకున్నారు. దీంతో పాదచారుల మధ్య నుంచి ప్రమాదకరంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నారు. అదే సమయంలో సిగ్నల్స్ లేకపోవడంతో వై జంక్షన్ నుంచి బాలానగర్ వైపు భారీ వాహనాలు వేగంగా వెళ్తున్నాయి. ఏ సమయంలో ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

**పాదచారులకు భద్రతేదీ?:** జంక్షన్ మూసిన ట్రాఫిక్ పోలీసులు ఒక దిమ్మె తీసి పాదచారులు రాకపోకలు సాగించే ఏర్పాటు చేశారు. క్రాసింగ్ సిగ్నల్స్ లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ రోడ్డు దాటాల్సి వస్తుంది. సిగ్నల్స్‌ను క్రాసింగ్‌కు వినియోగించడంతో సాఫీగా రోడ్డు దాటే వీలుంటుంది. వాహనాల రాకపోకలను నియంత్రించడంతో పాటు పాదచారుల క్రాసింగ్‌కు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

**వాహనాలను నియంత్రిస్తాం**

– ముత్తుయాదవ్, ట్రాఫిక్ సీఐ, కూకట్‌పల్లి

పాదచారుల రాకపోకలకు మాత్రమే ఏర్పాటు చేశాం. కొందరు దిమ్మెలు తీసి రాకపోకలు సాగిస్తున్నారు. దీన్ని నివారించి చర్యలు తీసుకుంటాం.

## మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: **8008573418**
కేపీహెచ్‌బీకాలనీ: **8008573195**, మూసాపేట: **8008573423**, అల్లాపూర్: **9491124918**

### వీధి దీపాల పునరుద్ధరణ



కూకట్‌పల్లి: ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ పరిధి స్వర్ణధామనగర్ రోడ్డు నంబర్-4లో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదు. రాత్రిళ్లు అంధకారంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఈవిషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ ఎలక్ట్రికల్ డీఈ స్వప్న దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆమె స్పందించి సిబ్బందితో వీధి దీపాలకు మరమ్మతులు చేయించి వెలుగులు పునరుద్ధరించి సమస్యను పరిష్కరించారు.

## విద్యార్థులకు దేశభక్తి, జానపద పోటీలు


పీఎన్‌ఎం పాఠశాల విజేతలతో నిర్వాహకులు

మూసాపేట, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్తు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు దేశభక్తి, జానపద పోటీలను శనివారం నిర్వహించారు. కూకట్‌పల్లి ఎన్ఆర్‌సీ గార్డెన్స్‌లో జరిగిన ఈ పోటీల్లో 37 పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆయా రంగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షుడు సతీష్, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## స్వాగతోత్సవం.. స్నాతకోత్సవం



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లిలోని సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాలల స్వాగతోత్సవం, స్నాతకోత్సవం శనివారం అశోకగార్డెన్స్‌లో జరిగింది. ఫ్రెషర్స్‌కు స్వాగతం పలకగా కోర్సులు పూర్తిచేసిన వారికి డిగ్రీ పట్టాలు అందజేశారు. ఆట, పాటలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల ఛైర్మన్ నాగయ్య, అధ్యక్షుడు జి.భాస్కర్‌రావు, కరస్పాండెంట్ జి.భగత్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## అపూర్వం.. ఆమోఘం



మూసాపేట, న్యూస్‌టుడే: తాము చదివిన బడి ఆనవాళ్లు లేకుండా పోయినా అందులో చదివిన విద్యార్థులంతా ఒకేచోట సమావేశమయ్యారు. బాల్య మిత్రుల ఆత్మీయ పలకరింపులు, తీపి గుర్తులను నెమరు వేసుకొని ఆనంద పడ్డారు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డు మలుపులోని భరత్‌నగర్ వద్ద సెయింట్ జేవియర్ హైస్కూల్ 1985 నుంచి 2007 వరకు కొనసాగి.. తర్వాత మూత పడింది. నిర్వాహకులు బాల్‌రెడ్డి దంపతులు సైతం దివంగతులై ఏళ్లు గడుస్తోంది. అయితే, పాఠశాలలో చదివిన అన్ని తరగతులకు చెందిన విద్యార్థులు శనివారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్స్‌లో 'మెగా సమ్మేళనం' నిర్వహించారు. 22 బ్యాచ్‌లకు చెందిన దాదాపు 500 మంది తరలివచ్చారు. బాల్‌రెడ్డి దంపతులకు నివాళులర్పించారు. 35మంది ఉపాధ్యాయులను సత్కరించారు. మరణించిన సహచర విద్యార్థులను తలుచుకుని బాధపడ్డారు. సాంస్కృతిక కార్యక్రమాలు.. సామూహిక భోజనాలతో సందడి చేశారు.

## కళాశాలలో బతుకమ్మ సంబరాలు



కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: కూకట్‌పల్లి భాగ్యనగర్‌కాలనీలోని ప్రగతి డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులతో బతుకమ్మలు మధ్యలో ఉంచి ఆడి, పాడి సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. ప్రభుత్వ హత్యే: ఈటల రాజేందర్

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: బుచ్చమ్మది ఆత్మహత్య కాదని.. ముమ్మాటికీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హత్యని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తున్నామని స్పష్టం చేశారు. హైడ్రా కూల్చివేతల భయంతో కూకట్‌పల్లి యాదవబస్తీకి చెందిన గుర్రంపల్లి బుచ్చమ్మ(56) శుక్రవారం ఆత్మహత్య చేసుకోగా ఆమె మృతదేహాన్ని శనివారం ఆయన సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ..నల్లచెరువులో బుచ్చమ్మ రెండు ఇళ్లు, షెడ్డు తన ముగ్గురు కూతుళ్లకు ఇవ్వగా.. వాటి ఎదురుగా 22న కూల్చివేతలు జరిగినప్పటి నుంచి భయంతో ఉందన్నారు. శని, ఆదివారం భయం.. భయంగా గడుపుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ప్రజలను కన్నీళ్లు పెట్టిస్తూ.. రేవంత్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మూసీ ప్రక్షాళన వరదల నియంత్రణకు కాదని.. ముంపురాని ప్రాంతాల్లోనూ 50అడుగుల ఎత్తు ఉన్న చైతన్యపురిలోని ఇళ్లకు కూడా నోటీసులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. మేధావులు, చెరువుల పరిరక్షణకు కృషి చేసేవారు ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. పేదలకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

## హైడ్రా విధానాలపై శాసనసభలో చర్చ పెట్టండి: ఎమ్మెల్యే


రాజీవ్‌గాంధీనగర్ వాసులతో మాట్లాడుతున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: హైడ్రా విధి, విధానాలపై అత్యవసరంగా శాసనసభలో చర్చ పెట్టి.. తర్వాతనే కూల్చివేతలు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మహత్య చేసుకున్న బుచ్చమ్మ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఆమె భర్త కన్నీరుపెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..బిడ్డలకు అన్యాయం జరుగుతుందన్న మనోవేదనతోనే ఆమె తనువు చాలించిందన్నారు. సీఎం హైడ్రాతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బుచ్చమ్మ ఆత్మహత్య హైడ్రాకు సంబంధంలేదని కమిషనర్ రంగనాథ్ చెప్పడం విడ్డూరంగా ఉందని.. బాధితురాలి ఇంటికి రాకుండా ఎలా రిపోర్టు ఇస్తారని ప్రశ్నించారు. కొన్నిరోజులుగా సఫ్దర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్‌లో డ్రోన్లు తిరుగుతుండడంపై స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, దీన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు.

**అల్లాపూర్:** నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం, రాత్రివేళ డ్రోన్లు పెట్టి వీడియోలు తీయడం సరైన పద్ధతి కాదని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లాపూర్ డివిజన్‌లో రాత్రివేళ డ్రోన్లతో వీడియోలు తీసున్నారని భయపడుతున్న రాజీవ్‌గాంధీనగర్ వాసులను శనివారం ఎమ్మెల్యే కలిసి సమస్యలు తెలుసుకున్నారు. డ్రోన్లతో భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంపై కార్పొరేటర్ సబిహాబేగం అల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## శవ రాజకీయాలు మానుకోవాలి


మాట్లాడుతున్న బండి రమేశ్

బాలానగర్, న్యూస్‌టుడే: భారాస, భాజపా నాయకులు శవ రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ అన్నారు. శనివారం బాలానగర్ శోభన సెంటర్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బుచ్చమ్మ మృతిని అడ్డంపెట్టుకొని హైడ్రాపై విమర్శలు చేస్తుండడాన్ని తప్పుపట్టారు. చట్టం తన పని చేసుకుంటుంటే దాన్ని రాజకీయం చేయడంపై మండిపడ్డారు. నేతలు నాగిరెడ్డి, పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

బాలానగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. శనివారం హస్మత్‌పేటలో జరిగిన పార్టీ ఓల్డ్‌బోయిన్‌పల్లి శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. శాఖ కార్యదర్శిగా వెంకటనర్సయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సీపీఎం శాఖ మహాసభలో నేతలు

## కౌమార విద్యపై శిక్షణ, పోస్టర్ మేళా



సుజనకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో శనివారం కౌమార విద్యపై ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు పోస్టర్ మేళా పోటీలు కూకట్‌పల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలో 73ప్రభుత్వ, 8ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో కౌమార విద్యను ప్రారంభించనున్నట్లు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవిందర్‌రాజు చెప్పారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. మేళాలో మొదటి స్థానంలో నిలిచిన కూకట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని వి.సుజనకు బహుమతి ప్రదానం చేశారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారి రమేశ్‌సంజీవ, ఎంఈవో హరిశ్చంద్ర, కిషన్, భాగ్యమణి, ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణలో జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

స్పందనకు వందనం

కూకట్‌పల్లి: మూసాపేట నుంచి హైటెక్‌సిటీకి వెళ్లే రహదారిలో కైత్లాపూర్ వద్ద ఇరుకు రోడ్డు విస్తరణలో జాప్యంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'టీడీఆర్ ఇచ్చారు.. చోద్యం చూస్తున్నారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించారు. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, దేవాదాయశాఖ అధికారులు, పోలీసులు, ఉదాసిన్ మఠం ప్రతినిధులతో కలిసి ఆయన కైత్లాపూర్ ఇరుకు రోడ్డును పరిశీలించారు. ఉదాసిన్ మఠం వారు ఉన్న గోడను తీసేందుకు లోపల వైపు గోడ నిర్మాణం చేపట్టగా ఐడీఎల్‌కు చెందిన కొందరు అడ్డుకోవడంపై మండిపడ్డారు. అన్ని పేపర్లు, అనుమతులు ఉన్నతర్వాత కూడా ఇలా చేస్తుండడాన్ని తప్పుపట్టారు. రోడ్డు విస్తరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీపీ గణపతి, మూసాపేట సర్కిల్ డీసీ రమేశ్, ఉదాసిన్ మఠం మేనేజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.






## కేపీహెచ్‌బీలో ఎర్రకోట, తాజ్‌మహల్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి మలేషియన్ టౌన్‌షిప్ ఎదురు తాజ్‌మహల్, ఎర్రకోట నమూనాతో ఎగ్జిబిషన్‌ను ఈ నెల 29 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. దసరా, దీపావళి సెలవుల్లో పిల్లలకు ఆహ్లాదం, ఆనందం పంచేందుకు లవ్‌బర్డ్స్, రైడింగ్స్, హ్యాండ్లూమ్స్, క్రాఫ్ట్స్‌తోపాటు రుచికరమైన వంటకాలు ఏర్పాటుచేశామన్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు కొనసాగుతుందన్నారు. రాజారెడ్డి, వెంకట్‌రెడ్డి, జావేద్, భరత్ ఉన్నారు.

## ముళ్లకత్వ చెరువులో పడి ఖమ్మం వాసి మృతి

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలోని ముళ్లకత్వ చెరువులో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఎస్సై లింగం వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా రాయపట్నం వాసి కొండయ్య(35) ఇద్దరితో కలిసి శుక్రవారం కూకట్‌పల్లి కోర్టుకు వచ్చాడు. వెంట వచ్చిన వారికి సాయంత్రం కనిపించలేదు. వారు చుట్టుపక్కల వెతికినా ఫలితం లేదు. శనివారం ఉదయం సందేశంతో కోర్టు సమీపంలోని ముళ్లకత్వ చెరువు వద్ద గాలించారు. నీళ్లల్లో చెప్పు ఆనవాళ్లు కనిపించడంతో వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించారు. ప్యాట్రోలింగ్ పోలీసులు దశరథ్, బాలస్వామి చెరువులోకి దిగి మృతదేహాన్ని బయటకి తీయడంతో కొండయ్యగా గుర్తించారు. చెరువు వద్దకు బహిర్భూమికని వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. శవపరీక్ష ఆదివారం నిర్వహించనున్నారు.

## భగత్‌సింగ్ జయంతి వేడుకలు



బాలానగర్ శ్రీశ్రీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీపీఐ నేతలు

కూకట్‌పల్లి, మూసాపేట: అల్లాపూర్, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో శనివారం భగత్‌సింగ్ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పలు పార్టీల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ ఆయన సేవలను స్మరించారు.


అల్లాపూర్ గాయత్రీనగర్ గాంధీ విగ్రహం హిందూవాహిని కమిటీ, భాజపా నాయకులు

## సంక్షిప్త సమాచారం

### శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలి

బాలానగర్: బాలానగర్ డివిజన్ ఇంద్రానగర్‌లో శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని స్థానికులు నిరసన తెలిపారు. కొందరు ఆక్రమించి చదును చేయడంపై ఇప్పటికే తహసీల్దారు, కలెక్టర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు.

### సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి సంగీత్‌నగర్‌కు చెందిన షేక్‌వలీకి శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యుడు బండి రమేశ్ రూ.70వేల సీఎం సహాయనిధి చెక్కు అందజేశారు. గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### భాజపా సభ్యత్వ నమోదు

బాలానగర్: బాలానగర్ డివిజన్ రాజుకాలనీ గాంధీబొమ్మ వద్ద శుక్రవారం రాత్రి భాజపా డివిజన్ అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, నియోజకవర్గ బాధ్యుడు మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పలువురికి సభ్యత్వ నమోదు చేశారు.

### వరద బాధితులకు రాతపుస్తకాలు

ఫతేనగర్: వరద బాధిత ప్రాంతాలైన ఖమ్మం, సూర్యాపేట, మహబూబ్‌నగర్, విజయవాడలో పంపిణీ చేసేందుకు గౌతంనగర్‌లోని ఎస్ఎస్‌కేకే పాఠశాల నిర్వాహకులు సమకూర్చిన రాతపుస్తకాలను శనివారం కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ చేతులమీదుగా రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులకు అందించారు. జిల్లా శాఖ ఛైర్మన్ భీంరెడ్డి, యూత్ రెడ్‌క్రాస్ కన్వీనర్ మణిదీప్ పాల్గొన్నారు.

### భగవద్గీత పఠనం, శ్రవణం ముఖ్యం

కేపీహెచ్‌బీకాలనీ: ఆధునిక సమాజంలో భగవద్గీత పఠనం, శ్రవణం ముఖ్యమైనవని ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కేపీహెచ్‌బీ పరిధిలోని మహేంద్ర అశ్విత గేటెడ్ కమ్యూనిటీలో వెంకట్‌రెడ్డి భగవద్గీత ప్రవచనం చేశారు. భగవద్గీతలోని పలు అధ్యాయాలకు సంబంధించిన విషయాలను వివరించారు. సీనియర్ సిటిజన్లు, టౌన్‌షిప్‌వాసులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు స్టేషనరీ కిట్ల పంపిణీ

అల్లాపూర్, : కొత్తూరు సీతయ్యనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే కృష్ణారావు నిధులతో సమకూర్చిన స్టేషనరీ సామగ్రితో కూడిన కిట్లను కార్పొరేటర్ సబిహాబేగం విద్యార్థులకు శనివారం పంపిణీ చేశారు. ఈ ఏడాది వంద మంది విద్యార్థులకు కిట్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు.

## సీపీఆర్‌పై శిక్షణ

శేరిలింగంపల్లి: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా గుల్ మొహర్ పార్క్ కాలనీలో సీపీఆర్‌పై శిక్షణ శిబిరం నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రామస్వామి యాదవ్, సిటిజన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ దీపక్ మాట్లాడుతూ.. వ్యక్తికి ఊపిరి తీసుకోలేకపోవడం, పల్స్ అందక పోయినప్పుడు సీపీఆర్ చేయాలని వివరించారు. కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసిం, ఆనంద్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో వసతుల కల్పనకు చర్యలు

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శనివారం రామచంద్రాపురం పోచమ్మ ఆలయం వద్ద రూ.1.23 కోట్లతో నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాథోడ్, డి సురేష్, ప్రిన్సిపాల్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

## యువజనోత్సవాల్లో డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో ప్రతిభ చాటారు. వ్యాసరచన, వక్తృత్వం, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలుచుకున్నారని ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించారు. పద్యరచనలో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు వెంకటేశం, కరుణాకర్‌లను అభినందించారు. వైస్‌ప్రిన్సిపల్ ప్రవీణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పూనమ్‌కుమారి, అధ్యాపకులు యోగిబాబు, మంజుశ్రీ, సురేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, మల్లిక పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. శనివారం పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పి.రత్నప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.బాబురావు, ప్రధాన కార్యదర్శిగా యాదిరెడ్డి ఎన్నికయ్యారు.



# సహజత్వం.. ఆరోగ్య సూత్రం

**వీగన్ ఫెస్టివల్.. అదరహో**

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్‌లోని మాదాపూర్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన వీగన్ ఫెస్టివల్‌లో పలు ఆహార పదార్థాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కూరగాయలతో చేసిన బేకరీ ఫుడ్స్, చక్కెర, నీరు, యంత్రాలు ఉపయోగించకుండా తయారుచేసిన జ్యూస్‌లు ప్రదర్శనలో ఉంచారు. వెదురుతో చేసిన టూత్‌బ్రెష్‌లు, పెన్నులు, పెన్సిల్‌లు ఎకోఫ్రెండ్లీ ఉత్పత్తులు ప్రత్యేకంగా నిలిచాయి.

### వెజిటేబుల్ బేకరీ పదార్థాలు..



హైదరాబాద్‌కు చెందిన అరుంధతి దా లవ్వింగ్ ఓవెన్ పేరుతో వీగన్ బేకరీ పదార్థాలు తయారు చేస్తున్నారు. ఇవి పూర్తిగా కూరగాయలతో తయారు చేసినవే. తీపి కోసం బీట్‌రూట్, క్యారెట్లు ఉపయోగిస్తారు. బేకరీలలో లభించే అన్ని రకాల పదార్థాలు తయారు చేస్తారు. బాదం, ఉసిరి వంటి వాటి నుంచి తీసిన నూనె పదార్థాలు వాడుతారు. ఎలాంటి జంతు సంబంధిత పదార్థాలు వాడరు. గుమ్మడితో చేసిన కేకు ప్రత్యేకం.



### మిల్లెట్ మిల్క్..

హైదరాబాద్‌కు చెందిన మనీష్‌లాల్ చంద్ నూరిష్‌యూ అనే కంపెనీని స్థాపించాడు. ఇందులో వీగన్ మిల్లెట్ పాలను మాత్రమే ఉపయోగిస్తారు. రాగి, సోయా, జొన్న నుంచి తయారు చేసిన పాల ఉత్పత్తులను డబ్బాల రూపంలో విక్రయిస్తున్నారు. వీటితో టీ, కాఫీలు చేస్తారు. క్వినోవా, పొద్దుతిరుగుడు, గుమ్మడి గింజలు, పుచ్చకాయ విత్తనాలు, వాటి ఉత్పత్తులు విక్రయిస్తున్నారు.

### వెదురు, బీరకాయ గుజ్జుతో ఉత్పత్తులు..

ఎకోఫ్రెండ్లీ ఉత్పత్తుల ప్రాధాన్యత వివరిస్తూ వెదురుతో చేసిన కొన్ని ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. న్యూస్ పేపర్‌తో చేసిన పెన్సిల్స్, వెదురు టూత్‌బ్రెష్‌లు, టంగ్ క్లీనర్స్, పెన్నులు, దువ్వెనలు, నేతిబీరకాయ గుజ్జుతో చేసిన పర్యావరణానికి హాని కలింగించని వస్తువులు అమ్మకానికి పెట్టారు. ప్లాస్టిక్ వస్తువులను వీరికి ఇస్తే వాటికి బదులుగా తక్కువ ధరకే వెదురుతో చేసినవి అందిస్తారు.



### వంద శాతం సహజ పండ్ల రసాలు..

సాధారణంగా పండ్ల రసాల్లో చక్కెర రంగులు వాడుతారు. అమితేష్‌శర్మ స్థాపించిన ఎన్ కోల్డ్‌ప్రెజర్ కంపెనీ వంద శాతం సహజ పండ్ల రసాలు అందిస్తుంది. తాజా పండ్లను తీసుకొని అందులో చక్కెర, నీరు, రంగులు వాడకుండా, ఫ్రిడ్జ్‌లో ఉంచకుండా అందిస్తారు. ఈ రసాలను తీయడానికి మిక్సీలను కూడా ఉపయోగించరు. సాధారణ రసాల కంటే వీటిలో 40శాతం ఎక్కువ పోషకాలుంటాయని తెలిపారు. వాటిని వెంటనే సీసాలో అందిస్తారు.



## అధికారుల నియామకం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను నియమించారు. ఏసీపీ మోహార్ పలక్‌నుమా సర్కిల్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎల్బీనగర్ సర్కిల్‌లో పనిచేస్తున్న ఎంఎస్ వెంకటరమణను నియమించారు. టీపీఎస్ రమేష్‌ను కుత్బుల్లాపూర్ సర్కిల్‌కు కేటాయించగా, ఆయన స్థానంలో కూకట్‌పల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న టీపీఎస్ సోమేశ్వర్‌ను నియమించారు. రోడ్డు విస్తరణ ప్రక్రియలో పనిచేస్తున్న టీపీఎస్ రవీందర్ కూకట్‌పల్లి సర్కిల్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో చార్మినార్ సర్కిల్‌లో పనిచేస్తున్న ఎం.ఏ జీషాన్‌ను నియమిస్తూ గ్రేటర్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. వీరు త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

## మైహోమ్ జ్యువెల్‌వాసుల పెద్ద మనసు

### లడ్డూ వేలం మొత్తం సీఎమ్మార్‌ఎఫ్‌కు వితరణ



ఎమ్మెల్యే గాంధీకి చెక్కు అందజేస్తున్న మై హోమ్ జ్యువెల్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

మియాపూర్: మదీనాగూడలోని మైహోమ్ జ్యువెల్ అపార్ట్‌మెంటువాసులు తమ పెద్ద మనసు చాటుకున్నారు. వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో వచ్చిన రూ.ఐదు లక్షల మొత్తాన్ని ఇటీవల తెలంగాణలో సంభవించిన వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేయాలని నిర్ణయించుకున్నారు. శనివారం తమ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే గాంధీకి ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఏటా లడ్డూ వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్న అపార్ట్‌మెంటువాసులను ఎమ్మెల్యే అభినందించారు. కార్పొరేటర్ శ్రీకాంత్, మై హోమ్ జ్యువెల్ సంక్షేమ సంఘం అధ్యక్షులు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి రవి, స్థానికులు కరుణాకర్‌రెడ్డి, ప్రసాద్, మురళీధర్‌రావు, రాజేంద్రన్, రవి తదితరులున్నారు.

### ఆర్‌యూబీ సమస్య పరిష్కరిస్తా

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆర్‌యూబీ ప్రాంతాన్ని పరిశీలించారు. శేరిలింగంపల్లి సర్కిల్ ఈఈ ప్రసాద్, డీఈ ఆనంద్ పనులు జరుగుతున్న విధానం గురించి వివరించారు. వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పింక్ పవర్ రన్.. ట్రాఫిక్ మళ్లింపు నేడు

రాయదుర్గం: పింక్ పవర్ రన్‌ను పురస్కరించుకుని ఆదివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియం పరిసర ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి 8.30 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేయనున్నట్లు సైబరాబాద్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

**పరుగు సాగే మార్గం, ట్రాఫిక్ మళ్లింపు ఇలా.. 10 కిలోమీటర్లు:** గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి అథ్లెటిక్స్ స్టేడియం గేట్ నం.1 నుంచి ఆరంభమై ట్రిపుల్ ఐటీ కూడలి వద్ద కుడిమలుపు, ఐఎస్‌బీ రోడ్డు మీదుగా విప్రో కూడలి చేరుకుని కుడి మలుపు తీసుకుని టీఎన్‌జీఓస్‌కాలనీ యూటర్న్ వరకు అక్కడి నుంచి మలుపు తీసుకుని అదే దారిలో తిరిగి స్టేడియానికి.

**5 కిలోమీటర్ల పరుగు:** అదే దారిలో ఐఎస్‌బీ ప్రధాన గేటు ముందు యూటర్న్ వరకు అక్కడి నుంచి తిరుగుపయనం అవుతారు.

**3 కి.మీ. పరుగు:** అదే దారిలో పుల్లెల గోపీచంద్ అకాడమి వరకు అక్కడి యూటర్న్ తీసుకుని వెనక్కి స్టేడియానికి చేరుకునేలా మార్గాన్ని నిర్దేశించారు.

**మళ్లింపు ఇలా..**◆ పరుగు సాగే దారిలో ట్రాఫిక్‌ను అనుమతించరు. మెహిదీపట్నం, ఓఆర్‌ఆర్‌ల వైపు నుంచి లింగంపల్లి వైపునకు వచ్చే వాహనాలను గచ్చిబౌలి చౌరస్తాలో కొండాపూర్ వైపునకు మళ్లిస్తారు. అక్కడినుంచి బొటానికల్ గార్డెన్, మసీదు బండ, హెచ్‌సీయూ డిపో వద్ద కుడి మలుపు తీసుకుని లింగంపల్లి వైపు వెళ్లాలి. ◆ గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, క్యూసిటీ, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నుంచి గచ్చిబౌలి వైపు వచ్చేందుకు.. విప్రోకూడలి వద్ద కుడి వైపు మళ్లించి నానక్‌రాంగూడగ్రామం, ఓఆర్‌ఆర్ మీదుగా వెళ్లేలాచూస్తారు. ◆ లింగంపల్లి, హెచ్‌సీయూ, మసీదుబండ ప్రాంతాల నుంచి గచ్చిబౌలి, మెహిదీపట్నం, కొత్తగూడ వైపునకు.. డీఎల్ఎఫ్ కూడలి వద్ద ఎడమవైపు మళ్లించి కాడిసన్, గచ్చిబౌలి జెడ్‌పీహెచ్‌ఎస్ యూటర్న్ తీసుకుని గచ్చిబౌలి కూడలి.. మెహిదీపట్నానికి వెళ్లొచ్చు. ◆ కొండాపూర్, కొత్తగూడ, బొటానికల్ గార్డెన్ నుంచి ఇటు లింగంపల్లికి వచ్చేందుకు బొటానికల్‌గార్డెన్ వద్ద కూడలి మీదుగా మసీదుబండ,

## లడ్డూ కల్తీ బాధ్యులను శిక్షించాలి



జనసేన ఆధ్వర్యంలో నిరసన

మియాపూర్, న్యూస్‌టుడే: తిరుమలలో లడ్డూ కల్తీకి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం న్యూ హఫీజ్‌పేట ప్రేమ్‌నగర్ బి బ్లాక్ హనుమాన్ దేవాలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు నిరసన తెలిపారు. ఈ మేరకు ఆలయంలో వెంకటేశ్వర స్వామి నామ నామస్మరణచేస్తూ క్షమా పూర్వక పూజలను నిర్వహించారు. అనంతరం ప్రేమనగర్ లో నిరసన చేపట్టారు. రామకృష్ణ, రాజు, శ్రీనివాసచారి, వార్డు కమిటీ సభ్యులు రూపారెడ్డి, లక్ష్మి, రాజేశ్వరి గోపాలకృష్ణ, గాయత్రి, భాగ్యలక్ష్మి, తదితరులున్నారు

చందానగర్: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై శేరిలింగంపల్లి జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. శనివారం చందానగర్ వెంకటేశ్వర ఆలయంలో జనసేన శేరిలింగంపల్లి ఇంఛార్జి మాధవరెడ్డి ఆ పార్టీ నాయకులు దేవాలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు.

### జరిమానా

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 21 మంది మద్యం తాగి వాహనాలునడుపుతూ పట్టుబడ్డారు. సంగారెడ్డి ఉదయపుకోర్టు ఒక్కొక్కరికీ రూ.1500 జరిమానా విధించింది.



## పాఠశాలకు సామగ్రి వితరణ



ప్రధానోపాధ్యాయురాలికి సామగ్రి అందజేస్తున్న జాయ్ ఆలుక్కాస్ ప్రతినిధులు

ఆల్విన్‌కాలనీ: కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీ జాయ్ ఆలుక్కాస్ జ్యువెలరీ సంస్థ ప్రతినిధులు శనివారం ఎల్లమ్మ బండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.2,10,300 లక్షల విలువైన సామగ్రిని విరాళంగా అందజేశారు. కార్పెట్లు, సౌండ్ సిస్టం, కుర్చీలు, కిటికీలకు ఇనుప జాలీలను ప్రధానోపాధ్యాయురాలు రాధా పద్మజకు సంస్థ మేనేజర్ ఫీస్ వర్గీస్ అందించారు. ఫ్లోర్‌మేనేజర్ నితిన్, ఉపాధ్యాయులు మోహన్ రావు, సీతాలక్ష్మి, శ్రీనివాస్, విజయలక్ష్మి, సుధారాణి, విఠల్‌గౌడ్ పాల్గొన్నారు.


## జీవనశైలిలో మార్పులతో గుండె జబ్బులు



ఏఈడీ పరికరాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్లు అనిల్ కృష్ణ, సతీష్‌కుమార్, శరత్‌రెడ్డి తదితరులు

మాదాపూర్: మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవితంతో గుండెజబ్బులు పెరుగుతున్నాయని మెడికవర్ హాస్పిటల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ అన్నారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా అత్యాధునిక ఏఈడీ (ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్) పరికరాన్ని మాదాపూర్ మెడికవర్ ఆసుపత్రిలో ఆవిష్కరించారు. డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. గుండెజబ్బు మరణాల్ని నియంత్రించే చర్యల్లో భాగంగా ఏఈడీ, సీపీఆర్ ఉపయోగపడతాయని చెప్పారు. మెడికల్ డైరెక్టర్ సతీష్ కుమార్ కైలాసం మాట్లాడుతూ.. ఏఈడీలతో షాక్ ఇవ్వడానికి వైద్య నిపుణులక్కర్లేదని, పారామెడికల్స్, ఒకటి, రెండుసార్లు చూసినవారు (స్వల్ప శిక్షణ పొందినవారు) ఏఈడీని ఆపరేట్ చేయొచ్చని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ డైరెక్టర్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ శరత్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ పాల్గొన్నారు.

## బచ్‌పన్‌లో దసరా వేడుకలు



ఫ్యాన్సీ దుస్తుల్లో విద్యార్థులు

మియాపూర్: మియాపూర్ ప్రగతి ఎన్‌క్లేవ్ కాలనీలోని బచ్‌పన్ స్కూల్లో శనివారం నిర్వహించిన దసరా వేడుకలు సందడిగా సాగాయి. ఫ్యాన్సీ డ్రెస్ పోటీల్లో పర్యావరణానికి నష్టం చేయని దుస్తులతో విద్యార్థులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## భగత్ సింగ్‌కు నివాళి

రామచంద్రాపురం రూరల్: రామచంద్రాపురం డివిజన్ సాయినగర్‌లో భగత్ సింగ్ జయంతి నిర్వహించారు. బాలాజీ ఫౌండేషన్ ఛైర్మన్ బలరాం.. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంతోష్, యాదగిరి, మల్లేష్, ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు

## నయన మనోహరం.. కూచిపూడి నృత్యం



శిల్పారామంలో శనివారం కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో చూపరులను ఆకట్టుకున్నారు. నాట్యగురువు ప్రత్యూష శిష్యబృందం చక్కటి హావభావాలతో ప్రదర్శించిన నృత్యాంశాలు నయనమనోహరంగా సాగాయి. –న్యూస్‌టుడే, మాదాపూర్

### ఉత్సాహంగా ఓనం



శేరిలింగంపల్లి: నల్లగండ్ల అపర్ణ గ్రాండేలో ఓనంసంబరాలు ఉత్సాహంగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెయ్యం నృత్యం ఆకర్షించింది. కృష్ణ ప్రసాద్, అయిజు పౌల్, ప్రియా నాయర్, అన్నా మేరీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి.

## దసరా వేడుకల నిర్వహణపై సమీక్ష

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు డివిజన్‌లో సద్దుల బతుకమ్మ అక్టోబర్ 10న, దసరా 12న నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం కోదండసీతారామచంద్రస్వామి ఆలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో సద్దుల బతుకమ్మ సాకిచెరువు కట్టపై నిర్వహించుకోవాలని తెలిపారు. దసరా రోజు సాయంత్రం 5 గంటలకు గ్రేటర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధ్వజారోహణ నిర్వహించి, మల్టీపర్పస్ పంక్షన్ హాలు ప్రాంగణంలో శమీ చెట్టుకు పూజలు నిర్వహించాలన్నారు. రాత్రి 7 గంటలకు మైత్రీమైదానంలో రావణాసుర దహనం కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి రిమాండ్

పటాన్‌చెరు అర్బన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పటాన్‌చెరు ఆబ్కారీ స్టేషన్ సీఐ పరమేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన శంభుసింగ్ పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో గంజాయి విక్రయిస్తున్నాడని సమాచారంతో మెదక్ ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. అతని వద్దనుంచి 670 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన హర్షవర్ధన్ పశ్చిమగోదావరి జిల్లా పాడేరు నుంచి గంజాయి తెచ్చి ఇస్నాపూర్‌లో విక్రయిస్తున్నాడని తెలియడంతో శనివారం వారిని పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పటాన్‌చెరు అర్బన్: పటాన్‌చెరు పోలీసులు గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించారు. ఎస్సై అంబర్య వివరాల ప్రకారం.. ముత్తంగి బస్టాండు సమీపంలో శుక్రవారం రాత్రి దాదాపు 30 ఏళ్లున్న గుర్తుతెలియని వ్యక్తి చనిపోయిఉన్నాడు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

## భర్త మందలించినందుకు భార్య అదృశ్యం

పటాన్‌చెరు అర్బన్: భర్త మందలించినందుకు భార్య అదృశ్యమైంది. పటాన్‌చెరు పోలీసుల వివరాల ప్రకారం.. ఇస్నాపూర్‌లో ఉంటున్న ఓ మహిళ(24) వేరే వ్యక్తితో చనువుగా ఉండడం చూసి భర్త మందలించాడు. దీనితో ఆమె తర్వాత కన్పించకుండా పోయింది. వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## క్రీడలతో విద్యార్థుల్లో దృఢ సంకల్పం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: చదువుతోపాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వాలని ఎఫ్ఐబీఏ మాజీ కమిషనర్, వరల్డ్ టెక్నికల్ డెలిగేట్ నార్మన్ ఇసాక్ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి చిరెక్ ఇంటర్నేషనల్ స్కూల్ క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఎస్ఓ) బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రిన్సిపల్ సంచిత రాహో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 53 పాఠశాలల విద్యార్థులు, 122 జట్లు పాల్గొంటాయని తెలిపారు. మహిళల బాస్కెట్ బాల్ ఛాంపియన్ పుష్ప సెంథిల్ కుమార్ పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్

## అందమైన బొమ్మలు.. ఆహ్లాదంగా పాఠశాల గోడలు


బొమ్మలు వేస్తున్న సంస్థ ప్రతినిధులు

నిజాంపేట: కాలపరిమితి దాటిన బడి గోడలు స్వచ్ఛంద సంస్థల చొరవతో అందంగా మారాయి. నిజాంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 275 మంది విద్యనభ్యసిస్తున్నారు. బడి గోడలకు రంగులు వేసి ఏళ్లు గడుస్తోంది. తుక్కుం స్వచ్ఛంద సంస్థ, వర్స్ట్ సోర్స్ కంపెనీ సంయుక్తాధ్వర్యంలో పాఠశాలలోని స్వయంగా గోడలపై అందమైన ఆకృతులకు జీవం పోశారు. విద్యార్థుల దైనందిన కార్యకలాపాలను ఆకృతులుగా మలచడంతో పిల్లలు సైతం మురిసిపోయారు.

## తిరుమలను రక్షిద్దాం.. సనాతన ధర్మాన్ని కాపాడదాం


ర్యాలీ నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ ప్రతినిధులు

దుండిగల్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూలో కల్తీ జరగడాన్ని నిరసిస్తూ దూలపల్లిలో రామాలయం నుంచి స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వరకు బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. తిరుమలను రక్షిద్దాం, సనాతన ధర్మాన్ని కాపాడదాం అని నినాదాలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేవాలయాల్లో సిబ్బంది హిందువులు మాత్రమే ఉండాలన్నారు.

## బతుకమ్మకుంట నిర్మాణానికి శంకుస్థాపన

షాపూర్‌నగర్: జగద్గిరిగుట్ట డివిజన్‌లోని రాజీవ్‌గృహకల్ప కాలనీలో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న బతుకమ్మకుంట పనులు శనివారం ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ జగన్ భూమి పూజ నిర్వహించారు. గాజులరామారం సర్కిల్ ఈఈ కిష్టప్ప, డీఈ రూపాదేవి, ఏఈ తిరుపతి పాల్గొన్నారు. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. అనంతరం సోమయ్యనగర్‌లోని బతుకమ్మ కుంటను కార్పొరేటర్ పరిశీలించారు. అందులో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని రెండు రోజుల్లో పండగ కోసం సిద్ధం చేయాలని సూచించారు.

## దుండిగల్‌లో మసీదు ప్రారంభం

దుండిగల్: దుండిగల్‌లో నూతనంగా నిర్మించిన మసీదు- ఈ-ఆరాఫత్ ప్రార్థనా మందిరాన్ని శనివారం ఎమ్మెల్యే వివేకానంద్ ప్రారంభించారు. అనంతరం మిలాద్-ఉల్-నబీ వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, కృష్ణయాదవ్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● ఈ మసీదుకు మాజీ సర్పంచి, కాంగ్రెస్ నాయకుడు కావలి గణేష్ శనివారం రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు.

# నాలాను చేరని వరద.. దారంతా బురద

● రూ.లక్షలు వెచ్చించినా కనిపించని ప్రయోజనం ● కాలువ.. రోడ్డు సమాంతరంగా లేకపోవడమే కారణం

న్యూస్‌టుడే, కుత్బుల్లాపూర్


కాలువ ఎత్తుగా ఉండటంతో వరద నిలిచి చిత్తడిగా మారిన రోడ్డు

వరద సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం.. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడంతో నిధుల వృథా మినహా ప్రజల ఇక్కట్లు తీరడం లేదు. లోతట్టు ప్రాంతాల్లో ముంపు ఇక్కట్లు లేకుండా రహదారుల పక్కన వరద కాలువలు నిర్మిస్తున్నారు. రోడ్లపై ప్రవహించే వరద మాత్రం వీటిలో వెళ్లడంలేదు. వెరసి రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా ఫలితం ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు.

**రూ.25 లక్షలతో నిర్మించినా...**

జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి వినాయకనగర్ మీదుగా కుత్బుల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారి పక్కన పుచ్చపల్లి ఓఎస్‌ఐ సమీపంలో హయాంలో ఓపెన్ డ్రైన్ నిర్మించారు. నిర్వహణ వైఫల్యంతో అది పూర్తిగా ఛిద్రమైంది. దీంతో ఎగువ నుంచి వచ్చే వరదంతా ఈ దారి మీదుగా ప్రవహిస్తుండటంతో ధ్వంసమైంది. సమస్యను పరిష్కరించడం కోసం 2021 జూన్‌లో రూ. 25 లక్షలతో వరద కాలువ నిర్మాణం చేశారు. కాలువకు సమాంతరంగా రహదారిని అభివృద్ధి చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో వర్షం కురిసిన ప్రతిసారి వరద కాలువలోకి వెళ్లే అవకాశం లేక రోడ్డు మీద ప్రవహిస్తోంది. దారి ఛిద్రమవుతూ రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యారు. వాన కురిసిన సమయంలో రహదారిపై నిలిచిన వరదను డ్రైన్‌లోకి మళ్లించే ప్రయత్నం కూడా చేయకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రసాయన వ్యర్థ జలాలూ వస్తుండటంతో..**

జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి కుత్బుల్లాపూర్, జీడిమెట్ల సుచిత్ర కూడలిని కలిపే ఈ రహదారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఇంతటి కీలకమైన దారిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉన్నా... కాలువ నిర్మించి చేతులెత్తేయడంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడంలేదు. తేలికపాటి వర్షానికే రోడ్డుపై వరద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆ సమయంలో రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. వానలు ఆగినా నీరు నిలిచి బురదమయంగా ఉంటోంది. ఒక్కోసారి పారిశ్రామికవాడ నుంచి వరద నీటితో రసాయన వ్యర్థజలాలు వస్తుండటంతో పరిసర ప్రాంతాలు ఎంతో కూడా వాసనలు వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

పేట్‌బషీరాబాద్, దుండిగల్, షాపూర్‌నగర్, కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే

? జాతీయ రహదారి నుంచి స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి వచ్చే దారిలో రెండు, మూడు చోట్ల వీధి దీపాలు వెలగటం లేదు.
– ఆనంద్‌రెడ్డి, ప్రభుత్వ రెసిడెన్సీ అసోసియేషన్ అధ్యక్షుడు
✓ పరిశీలించి, పాడైపోయిన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తాం.
– రఘుపతిరెడ్డి, డీఈ కుత్బుల్లాపూర్ సర్కిల్

? బౌరంపేటలో రోడ్ల వెంట చెత్త పడేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో పాటు డంపర్ బిన్‌లను ఏర్పాటు చేయాలి.
– వీరేష్, స్థానికుడు
✓ బహిరంగ ప్రదేశాలలో చెత్త పడేస్తే జరిమానా విధిస్తాం. త్వరలో డంపర్ బిన్‌లను ఏర్పాటు చేస్తాం.
–సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక

? గాజులరామారంలోని ప్రణవాయు పార్కు వాకేవేలో చెట్టు పెరిగి పెరిగి నడకకు ఇబ్బంది కలుగుతోంది. నడిచే వారి కళ్లకు కొమ్మలు గుచ్చుకుంటున్నాయి.
– లక్ష్మణ్, సంజయ్‌గాంధీనగర్
✓ పెరిగిన కొమ్మలను తొలగించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– పద్మనాభం, ఉద్యానవిభాగం అధికారి

? వీనస్ ఎన్‌క్లేవ్ కాలనీ నుంచి ప్రణవాయు పార్కుకు వెళ్లే దారి పూర్తిగా గుంతమయంగా ఉంది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోయి గాయపడుతున్నారు.
– మారుతి, వీనస్ ఎన్‌క్లేవ్
✓ ఈ రోడ్డులో బాక్స్‌నాలా నిర్మాణం పూర్తయింది. త్వరలో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తాం.
– కళ్యాణ్, ఏఈ గాజులరామారం

? జనావాసాల మధ్య ఉన్న గాజులరామారం కల్యాణకుంటలో గుర్రపు డెక్క పరుచుకుంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.
– ప్రభాకర్‌రావు, ఉషోదయ కాలనీ గాజులరామారం
✓ గుర్రపు డెక్క తొలగింపునకు టెండరు ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తాం.
– అరుణ్‌కుమార్, ఏఈ ఎస్టమాలజీ విభాగం

? మిథిలానగర్‌లో ఇటీవల రహదారులను తవ్వేసి మురుగు కాలువలు విస్తరించారు. రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
– దేవినేని స్వప్న, మిథిలానగర్
✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి రహదారుల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.
– కిష్టప్ప, ఈఈ గాజులరామారం

## గాజులరామారం కూడలి సుందరీకరణ ప్రారంభం


రోడ్డు మధ్యలో విగ్రహాలను తొలగించి చదును చేస్తున్న జేసీబీ

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం కూడలి సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నలువైపులా ఆక్రమణలు, రోడ్డు మధ్యలో ఇందిరాగాంధీ, వైఎస్సార్ విగ్రహాలు ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గత నెలలో గాజులరామారం ఉపకమిషనర్ మల్లారెడ్డి అధికారులతో కలిసి కూడలిని సందర్శించి విగ్రహాలను పక్కకు తరలించాలని నిర్ణయించారు. దీంతో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆక్కడికి చేరుకుని విగ్రహాల తొలగింపు విషయమై అధికారులతో చర్చించారు. సర్కిల్‌లో ఐడీఓఎల్ కూడలి మాదిరిగా అన్ని కూడళ్లను అభివృద్ధి చేయాలనే నిర్ణయం మేరకు, సహకరించాలని కోరడంతో కాంగ్రెస్ నాయకులు అంగీకరించారు. ఈ క్రమంలో అభివృద్ధి పనులకు మార్గం సుగమమైంది. విగ్రహాలను ఈఎస్ఐ ఆసుపత్రి ప్రహరీ పక్కకు మార్చారు. నలువైపులా ఉన్న పాదచారులు, ఆక్రమణలు తొలగించారు. రోడ్డును విస్తరించే పనులు కొనసాగుతున్నాయి. దీంతోపాటే జగద్గిరిగుట్ట అవుట్‌పోస్టు కూడలి విస్తరణ పనులూ మొదలయ్యాయి. కూడళ్ల అభివృద్ధితో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తొలగిపోయే అవకాశం ఉంది.

## లీకేజీతో వృథా.. సిబ్బందికి లేదు వ్యథ



గాజులరామారం ప్రధాన రహదారిలో నెహ్రూనగర్ కూడలి పోచమ్మ దేవాలయం వద్ద పైప్‌లైన్ లీకేజీతో వారం రోజులుగా తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. వేలాది లీటర్ల నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. పలుమార్లు సమాచారం ఇస్తున్నా కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధాన దారి కావడంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పక్కన నడిచే పాదచారులపై నీరు చిమ్ముతోంది. – న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

## పాఠశాలల్లో మూత్రశాలలు నిర్మించిన సాఫ్ట్‌వేర్ కంపెనీ

షాపూర్‌నగర్: గచ్చిబౌలిలోని సైజెక్ సాఫ్ట్‌వేర్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా జగద్గిరిగుట్టలోని జడ్పీ హైస్కూలు, జగద్గిరినగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో 10 మూత్రశాలలను నిర్మించింది. వాటిని శనివారం కంపెనీ డెలివరీ మేనేజరు హనుమరెడ్డి ప్రారంభించారు. స్కూళ్లలో వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నామన్నారు. కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్, హెచ్ఎం సుభాష్ చంద్రబోస్, సుదాకర్ పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయండి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న వివేకానంద్, చిత్రంలో ధన్‌రాజ్‌యాదవ్, నీలారెడ్డి, సౌజన్య

నిజాంపేట, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ హెచ్చరించారు. నిజాంపేట నగర పాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించాలని ఆదేశించారు. చెత్త తరలింపులో సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందుతుండటంపై మండిపడ్డారు. జాప్యం జరగకుండా సకాలంలో తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓపెన్ జిమ్‌లను సక్రమంగా నిర్వహించి వాటి లక్ష్యం నెరవేరేలా చూడాలన్నారు. అంతకుముందు బాచుపల్లి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. మేయర్ కొలను నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ సౌజన్య, ఆయా విభాగాల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

**కలిసిన కొత్త ఎంఈవోలు**

పేట్‌బషీరాబాద్: మండల విద్యాశాఖ కార్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ తెలిపారు. కుత్బుల్లాపూర్, దుండిగల్, బాచుపల్లి మండలాలకు జెమిని, కృష్ణ, రామకృష్ణ ఎంఈఓలుగా నియమితులయ్యారు. వారు పేట్‌బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల రిసోర్స్ పర్సన్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన అటవీ శాఖ క్రీడల పోటీలు

దుండిగల్, న్యూస్‌టుడే: దూలపల్లిలోని రాష్ట్ర అటవీ అకాడమీ వేదికగా రెండు రోజులపాటు జరిగిన చార్మినార్ రీజియన్ స్పోర్ట్స్‌మీట్ శనివారం ముగిసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలు, జూ పార్కు, అరణ్య భవన్, ఎఫ్‌సీఆర్‌ఐ కాలేజ్, రాష్ట్ర అటవీ అకాడమీకి చెందిన 255 మంది అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముగింపు వేడుకకు రాష్ట్ర అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఏలుసింగ్ మేరు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

## భాజపా గాజులరామారం డివిజన్ సమావేశం

షాపూర్‌నగర్: భాజపా గాజులరామారం డివిజన్ బూత్ స్థాయి కమిటీ సమావేశం శనివారం నర్సింహబస్తీలోని సామాజిక భవనంలో జరిగింది. కార్పొరేటర్ రావుల శేషగిరి మాట్లాడుతూ.. బూత్ ఇన్‌ఛార్జిలు క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ సభ్యత్వాలను నమోదు చేయించాలని సూచించారు. జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

దుండిగల్: దుండిగల్‌లోని ఉన్నత పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు ఎస్ఎస్‌సీ ఏ సర్టిఫికెట్ ఉత్తీర్ణత సాధించిన వారికి శనివారం కౌన్సిలర్ కృష్ణయాదవ్ బహుమతులు అందజేశారు. ఈనెల 19న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 విభాగం కబడ్డీలో పాఠశాల బాలుర, బాలికల జట్లు గెలుపొందాయి. అండర్ 14 విభాగంలో బాలుర జట్టు ద్వితీయ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు ముత్యంగౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు రాధిక పాల్గొన్నారు.

## అమరవీరుడు భగత్‌సింగ్‌కు నివాళి

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: విప్లవకారుడిగా పేరొందిన సర్దార్ భగత్‌సింగ్ జయంతిని గాజులరామారంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సిక్కుబస్తీలో హర్జస్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాజులరామారం గ్రామంలో కార్యక్రమానికి కార్పొరేటర్ రావుల శేషగిరి హాజరై చిత్రపటం వద్ద అంజలి ఘటించారు. డివిజన్ భాజపా అధ్యక్షుడు సాయినాథ్, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం: భాజపా

జీడిమెట్ల,న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ అపురూపకాలనీలోని కాపు సంఘం భవన్‌లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోల్డెన్‌ముఖ్యల సత్తిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ వాసు, గిరిజన మోర్చా అసెంబ్లీ కన్వీనర్ మల్లేశ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# దారి ఇలా.. వాహనాలు కదిలేదెలా?




దుండిగల్ పెద్ద చెరువు కట్ట మీద నుంచి నాగులూరు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. భారీ గుంతలు పడటంతో వాహనాలు ముందుకు కదలడం కష్టంగా ఉంది. వర్షం పడినపుడు నీరు నిలిచి ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు దృష్టి సారించి తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దుండిగల్



## ఔషధ దుకాణంలో అగ్ని ప్రమాదం


సూరారంలోని ఆదిత్య మెడికల్ షాపులో ఎగిసి పడుతున్న మంటలు

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ఓ మెడికల్ షాపులో అగ్ని ప్రమాదం సంభవించి భారీ ఆస్తినష్టం జరిగింది. సూరారం పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వివరాల ప్రకారం.. సూరారం కూడలిలో కొన్ని సంవత్సరాలుగా విక్రమ్ రెడ్డి 'ఆదిత్య ఔషధ దుకాణం' నిర్వహిస్తున్నారు. శనివారం షాపు తెరిచిన అనంతరం మందులు డోర్ డెలివరీ చేయడానికి నిత్యం వినియోగించే ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనానికి ఛార్జింగ్ పెట్టారు. ఒక్కసారిగా వాహనం బ్యాటరీ పేలి షాపులోకి మంటలు వ్యాపించడంతో సిబ్బంది బయటికి పరుగు తీశారు. జీడిమెట్ల అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపు నిక్కు చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. క్షణాల్లో షాపు అంతటా వ్యాపించడంతో ఔషధాలు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి పక్క దుకాణాలకు వ్యాపించకుండా నిరోధించగలిగారు.



# ట్యాంకర్ నుంచి లీకైన రసాయనం

రహదారిపై అదుపు తప్పిన వాహనాలు


దారిపై మట్టి వేయిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోలీసులు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: రసాయనాల్ని తరలించే ట్యాంకర్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా పలువురు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఓ కళాశాల బస్సు నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టింది. శనివారం సాయంత్రం సూరారం ప్రధాన రహదారిలో ఈ పరిస్థితి తలెత్తింది. జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వెంటనే స్పందించి సమస్యను చక్కదిద్దారు. సూరారం వైపు నుంచి ట్యాంకర్ షాపూర్‌నగర్ వెళ్లింది. హనుమాన్ ఆలయం నుంచి జీడిమెట్ల ఆర్టీసీ డిపో వరకు రోడ్డుపై ట్యాంకర్ నుంచి రసాయనం పడిపోయింది. ఆ సమయంలో వెళ్తున్న కొందరు ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కిందపడిపోయారు. వారికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఓ కళాశాల బస్సు డివైడర్‌ను ఢీకొట్టి ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో బస్సును తొలగించారు. ట్రాక్టర్‌తో మట్టిని తెప్పించి రోడ్డుపై వేయించి వాహనాలు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. శాంతిభద్రతల విభాగం పోలీసుల దృష్టికి తీసుకెళ్లాను, ట్యాంకర్‌ను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ చెప్పారు.





## అనుమానాస్పద స్థితిలో తాపీ మేస్త్రీ మృతి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: తాపీ మేస్త్రీ అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన సూరారం ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా దొడ్డిపట్ల గ్రామానికి చెందిన నాగరాజు(41) ఉపాధి నిమిత్తం 10 రోజుల క్రితం నగరానికి వచ్చి శ్రీకృష్ణానగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకుంటున్నాడు. తాపీ మేస్త్రీ పనులు నిర్వహించే ఇతను కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ శనివారం మృతిచెందాడు. ఆస్తమా సమస్యతో ఊపిరాడక చనిపోయి ఉంటాడన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భవనం పైనుంచి పడి బాలుడికి గాయాలు

దుండిగల్: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి బాలుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి అనుమల్లిన్ కాపలాదారు. అదే భవనంలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. శనివారం అతని కుమారుడు ఆర్యన్(8) ఆడుకుంటూ మొదటి అంతస్తు పైనుంచి కింద పడ్డాడు. గాయపడిన చిన్నారిని సూరారంలోని మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైనందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెప్పారన్నారు.

## 1.50 కోట్ల విత్తన బంతుల తయారీ



విత్తన బంతులు సేకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు ఉపేందర్, పక్కన ప్రిన్సిపల్ అన్నపూర్ణ తదితరులు

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: వృక్ష సంపద పెంచడానికి 1.50 కోట్ల విత్తన బంతుల తయారీ చేపట్టినట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆఫీసర్ కేజేఎపీ మహేశ్వరశెట్టి ఉపేందర్ అన్నారు. ఈస్ట్‌మారేడుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఎలక్ట్రానిక్ విభాగం ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రపంచ రికార్డు కోసం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవిచంద్రన్ ఆదేశాలతో కళాశాల విద్యార్థుల సహకారంతో వీటిని బంతులు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

# సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

## కూలిన చెట్టు..రాకపోకలకు అడ్డు



సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బీకేగూడ-ఈఎస్ఐ ఆసుపత్రి ప్రధాన రహదారిలో మండల గోదాం సమీపంలో శనివారం ఉదయం ఓ చెట్టు విరిగిపడింది. ఆ సమయంలో బాటసారులు, వాహనదారులు అటుగా రాకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగింది. కొన్ని కేబుళ్లు తెగిపోయాయి. జీహెచ్ఎంసీ అత్యవసర సిబ్బంది అక్కడికి చేరుకొని చెట్ల కొమ్మలు తొలగించారు. కొన్ని గంటలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

# వరదొస్తే భయం.. కరవైంది అభయం

● ముంపునకు గురవుతున్న బస్తీలు, కాలనీలు

● అధికారుల వద్దే అమీర్‌పేట నాలా అభివృద్ధి ప్రాజెక్టు దస్త్రం



ఈ చిత్రంలో కనిపిస్తున్న నాలాతోనే సమస్య ఉత్పన్నమవుతోంది. దీని ఉధృతితో గాయత్రీనగర్, గంగుబాయిబస్తీ వంటి బస్తీల్లోకి భారీగా వరద నీరు చేరుతుంది. స్వర్ణజయంతి కాంప్లెక్స్ వెనుక వైపు నుంచి వచ్చే నాలాను విస్తరించి, మైత్రీవనం-సత్యం థియేటర్ రోడ్డు కిందుగా నాలాను అభివృద్ధి చేసి అన్నపూర్ణ బ్లాక్ వైపు నాలాలో కలపడం ఈ ప్రాజెక్టులో భాగం. దీంతో ఎంత వరద వచ్చినా నీరంతా అన్నపూర్ణ బ్లాక్ నుంచి వచ్చే ప్రధాన నాలాలోకి వెళ్లిపోతుంది. ఈ కారణంగా వరద ముప్పు తప్పుతుంది.

అమీర్‌పేట, న్యూస్‌టుడే: అమీర్‌పేటలోని పలు బస్తీలు, కాలనీలకు వరద ముంపు నుంచి తప్పించే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులు ముందుకు కదలడం లేదు. గతేడాది పనులు ప్రారంభించినా.. నిధులు మంజూరుకాక గుత్తేదారు మధ్యలోనే వదిలేశారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ యూసుఫ్‌గూడ, మధురానగర్ నుంచి వచ్చే నాలా ప్రవాహం పెరిగి అమీర్‌పేట మైత్రీవనం, స్వర్ణ జయంతి కాంప్లెక్స్ వెనుక వైపు వరద పోటెత్తుతుంది. గాయత్రీనగర్ పరిసర ప్రాంతాల్లోకి వరద చేరుతుంది. అపార్ట్‌మెంట్ల సెల్లార్లు మునిగిపోతుంటాయి. దీనికి పరిష్కారంగా రూ.1.53 కోట్ల వ్యయంతో స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్ఎన్‌డీపీ) కింద నాలాను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

నిధులు మంజూరైనా జాప్యం.. పనులు మంజూరైనా ఎస్ఎన్‌డీపీ అధికారులు పనులు చేపట్టకుండా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి బదిలీ చేశారు. నిధులు సైతం సాధారణ బడ్జెట్ నుంచే మంజూరు చేశారు. అప్పటికే సొంత పెట్టుబడితో 50 శాతం పనులు పూర్తి చేసిన గుత్తేదారు మధ్యలోనే ఆపేశారు. సాధారణ బడ్జెట్ నుంచి డబ్బులు ఆలస్యంగా వస్తాయని పనులపై ఆసక్తి చూపడం లేదు. దీంతో స్థానిక జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రాజెక్టు నిధులను ఎస్ఎన్‌డీపీ ద్వారా మంజూరు చేయించాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఈ దస్త్రం అప్పటినుంచి అధికారుల వద్దే ఉండిపోయింది. ఇది పూర్తయితే తప్ప పనులు తిరిగి మొదలయ్యే పరిస్థితులు కనిపించడం లేదు.



అమీర్‌పేట మైత్రీవనం ప్రాంతం ఇది. ఇక్కడ నాలాపై ఆక్రమణలు సమస్యను మరింత తీవ్ర తరం చేస్తున్నాయి. మైత్రీవనం వెనుక నాలాపై భవనాలు, వైజెలు వసతిగృహాలున్నాయి. ఇందుకోసం నిర్మించిన బాక్స్ డ్రైయిన్ నిర్మాణ పనులు కూడా నిలిచిపోయాయి. నాలాను అన్నపూర్ణ బ్లాక్ వైపు ఉన్న నాలాలో కలిపే ముఖ్యమైన పనులు చేపట్టకుండానే వదిలేశారు. ఆక్రమణలతో పూడికతీత పనులు సైతం సాగడం లేదు.

ఈ ప్రాజెక్టులో భాగంగా మైత్రీవనం వెనుక నిర్మించతలపెట్టిన బాక్స్ డ్రైయిన్ పనులు ఆగిపోయాయి. నాలా సామర్థ్యం చాలకపోవడంతో రోడ్డుకింద ఉన్న పాతదాని ద్వారా అన్నపూర్ణ బ్లాక్ వైపుగా ఉన్న నాలాలోకి మళ్లించే పనులు చేపట్టారు. దీంతో రెండు వైపుల వరద ప్రవహిస్తూ ముంపు సమస్య తీరుతుంది. ఇందుకు సుమారు రూ.35 లక్షల వ్యయంతో ఐదు నెలల కిందట చేపట్టిన బాక్స్‌డ్రైయిన్ పనులు నిలిచిపోయాయి.



**త్వరలో మొదలయ్యే అవకాశం** — మహ్మద్ జమీల్ పాషా, ఈఈ, జీహెచ్ఎంసీ

నాలా అభివృద్ధి పనులు త్వరలో తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. సాధారణ బడ్జెట్ నుంచి ఎస్ఎన్‌డీపీకి బదలాయించే కార్యక్రమం దాదాపుగా పూర్తయింది. నిధులు పూర్తి స్థాయిలో విడుదలైతే 10 రోజుల్లో పనులు పునఃప్రారంభిస్తాం.

## మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట మధ్య

| | |
|---|---|
| సికింద్రాబాద్: | 8008573368 |
| కంటోన్మెంట్: | 8008573361 |
| సనత్‌నగర్: | 8008573356 |

న్యూస్‌టుడే, సికింద్రాబాద్, కార్ఖానా

? సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డ ప్రాంతంలో కొత్తగా రోడ్డు నిర్మించారు. పోగైన శిథిలాలను కుప్పలుగా రోడ్డు మధ్యలో వేశారు.
– రాము, స్థానికుడు

✓ శిథిలాలు, ఇతర వ్యర్థాలను అక్కడికి తొలగిస్తాం.
– కౌశిక్, ఏఈ, సీతాఫల్‌మండి

? మడ్‌ఫోర్ట్ దోబీఘాట్‌లో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. ఇదివరకు చీకటి కారణంగా పలువురు పాముకాటుకు గురయ్యారు.
– శ్రీనివాస్, మడ్‌ఫోర్ట్.

✓ వెంటనే అవసరమైన చోట ఏర్పాటు చేసేలా చూస్తాం.
– శ్రావణ్, వీధి దీపాల నిర్వాహణాధికారి

**స్పందనకు వందనం**

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బీకే గూడ వార్డు కార్యాలయం నుంచి శ్రీరామ్‌నగర్ కాలనీ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ దెబ్బతిందని స్థానికులు మేమున్నాం. . మీకు తోడుగా దృష్టికి తీసుకొచ్చారు. సమస్యపై ఈనాడులో వార్త ప్రచురించగా.. జలమండలి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

## బ్యాంకు ఉద్యోగుల శ్రమదానం



పద్మారావునగర్, న్యూస్‌టుడే: బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ మెట్రో రీజనల్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పద్మారావునగర్ పార్కులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో రీజనల్ హెడ్ ఆదిత్య కుమార్ కన్నయుజియా, డిప్యూటీ రీజనల్ మేనేజర్ ప్రవాకర్ జపత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అందుబాటులో విద్యుత్తు బిల్లు కౌంటర్లు

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: న్యూబోయిన్‌పల్లిలోని బోయిన్‌పల్లి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లోని బిల్లు కౌంటర్లు ఆదివారం సెలవు రోజైనా పని చేస్తాయని ఏడీఈ కృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కౌంటర్లు అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సామాన్యుల ఇళ్లు కూల్చడం తగదు

లాలాపేట, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో సామాన్యుల ఇళ్లను కూల్చడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. శనివారం ఓయూలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధనవంతులు, రాజకీయ పలుకుబడి ఉన్న వారిని వదిలేసి పైసాపైసా కూడబెట్టుకొని కట్టుకున్న ఇళ్లను కూల్చుతున్నారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అనుమతులు ఇచ్చిన అధికారులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## 'కంటోన్మెంట్‌పై సవతి ప్రేమ'

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతాభివృద్ధిపై సవతి ప్రేమ చూపిస్తోందని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ విమర్శించారు. శనివారం ఆయన సిఖ్ రోడ్డులోని రాధాస్వామికాలనీ, జుపిటర్ కాలనీ, కిరణ్ ఎన్‌క్లేవ్, వాహినినగర్, రైల్ ఎన్‌క్లేవ్ కాలనీల ప్రతినిధులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు.

# సభ్యత్వ నమోదుతో పార్టీ బలోపేతం



మాట్లాడుతున్న జయశ్రీ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని భాజపా నాయకులు సూచించారు. శనివారం సికింద్రాబాద్ మహబూబ్ పాఠశాలలోని వివేకానంద ఆడిటోరియంలో సభ్యత్వ నమోదు సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, మాజీమంత్రి మర్రి శశిధర్ రెడ్డి, కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్ర, రాష్ట్ర నాయకురాలు జయశ్రీ, సారంగపాణి, పెద్ది రవీందర్, రాజశేఖర్‌రెడ్డి, రవిప్రసాద్‌గౌడ్‌లు హాజరయ్యారు.

బౌద్ధనగర్: బౌద్ధనగర్ డివిజన్ వారాసిగూడ, పుల్లయ్యబావి ప్రాంతాల్లో భాజపా నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్ హాజరై మాట్లాడారు.

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సీతాఫల్‌మండి డివిజన్‌లోని 146వ బూత్ కోఆర్డినేటర్ కృష్ణ ఆధ్వర్యంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.రవిప్రసాద్ గౌడ్, కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్ దత్తు, రంగస్వామి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఓయూలో బతుకమ్మ వేడుకలు

లాలాపేట: ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు యశస్వినీ రెడ్డి, పర్ణికారెడ్డి హాజరయ్యారు.

## ఉత్సవాలు శాంతియుతంగా చేసుకోవాలి: ఏసీపీ

సికింద్రాబాద్: నవరాత్రోత్సవాలను శాంతియుతంగా చేసుకోవాలని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఠాణాలో ఇన్‌స్పెక్టర్ అనుదీప్ ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

## దేశాన్ని స్వచ్ఛభారత్‌గా మార్చాలి

లాలాపేట, న్యూస్‌టుడే: ఆంగ్లం, విదేశీ భాషల విశ్వవిద్యాలయం (ఇఫ్లూ)లో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి డా.సుకాంత మజుందార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా విధానం -2020 పై సమీక్ష నిర్వహించారు. ఇఫ్లూ 60 ఏళ్ల ప్రగతిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా ప్రణాళికలు విద్యార్థుల ఉపాధి నైపుణ్యాలను మెరుగుపరచడంపై దృష్టి సారించాలన్నారు. ఇందుకోసం విశ్వవిద్యాలయాలు సరికొత్త పాఠ్య పద్ధతులను తీసుకురావాలని సూచించారు. జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్)వాలంటీర్లతో మాట్లాడారు. విద్యార్థులు, సిబ్బంది తమ నిత్య జీవితంలో స్వచ్ఛతను పాటించి దేశాన్ని స్వచ్ఛ భారత్‌గా మార్చాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం అంటూ మొక్కను నాటారు. ఇన్‌ఛార్జి వీసీ హరిబండి లక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.నరసింహారావు తో పాటు పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.




సమావేశంలో కేంద్ర మంత్రి డా.సుకాంత మజుందార్

## మంత్రి జూపల్లికి వినతి



లాలాపేట, న్యూస్‌టుడే: అన్ని వర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్ టైం టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆ సంఘ ప్రతినిధులు శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందించారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎర్రం నాగేంద్రం తదితరులు మంత్రికి సమస్యలు వివరించారు.

## విద్యార్థుల సమస్యలపై పీడీఎస్‌యూ పోరాటం



గోడపత్రిక ఆవిష్కరణలో హరగోపాల్

లాలాపేట, న్యూస్‌టుడే: విద్యారంగ సమస్యలపై పీడీఎస్‌యూ ఎన్నో పోరాటాలు చేసిందని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. అక్టోబరు 24న ఓయూలో జరిగే పీడీఎస్‌యూ అర్ధ శతాబ్ది ఉత్సవాల సభపే విజయవంతం చేయాలని కోరారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద సభకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉపేందర్, డాక్టర్ దుబ్బా రంజిత్, చరణ్, పీడీఎస్‌యూ నాయకులు ఎం.శ్రీనివాస్, ఏడి రాము, మహేష్ పాల్గొన్నారు.

**పాఠశాలలను బలోపేతం చేయాలి**

మారేడుపల్లి, న్యూస్‌టుడే: పాఠశాలలను బలోపేతం చేయాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ప్రొఫెసర్ హరగోపాల్ తెలిపారు. వెస్ట్‌మారేడుపల్లిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ప్రైమరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో కె.మదన్‌మోహన్‌రెడ్డి, ఉపవిద్యాధికారి జి.శ్రీధర్, హెచ్ఎం మనోహరాచారి పాల్గొన్నారు.

## దర్జీ కుటుంబాలకు తలసాని సాయం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: మోండా మార్కెట్‌లో ఓల్డ్ జైల్‌ఖానా గోడ కూలి నష్టపోయిన ఆరు దర్జీ కుటుంబాలకు శనివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు.

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో వచ్చేనెల 3 నుంచి నిర్వహించే దేవీ దసరా శరన్నవరాత్రోత్సవాలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఈఓ బి.కృష్ణ, ఛైర్మన్ కొత్తపల్లి సాయిబాబాగౌడ్, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషకుమారి ఆహ్వానించారు.



దర్జీ కుటుంబాల వారితో మాట్లాడుతున్న తలసాని

## మంత్రి పొన్నంకు ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఈఓ మనోహర్‌రెడ్డి, అర్చకులు

రాణిగంజ్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో అక్టోబర్ 3న ప్రారంభం కానున్న శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్‌లను ఆలయ అధికారులు కోరారు. శనివారం ఆలయ ఈవో జి.మనోహర్‌రెడ్డి, ఆలయ శ్రీవిద్యా పండితులు వేణుమాధవ శర్మ, ప్రధాన అర్చకులు రామతీర్థశర్మలు ఆహ్వాన పత్రం అందించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పించాలని సూచించారు.

## ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు



బహుమతి అందిస్తున్న అతిథులు

అడ్డగుట్ట, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ ఆర్ఆర్‌సీ మైదానం ప్రాంగణంలోని బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో 8వ ఎడిషన్ పీఎన్‌బీ మెట్‌లైఫ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. ఎషియన్ గేమ్స్ స్వర్ణపతాక విజేతలు, జేబీసీ మెంటార్‌లు చిరాగ్ శెట్టి, సాత్విక్‌సాయి, రాజ్ రాంకిరెడ్డి, ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఆఫ్ ఇండియా సీఈఓ వెంకట్ చంగవల్లి, పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఎండీ, సీఈఓ సమీర్‌బన్సల్ తదితరులు క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు.

## ఖోఖో పోటీల్లో సత్తా



బహుమతితో ఆశ్రిత హోం విద్యార్థులు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: జింఖానా మైదానంలో ఇటీవల జరిగిన మండల స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్ షిప్ ఖోఖో పోటీల్లో సికింద్రాబాద్‌లోని ఆశ్రిత బాయ్స్ హోమ్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. శనివారం సికింద్రాబాద్ డిప్యూటీ ఈవో శ్రీధర్, డిప్యూటీ డీఈవో చిరంజీవి, రమేష్‌గౌడ్ ట్రోఫీ ప్రదానం చేశారు.

## విజేతలకు బహుమతుల ప్రదానం

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో శనివారం హిందీ పక్వాడా-2024 పేరిట పలు పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి రక్షణ శాఖ సదరన్ కమాండ్ డైరెక్టర్ అమూల్ జగ్‌తప్, రాజ్‌భాషా విభాగ్ అసిస్టెంట్ డైరెక్టర్ నీతా బేటిగెరి, బోర్డు సీఈవో మధుకర్‌నాయక్, సంయుక్త సీఈవో పల్లవి విజయ్‌వంశీలతో కలిసి బహుమతులు ప్రదానం చేశారు.

## ఆశ్రమ పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం

కార్ఖానా, న్యూస్‌టుడే: గిరిజన ఆశ్రమ పాఠశాలల డివిజనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో జిల్లా గిరిజనన అభివృద్ధి అధికారి కోటాజీ, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ జంపన ప్రతాప్‌లు ప్రారంభించారు. ఈ పోటీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి దాదాపు 250 మంది గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటున్నట్లు కోటాజీ తెలిపారు.

## రాష్ట్రపతికి ఘన స్వాగతం, వీడ్కోలు

బేగంపేట, న్యూస్‌టుడే: నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు బేగంపేట విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక కాన్వాయ్‌లో శామీర్‌పేట సమీపంలోని నల్సార్ వర్సిటీకి వెళ్లారు. సాయంత్రం ప్రత్యేక విమానంలో దిల్లీకి వెళ్లారు.

నగరానికి నడ్డా.. నగరంలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు శనివారం బేగంపేట విమానాశ్రయంలో భాజపా శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆయనకు కేంద్ర మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు జి.లక్ష్మణ్, ఎంపీ రఘునందన్‌రావు, జాతీయ నాయకులు మురళీధర్‌రావు, ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి,ఎం.రామ్‌చందర్‌రావు స్వాగతం పలికారు.

## భగత్‌సింగ్ తెగువ భావితరాలకు స్ఫూర్తి



సత్యం థియేటర్ కూడలిలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద భాజపా నేతలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ తెగువ భావితరాలకు స్ఫూర్తిదాయకమని భాజపా జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ కొనియాడారు. శనివారం సర్దార్ భగత్‌సింగ్ జయంతి సందర్భంగా అమీర్‌పేట సత్యం థియేటర్ కూడలిలోని విగ్రహానికి పలువురు భాజపా నేతలు, సిక్కు ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సరళ, నియోజకవర్గ కన్వీనర్ శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు. ● భగత్‌సింగ్ జయంతి వేడుకలను సిక్కు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, సిక్కు ప్రతినిధులు అజిత్‌సింగ్, జోగేందర్ సింగ్, లాహోర్‌సింగ్, కుశ్వంత్‌సింగ్, చరణ్‌జిత్‌సింగ్ హాజరయ్యారు.

లాలాపేట, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు లెనిన్ అన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు.



## జెక్‌కాలనీలో బతుకమ్మ సంబురాలు 2 నుంచి



ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీలో అక్టోబరు 2 నుంచి 10వ తేదీ వరకు బతుకమ్మ సంబురాలు నిర్వహించనున్నట్లు బతుకమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. రోజుకో వీధిలో బతుకమ్మ వేడుకలు ఉంటాయని తెలిపారు. 10వ తేదీన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద సద్దుల బతుకమ్మ సంబురాలు ఉంటాయన్నారు. ● బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ కోసం నూతన ఉత్సవ కమిటీని ప్రకటించారు. జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.అన్నపూర్ణ నియమితులయ్యారు.

## డబుల్ ఇళ్ల కేటాయింపుల్లో స్థానికులకే ప్రాధాన్యం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

కార్ఖానా, న్యూస్‌టుడే: కంటోన్మెంట్ ప్రాంతంలో చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపుల్లో స్థానికులకే ప్రాధాన్యతిస్తామని ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. గాంధీనగర్, శ్రీరాంనగర్ బస్తీల్లో శనివారం ఆయన పర్యటించారు. మూసీ నిర్వాసితులకు, ఇతర ప్రాంతాల్లో నివసించే వారికి ఇక్కడ కేటాయిస్తే స్థానికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయణ జోపిడి, మారేడుపల్లి, గాంధీనగర్, శ్రీరాంనగర్ ప్రాంతాల్లో డబుల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయని, వాటిల్లో స్థానికులకే అవకాశం కల్పిస్తామన్నారు. దళారులు, నాయకుల మాటలు నమ్మి ఎవరూ డబ్బులు ఇవ్వొదన్నారు.



## అప్పులబాధతో ఆత్మహత్య

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: అప్పుల బాధతో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం... బీదర్ జిల్లా మెడ్‌పల్లికి చెందిన జగన్నాథ్(49)కు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అప్పులు చేసి పెద్ద కుమార్తె వివాహం చేశాడు. వ్యవసాయం చేసే ఇతను బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నాడు. కుటుంబ పోషణ కష్టం కావడంతో ఆరేళ్ల కిందట నగరానికి వచ్చాడు. సొంతూరులో వ్యవసాయం చేసుకుంటూనే ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో ఉంటూ కంకులు విక్రయిస్తున్నాడు. సాగులో లాభాలు రాక, అప్పులు పెరిగిపోవడంతో శుక్రవారం ఘట్‌కేసర్- బీబీనగర్ స్టేషన్ల మధ్య దానాపూర్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గుజరాత్ వాసి హత్య

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల హత్యకు గురైన వ్యక్తిని వేలిముద్రల ఆధారంగా గుజరాత్ వాసి నిసాద్‌రామ్ సనై కనడ రాజు(37)గా గుర్తించారు. ఇతడు చోరీలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లినట్లుగా తెలుసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 20న రాత్రి 12గంటల సమయంలో 10వ నంబరు ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి రక్తపుమడుగులో ఉన్నట్లు గుర్తించారు. జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గుర్తింపు వివరాలు లభ్యంకాకపోవడంతో అతడి వేలిముద్రలు పరీక్షలకు పంపించారు. మహంకాళి, గాంధీనగర్ ఠాణా పరిధిలో ఏడు దొంగతనాల కేసుల్లో అరెస్టయినట్లు గుర్తించారు. హత్య ఎవరు చేశారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఓ వ్యక్తి కర్రతో ప్లాట్‌ఫాంపై తిరుగుతున్న చిత్రాలు రికార్డయినా.. స్పష్టత లేవని పోలీసులు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

# మల్కాజిగిరి

## అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్, న్యూస్‌టుడే: (శనివారం నాటివి..కిలో రూ.లో) టమాటా 47, వంగ 28, బెండ 40, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 37, దొండ 35, ఆలు 37, ఉల్లి 54, సొర 13, పొట్ల 18, బీన్స్ 55, గోరుచిక్కుడు 35, చిక్కుడు 55, దోస 28, బీర 28, కాకర 38, చామగడ్డ 35, కీర 35, క్యాప్సికం 65, బీట్‌రూట్ 28, కందగడ్డ 55, చిలకడదుంప 45, మామిడి 65, మునగ 80, ముల్లంగి 7(ఒకటి).

**రామకృష్ణాపురం..**

డిఫెన్స్‌కాలనీ: టమాట కిలో రూ.47, వంగ 35, బెండ 40, పచ్చిమిర్చి 28, కాకర 38, బీర 28, క్యాబేజీ 28, బీన్స్ 55, క్యారెట్ 37, దొండ 35, చిక్కుడు 50, క్యాప్సికం 65, ఆలు 38, కీర 18, దోస 28, చామగడ్డ 35, అరటి 10, బీట్‌రూట్ 28, సొర 13, గోకర 35.

## టెలికాం కాలనీ అభివృద్ధికి హామీ: ఎమ్మెల్యే

అల్వాల్: వెంకటాపురంలోని టెలికాం కాలనీ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రిరాజశేఖర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బోయిన్‌పల్లిలోని ఆయన కార్యాలయంలో కాలనీ సంక్షేమసంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు డ్రైనేజీ వ్యవస్థ, పార్కు, నిర్వహణ గది, సీసీ రోడ్ల నిర్మాణం కోరుతూ వినతి పత్రం అందజేశారు. కాలనీ నేతలు విశ్వనాథం, సందీప్, కొండల్‌రెడ్డి, రవి, నవనీత తదితరులు పాల్గొన్నారు.



రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

## రోడ్డు నిర్మాణానికి కృషి

మల్కాజిగిరి: తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ వీవీఎస్ కాలనీలో కొత్తగా సిమెంట్ రహదారి వేయడానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన సర్కిల్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనతో మాట్లాడుతూ.. కాలనీలో పూర్తిస్థాయిలో సిమెంట్ రహదారులను వేయాలని కోరారు. ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, కాలనీ వాసులు సత్తిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నేరేడ్‌మెట్: ప్రజాసేవలో ఉన్న ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ బాధ్యులు డిన్ని కృష్ణన్ కోరారు. సీఐటీయూ మండల కార్యదర్శి బంగారు నరసింహారావు ఆధ్వర్యంలో పాత నేరేడ్‌మెట్ అంబేడ్కర్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించి పెన్షన్ పదివేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్‌చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హేమలత మాట్లాడుతూ.. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ సెంటర్లలో సమస్యలపై మెడికల్ ఆఫీసర్లకు వినతి పత్రం అందజేయాలన్నారు. సుమలత, నమ్రత, వసంత, రాజ్యలక్ష్మి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ప్రాంతం.. అభివృద్ధి అంతంతమాత్రం

**టెంపుల్అల్వాల్ పర్యాటక కేంద్రంగా మారేదెప్పుడో**

అల్వాల్, న్యూస్‌టుడే: వందల ఏళ్ల చరిత్రతో ప్రసిద్ధి చెందిన పట్టణం అల్వాల్. అడుగడుగున ఆధ్యాత్మికత ఉట్టిపడే ఇక్కడి ప్రాంతమే టెంపుల్అల్వాల్. పట్టణం నడిబొడ్డున పాతకట్టడాలు, ఆలయాలతో పాటు ప్రధాన పరిపాలన కేంద్రాలన్నీ ఉన్న ప్రాంతమిది. ఇలాంటి టెంపుల్అల్వాల్‌ను పర్యాటక కేంద్రంగా మలచాలన్న ప్రతిపాదనపై ప్రస్తుత యంత్రాంగం ఒక అడుగు ముందుకు రెండు అడుగుల వెనక్కు వేస్తోంది. ఇక్కడి స్థలాల్లో పార్కులు, కొలను, స్వాగత ద్వారాలు, పాండవ్ల.. అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు ఉన్నాయి. ఇప్పటికే వేంకటేశ్వర కల్యాణ పార్కును అభివృద్ధి చేశారు. ఆ తర్వాత కొన్ని సంవత్సరాల నుంచి నిర్వహణను విస్మరించడంతో నిరుపయోగంగా మారింది.

**నడిబొడ్డున..** కాలక్రమంలో ఈ ప్రాంతం పట్టణం నడిబొడ్డున చేరింది. ఇప్పటికీ అలనాటి జ్ఞాపకాలు, చరిత్రను తెలిపే అనేక కట్టడాలు ఇక్కడ ఉన్నాయి. ఈ పురాతన కట్టడాలల్లో కొన్ని మార్పులు చేసి సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లుగా కొనసాగుతున్నాయి. రైల్వే స్టేషన్, బ్యాంకులు, జలమండలి కార్యాలయాలు ఇక్కడే ఉండడంతో నిత్యం సందర్శకుల తాకిడి అధికంగా ఉంటుంది. ఈ క్రమంలోనే వేంకటేశ్వర ఉద్యాన వనాన్ని శ్రీవారి కల్యాణ మండపం వద్ద లక్షల వ్యయం చేసి అభివృద్ధి చేశారు. కూడళ్లలో పౌంటెన్లు ఏర్పాటు చేశారు. ఈ అభివృద్ధి మున్నాళ్ల ముచ్చటగా మారడంతో అలంకార ప్రాయంగా మారాయి. ఇక ఆలయాలను ఆనుకొని ఉన్న కొత్త చెరువు సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేసి టెంపుల్‌అల్వాల్‌కు కొత్త శోభను తీసుకువస్తామన్న యంత్రాంగం ఆ ఊసే ఎత్తడం లేదు.



**వివరాలు:**

విస్తీర్ణం: 150 ఎకరాలు

ఆలయాలు: 15

భక్తుల సంఖ్య: రోజుకు 500 మంది

**సమన్వయ లోపం..**

టెంపుల్‌అల్వాల్ అభివృద్ధికి కొద్ది శాతంలో దేవాదాయ శాఖ బాధ్యతలు తీసుకొంటుంది. పర్వదినాలు, ఉత్సవాల సమయాల్లో ఆ శాఖ కొన్ని పనులను చేపడుతూ ప్రత్యేకతను చాటుతోంది. కానీ రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాలు, ఖాళీ స్థలాల అభివృద్ధి తదితర సుందరీకరణ పనులన్నీ జీహెచ్ఎంసీ చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఆ విభాగం నుంచి ఆశించిన సహకారం లభించడం లేదన్నది దేవాదాయ శాఖ వాదన.

**త్వరలోనే పనులకు శ్రీకారం: వీరేశం, ఈవో**

బాలాజీ ఆలయంలో ఇటీవల కొన్ని పనులు చేపట్టాం. టెంపుల్‌అల్వాల్ మొత్తం పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే జీహెచ్ఎంసీ సహకారం అవసరం. ఇప్పటికే పలు మార్లు పనులకు సంబంధించి దాతలు, పాలన అధికారులు నేతలకు విజ్ఞప్తి చేశాం.

## మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

గౌతంనగర్, మల్కాజిగిరి, న్యూస్‌టుడే:

? మిర్జాలగూడ చిన్మయ్‌మార్గ్‌లోని నాలా వద్ద పేరుకపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలి. –శ్రీరాంయాదవ్, చిన్మయ్‌మార్గ్

✓ చెత్త నిల్వలను డంపింగ్ యార్డుకు తరలిస్తాం.
–సంజీవ, ఎస్ఎఫ్ఏ, జీహెచ్ఎంసీ

? తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని రాఘవేంద్ర స్వామి మఠం సమీపంలో రహదారులను సక్రమంగా శుభ్రం చేయటం లేదు. – నారాయణరావు, కాలనీవాసి,

✓ సమస్యను పరిశీలించి రోడ్లను శుభ్రం చేయించి, చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, పర్యవేక్షణాధికారి, సర్కిల్ పారిశుధ్య విభాగం

## భగత్‌సింగ్ త్యాగాలు మరవలేనివి




చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: భగత్ సింగ్ దేశం కోసం చేసిన త్యాగాలు మరవలేనివని సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు రొయ్యల కృష్ణమూర్తి అన్నారు. వినాయక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ జయంతి వేడుకలు శనివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దేశం కోసం చివరి శ్వాస వరకు పోరాడి ప్రాణాలర్పించిన అమర వీరుడు భగత్ సింగ్ అని కొనియాడారు. నాయకులు వెంకటరమణ, అజీజ్, పవన్ కుమార్, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్‌కు చెందన వివేకానంద రైజింగ్ సొసైటీ సభ్యులు శనివారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సొసైటీ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలు విడిచిన గొప్ప దేశభక్తుడని అన్నారు. ప్రధాన కార్యదర్శి రషీద్, సత్యనారాయణ, సమీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## భాజపా సభ్యత్వ నమోదు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్



కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత యాదవ్

మల్కాజిగిరి: శివపురిలోని కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ తన కార్యాలయంలో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కొందరి నుంచి సభ్యత్వ నమోదు దరఖాస్తులను స్వీకరించారు.

మౌలాలి: డివిజన్‌లోని ఎంజే కాలనీలో శనివారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ గున్నాల సునీత యాదవ్ హాజరయ్యారు. సభ్యత్వ నమోదులో మౌలాలి ప్రథమ స్థానంలో ఉండాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు సూచించారు. ప్రసాద్ చౌదరి, అడ్వకేట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అల్వాల్: అల్వాల్‌లో ఏర్పాటు చేసిన భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభించింది. ఆ పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు స్థానికులు సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం తీసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నట్లు చెప్పారు.

## ఆలయాల్లో హనుమాన్ చాలీసా పారాయణం



మారుతీనగర్‌లోని ఆంజనేయ ఆలయంలో



మిర్జాలగూడలో..



ఆనంద్‌బాగ్ లక్ష్మీ వేంకటేశ్వర దేవాలయంలో

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని వివిధ ఆలయాల్లో శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆధ్యాత్మిక ప్రచార కమిటీ, భక్త సమాజ సంఘం ఆధ్వర్యంలో అల్వాల్‌హిల్స్‌లోని ప్రసన్నవేంకటేశ్వర ఆలయం, సిటిజన్ కాలనీలోని ప్రసన్నాంజనేయ, ఓల్డ్‌అల్వాల్‌లోని రామాలయం, మచ్చబొల్లారంలోని సంజీవని ఆంజనేయ ఆలయాల్లో నిర్వహించిన పారాయణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఆంజనేయస్వామికి పూజలు**

మల్కాజిగిరి: మారుతీనగర్‌లోని ఆంజనేయ దేవాలయంలోని స్వామిని శనివారం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది ఇక్కడ హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి తమలపాకులతో అలంకరణ చేశారు. ఆనంద్‌బాగ్‌లోని ప్రసన్నాంజనేయస్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

గౌతంనగర్, న్యూస్‌టుడే: మిర్జాలగూడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాద్రపదమాసం కృష్ణపక్షం సందర్భంగా శనివారం స్వామికి అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

**స్వామివారికి**

**తులసీదళమాలతో అలంకరణ**

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని లక్ష్మి వేంకటేశ్వర దేవాలయంలో శనివారం భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి తులసీదళాల దండలతో అలంకణచేశామని ప్రధాన అర్చకులు వెంకటరమణాచార్యులు తెలిపారు.

## శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞం నేడు

గౌతంనగర్, న్యూస్‌టుడే: విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మల్కాజిగిరి సాయిబాబా ఆలయ మండపంలో ఉదయం 9 గంటలకు నాదస్వరము, ధ్వజారోహణము, ఊరేగింపు, 10 గంటలకు యజ్ఞం, 11కు విశ్వకర్మ సంఘం 16వ సమావేశం, మధ్యాహ్నం ఒంటిగంటకు సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

## మలిసంధ్యలో.. కళా నైపుణ్యం

**చిత్రలేఖనంలో రాణిస్తున్న విశ్రాంత ఉద్యోగి**

గౌతంనగర్, న్యూస్‌టుడే: 'జీవితమంటే అంతులేని పోరాటం' అన్నాడో కవి. చదువు, ఉద్యోగం, పిల్లలు వారి భవిష్యత్తు.. ఇలా జీవితం సగం బాధ్యతలతోనే గడిచి పోతుంది. ఎన్నో కష్టనష్టాలతో తమ కుటుంబాలకు ఓ దారి చూపిన వారు మలి సంధ్యలో కాస్త విశ్రాంతి, ఆరోగ్యం కోరుకుంటారు. కానీ ఆయన 72 ఏళ్లుగా తనలో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీస్తూ.. విశ్రాంత జీవితంలో తన మేధస్సుకు పదును పెడుతుండటంతో ఆయన చేతి నుంచి అద్భుతమైన చిత్రాలు జాలువారుతున్నాయి.. ఆయనే మల్కాజిగిరి పరిధిలోని బలరాంనగర్ కాలనీకి చెందిన డీవీఎస్ సుబ్రహ్మణ్యం...

**ఆలోచన..** తిరుపతికి చెందిన పుల్లయ్యశాస్త్రి- మహాలక్ష్మీ దంపతులకు 1951లో జన్మించిన డీవీఎస్ సుబ్రహ్మణ్యం కోరమండల్ ఫర్టిలైజర్స్ సంస్థలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఇద్దరు కుమారులు లండన్‌లో స్థిరపడడంతో 2015 జనవరిలో తన కుమారుల వద్దకు వెళ్లాడు. అక్కడ తన మనుమరాలు సంక్రాంతి రోజున బంతిపూవు బొమ్మ వేసి తనకు చూపించడంతో చిన్నతనం నుంచి ఉద్యోగ, కుటుంబ బాధ్యతలతో తనలో అణచి వేసుకున్న కళాకారుడిని గుర్తు చేసుకున్నారు. అంతే మనుమరాలు వేసిన బంతిపూవుకు రంగులు దిద్దడంతో ఆరంభమైన ఆయన రెండో జీవితం నిత్యం అందరినీ ఆలోచింపజేసే చిత్రాలను గీస్తూ అబ్బురపరుస్తున్నారు.



గణనాథుడు



ఆదిభట్ల నారాయణదాసు



బొమ్మను గీస్తున్న డీవీఎస్ సుబ్రహ్మణ్యం

**ఆచరణ..** 2015 జనవరి 15 నుంచి నేటి వరకు ప్రతి రోజు అందమైన ఒక బొమ్మను వేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. అంతటితో ఆగకుండా ఆ బొమ్మకు సంబంధించి విషయాలను క్లుప్తంగా రెండు మూడు లైన్లలో రాసి సామాజిక మాధ్యమాల్లో ఉంచుతున్నారు. అలా తన బొమ్మలకు ఆకర్షితులైన లండన్, ఉగాండాలోని పలువురు ఉపాధ్యాయులు ఈ బొమ్మలను ప్రింటు తీసుకుని తమ పాఠశాలల్లో ఉదయాన్నే విద్యార్థులకు బొమ్మ విశిష్టతను తెలపడంతో పాటు ఆ బొమ్మను వేయడానికి కళాకారుడు ఏఏ రంగులు వాడారు. ఇతర విషయాలను బోధిస్తుండటం గమనార్హం.

**ఆదర్శం..** ప్రజల్ని చైతన్యం చేసే సామాజిక స్పృహ ఉన్న అంశాలపై ఆయన దృష్టి సారిస్తారు. బొమ్మలు వేయడానికి ఆయన వాటర్ పెయింట్‌తో పాటు లండన్ నుంచి తెచ్చుకున్న రంగు పెన్సిళ్లను మాత్రమే వాడతారు. ఇలా సుబ్రమణ్యం చేతి నుంచి సుమారు 2వేల చిత్రాలు రూపుదిద్దుకున్నాయి.

**ఆసక్తి: డీవీఎస్ సుబ్రహ్మణ్యం**

చిన్నతనం నుంచే బొమ్మలు వేయడం అంటే చాలా ఇష్టం. ప్రజలను జాగృత పరిచేందుకు కళలు అద్భుతమైన సాధనాలని నేను నమ్ముతాను. నేను వేస్తున్న బొమ్మలను నిత్యం సామాజిక మాధ్యమాల్లో ఉంచడం వల్ల రోజూ కనీసం ఆరు వందల మంది వాటిని చూస్తున్నారంటే నాకెంతో ఆనందంగా ఉంది. నా సహధర్మచారిని వీణి సహకారంతో భవిష్యత్తులోనూ ఓపిక ఉన్నంత వరకు బొమ్మలు వేస్తాను.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. సీఐ సందీప్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. సమతనగర్‌లో ఉంటున్న మార్కపూడి గోపీచంద్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. 23న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తల్లి లీలావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో... వినాయక్ నగర్‌లో నివాసం ఉంటున్న కందుకూరి నవీన్ టైల్స్‌వేసే పనిచేస్తుంటాడు. ఆయన 10న ఉదయం పనికి వెళుతున్నా అని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. గతంలో కూడా వెళ్లి కొన్ని రోజులకు వచ్చాడు. ఈసారి అలాగే వస్తాడు అనుకొని కుటుంబసభ్యులు భావించారు. కానీ పదిహేను రోజులు గడిచినా ఆయన జాడ లేకపోవడంతో భార్య పింకీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్తు సరఫరా మెరుగుపరచాలని వినతి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న భరత్‌నగర్ వాసులు

అల్వాల్, న్యూస్‌టుడే: భరత్‌నగర్‌లో విద్యుత్తు సరఫరాను మెరుగుపరచాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజనల్ ఇంజినీర్ సుభాష్‌ను ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. భరత్‌నగర్‌లో కొన్ని రోజులుగా తరచు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. దీంతో పాటు చాలా స్తంభాలు వంగి ప్రమాదకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. బస్తీ నేతలు లక్ష్మణ్, మల్లేశ్, రాందాస్, తిరుపతిరావు, సురేశ్ రాజేశ్, బజ్జన్న తదితరులు పాల్గొన్నారు.



## కంటి వైద్య శిబిరానికి స్పందన



గౌతంనగర్, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో గౌతంనగర్ డివిజన్ వాణీనగర్ సామాజిక భవనంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన శిబిరంలో సుమారు 150 మంది స్థానికులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మేరీమాతకు ప్రత్యేక పూజలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ రాజానగర్‌లో శనివారం మేరీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో భాగంగా క్రీస్తు గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## చెత్తకు నిప్పు.. స్థానికులకు ముప్పు



గౌతంనగర్ రైల్వేగేటు వద్ద శనివారం పారిశుధ్య సిబ్బంది చెత్తకు నిప్పు పెట్టడంతో నివాసితులు, ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు పొగతో ఇబ్బందులకు గురయ్యారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలకు నిప్పు పెట్టకుండా డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గౌతంనగర్

## కంచె తొలగించి.. ప్రమాదం పెంచి



కానాజిగూడ- హస్మత్‌పేట చెరువులోకి విస్తరించి ఉన్న నాలాలో నాలుగు నెలల క్రితం పూడిక తీశారు. ఈ క్రమంలో నాలాకు ఉన్న రక్షణ కంచెను తొలగించారు. పనులు పూర్తయిన తర్వాత కంచెను తిరిగి ఏర్పాటు చేయలేదు. రహదారిని ఆనుకొని నాలా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. –న్యూస్‌టుడే, అల్వాల్

## శునకాలకు వ్యాక్సిన్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: వరల్డ్ రేబిస్ డే పురస్కరించుకుని శనివారం మల్కాజిగిరి గాంధీపార్కులోని పశువైద్యశాలలో శునకాలకు ఉచిత వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కాలనీల నుంచి ప్రజలు శునకాలను తీసుకురావడంతో వైద్యాధికారి ప్రభురాజ్, స్థానిక అధికారిణి స్వాతి వాటికి వ్యాక్సిన్ అందజేసి జాగ్రత్తలు తెలిపారు.

## వారస్ చెస్ టోర్నీ 2న

ఈనాడు, హైదరాబాద్: వారస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న ఓపెన్ టోర్నమెంట్ జరగనుంది. ఈ టోర్నీ ప్రైజ్ మనీ రూ.లక్ష. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెలలో హైదరాబాద్‌లో జరిగే అంతర్జాతీయ రేటింగ్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు వెల్లడించారు. మరింత సమాచారం కోసం 73968 47937 నంబర్‌లో సంప్రదించాలి. లేదా వారస్‌చెస్ అకాడమీ వెబ్‌సైట్లో పేర్లు నమోదు చేసుకోవాలి.

## 'బీసీ ఉద్యమాలు తీవ్రతరం కావాలి'

నల్లకుంట, న్యూస్‌టుడే: బీసీ డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరింత ఒత్తిడి పెంచేలా ఉద్యమాలను తీవ్రతరం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తూ ఆయన్ను ఏపీ నిరుద్యోగ ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్, మహిళా నేత రూప శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

# ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

## బీసీ ఉద్యమాలు తీవ్రతరం కావాలి: ఆర్.కృష్ణయ్య


కృష్ణయ్యతో హేమంత్‌కుమార్, రూప

నల్లకుంట, న్యూస్‌టుడే: బీసీ డిమాండ్ల సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మరింత ఒత్తిడి పెంచేలా ఉద్యమాలను తీవ్రతరం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతించిన ఆయన్ను ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్ కుమార్, మహిళా నేత రూప శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బీసీ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. హేమంత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్.కృష్ణయ్య తన ఎంపీ పదవికి రాజీనామా చేయడంతో.. ఇకపై ఆయనతో కలిసి నడుస్తూ బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ రేపు


మాట్లాడుతున్న పెద్దింటి రామకృష్ణ

నల్లకుంట: యాభై ఏళ్ల ప్రస్థానంలో చేపట్టిన వివిధ పోరాటాల స్ఫూర్తిని చాటిచెప్పేలా ఈ నెల 30న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ తెలిపారు. ఉస్మానియా వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరగనున్న వేడుకను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నాటి నుంచి నేటివరకు విద్యారంగ సమస్యలతో పాటు ప్రజా ఇబ్బందులపై అనేకరకాలుగా పోరాటాలు చేస్తున్నామన్నారు. స్వర్ణోత్సవ సభకు బాంబే హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.జి. కోల్సే పాటిల్, ప్రొ.హరగోపాల్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.అనిల్, నేతలు ప్రవీణ్, రాకేష్, కావ్య, సమద్, అనిల్, పవన్ పాల్గొన్నారు.

## అత్యాధునిక వసతులతో నూతన భవనం


దాక్షాయిని, సునీతాబాయిని సన్మానిస్తున్న కాలేరు వెంకటేష్, చిత్రంలో విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: ఎంసీహెచ్ కాలనీలోని ఆరోగ్య కేంద్రం భవనాన్ని అత్యాధునిక వసతులతో తీర్చి దిద్దుతున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. రూ. 5.75 కోట్లతో నిర్మిస్తున్న సంబంధిత భవనాన్ని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి శనివారం సందర్శించాక ఆయన మాట్లాడారు. ఈ కేంద్రం అందుబాటులోకి వచ్చాక స్థానికులు అత్యుత్తమ వైద్యసేవలను పొందొచ్చన్నారు. అనంతరం వైద్యాధికారిణి దాక్షాయిని, ఈఈ సునీతాబాయ్‌ను సన్మానించారు. డీఈఈలు శివకుమార్, జగదీష్‌ప్రసాద్, ఏఈ శివకుమార్, ఏఎంవోహెచ్ హేమలత, భారాస అంబర్‌పేట అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ పాల్గొన్నారు.

## డీసీపీ అక్షాన్స్‌యాదవ్‌కు సత్కారం



ముషీరాబాద్: గణపతి నవరాత్రి ఉత్సవాలతోపాటు మిలాద్-ఉన్-నబీ తదితర వేడుకలు ప్రశాంతంగా ముగిసేలా పటిష్ఠ చర్యలు చేపట్టిన సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్స్ యాదవ్‌ను భోలక్‌పూర్‌కు చెందిన భారాస మైనార్టీ నేత అక్లక్‌హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

# ఇరుకైన వీధులు.. ఇష్టారాజ్యంగా దుకాణాలు

**భోలక్‌పూర్ పరిధిలోని ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్, తోళ్ల మండీలతో స్థానికులకు తప్పని ఇబ్బందులు**

| | |
|---|---|
| మొత్తం జనాభా | : సుమారు 70 వేలు |
| తోళ్ల మండీలు | : 50 |
| ప్లాస్టిక్ స్క్రాప్ దుకాణాలు | : 470 |
| ఐరన్ స్క్రాప్ మండీలు | : 300 |
| సెంట్రింగ్‌బాక్సుల తయారీ దుకాణాలు | : 100 |


సుప్రీం హోటల్ వీధిలో రోడ్డు పక్కన బస్తాల్లో తుక్కు సామగ్రి

ముషీరాబాద్, న్యూస్‌టుడే: భోలక్‌పూర్ డివిజన్ పరిధిలో జనావాసాల మధ్య అనధికారికంగా కొనసాగుతున్న ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్, తోళ్లు, ఐరన్ సెంట్రింగ్ మండీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందల సంఖ్యలోని స్క్రాప్ మండీలకు భారీవాహనాల రాకపోకలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అనంతరం రోడ్లపైనే లోడింగ్, అన్‌లోడింగ్ కారణంగా నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. స్థానికంగా పలు ప్రాంతాల్లో విస్తరించి మడిగెల్లోనే ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్ దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తుండడంతో గాలి, నీరు కలుషితమై రోగాలబారిన పడుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రోడ్లపైనే పనులు..** స్క్రాప్ మండీల నిర్వాహకులు చాలావరకు రోడ్లపైనే సామగ్రి నిల్వచేయడంతో పాటు శుద్ధి చేయడం వంటి పనులు చేపడుతుంటారు. భారీ రసాయన డ్రమ్ములతోపాటు పాత టీవీలు, కంప్యూటర్లు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు తదితర ఎలక్ట్రానిక్ సామగ్రిని సైతం తుక్కుగా మారుస్తుంటారు. ఆయా పనులను ఇరుకైన వీధుల్లో ప్రమాదకరంగా నిర్వహిస్తుండడంతో విద్యుత్తు, అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరోవైపు, స్క్రాప్ దుకాణాలకు ప్రతిరోజూ అర్ధరాత్రివరకు.. ఆటో ట్రాలీలు, డీసీఎంలు, లారీలు, కంటెయినర్లు, క్రేన్లు వంటి భారీ వాహనాల రాకపోకలతో కంటిపై కునుకు సైతం కరవవుతోందని అక్కడి ప్రజలు వాపోతున్నారు.


గుల్షన్‌నగర్‌లో నిలిచిపోయిన వాహనాలు

**డ్రైనేజీల్లోకి రసాయన వ్యర్థాలు**

ఇందిరానగర్, అంజుమన్ వీధి, గుల్షన్‌నగర్, పద్మశాలి కాలనీ, బీర్‌బన్‌గల్లీ, సిద్ధిక్‌నగర్, తాజీర్‌నగర్, కట్నికాంట.. తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఐరన్‌స్క్రాప్ మండీలు వందల సంఖ్యలో కొనసాగుతున్నాయి. వాటితోపాటు మండీగల్లీ, గుల్షన్‌నగర్, బంగ్లాదేశ్ మార్కెట్‌కు వెళ్లే దారిలో తోళ్లమండీలు కూడా పదుల సంఖ్యలో ఉన్నాయి. తోళ్లను నిల్వచేసేందుకు రసాయనాలను వినియోగించాక.. వ్యర్థాలను నేరుగా డ్రైనేజీల్లోకి వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రసాయనాల చేరికతో తాగునీరు కలుషితమై 2009 మే 5న భోలక్‌పూర్‌లో 14 మంది మృతిచెందగా.. వందల మంది అస్వస్థతకు గురైన విషయాన్ని నేటికీ గుర్తుచేస్తున్నారు. సంబంధిత ఘటన తర్వాత తోళ్ల మండీల సంఖ్య తగ్గిపోయినా.. ప్లాస్టిక్, ఐరన్ స్క్రాప్ గోదాముల సంఖ్య మాత్రం పెరిగింది.

**కనీస రక్షణ చర్యలూ కరవు..**

ప్లాస్టిక్, తుక్కు మండీల నుంచి వెలువడుతున్న హానికర వాసనలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నిర్వాహకులు కనీస రక్షణచర్యలు పాటించకపోవడంతో అగ్నిప్రమాదాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇటీవల గుల్షన్‌నగర్ పరిధి సాయినగర్‌లోని ఓ స్క్రాప్ గోదాంలో విద్యుదాఘాతంతో మంటలు చెలరేగి దట్టమైన పొగ ఆవరించాయి. ఓ భారీ వాహనం దేవీచౌక్ సమీపంలోని విద్యుత్తు తీగను తాకడంతో.. కరెంటు వైర్ తెగిపోయి బాలుడిపై పడడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఇప్పటికైనా స్పందించి ప్లాస్టిక్, తుక్కు మండీలను నగర శివార్లకు తరలించాలని ప్రజాప్రతినిధులు, సంబంధిత విభాగాల ఉన్నతాధికారులకు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

| | |
|---|---|
| ముషీరాబాద్ | 8008573400 |
| రాంనగర్ | 8008573395 |
| అంబర్‌పేట | 8008573390 |
| నల్లకుంట | 8008573389 |

ముషీరాబాద్, రాంనగర్, న్యూస్‌టుడే:

? అడిక్‌మెట్ డివిజన్ పరిధిలోని పద్మ కాలనీలో జీహెచ్‌ఎంసీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. -వసంత్ నాయుడు, పద్మ కాలనీ

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించాక మరమ్మతులు చేయిస్తాం. -అనూష, జీహెచ్‌ఎంసీ వీధిదీపాల నిర్వహణ ఏఈ

? రాంనగర్ చేపల మార్కెట్ వద్ద రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌తో స్థానికులు అవస్థలు పడుతున్నారు. -వెంకటేశ్వర్లు, ముషీరాబాద్

✓ సిబ్బందిని పంపించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ

## భగత్‌సింగ్ యువతకు ఆదర్శప్రాయుడు


విగ్రహం వద్ద శ్రీనివాస్‌రెడ్డి, కల్వ గోపి తదితరులు

రాంనగర్,ముషీరాబాద్: భారత దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించి 23 ఏళ్ల చిరుప్రాయంలోనే ప్రాణత్యాగం చేసిన మహనీయుడు భగత్‌సింగ్ అని.. ఆయన స్ఫూర్తితో నేటి యువత ముందుకెళ్లాలని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని శనివారం దోమలగూడ ఏవీ కళాశాల వద్ద ఉన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాక మాట్లాడారు. కార్యక్రమంలో కల్వ గోపి, సంతోష్‌గుప్తా, సిరిగిరి శ్యాం, రమేశ్, శివ, మధు, సత్యనారాయణ, రాజేశ్, వెంకటేశ్, కిషన్, సోమేశ్ పాల్గొన్నారు. ★ భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని హిందూవాహిని నగర అధికార ప్రతినిధి బబ్లూ కోరారు. భోలక్‌పూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతిలో పాల్గొన్నారు. సునీల్‌కుమార్, రాఘవేందర్, భాను, మురళి, శివ పాల్గొన్నారు.

## అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకం


పురస్కార గ్రహీతలతో చిన్నారెడ్డి, దామోదర్, భీమ్‌రెడ్డి

గాంధీనగర్, న్యూస్‌టుడే: మీడియా సంస్థల్లో వివిధస్థాయిలో పనిచేస్తున్న వారికి క్రమశిక్షణ, నిబద్ధత అవసరమని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. శనివారం రాత్రి త్యాగరాయగానసభలో సీల్‌వెల్ కార్పొరేషన్, శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమి, ఆదర్శ, ఆర్‌ఆర్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా సీల్‌వెల్-శ్రుతిలయ అక్కినేని మీడియా ఎక్సలెన్స్ అవార్డ్స్-2024 ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అక్కినేని జీవితం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం ఎంపిక చేసిన ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. తొలుత నవరస గాయని ఆమని పర్యవేక్షణలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ కోలేటి దామోదర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు భైసా దేవదాసు, రామారావు, హనుమంతరావు, వంశీ రామరాజు, భీమ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, మహ్మద్ రఫి, సుబ్రహ్మణ్యం, కుసుమ భోగరాజు, రామచంద్రరావు, దైవజ్ఞశర్మ, ఈశ్వరి నాయుడు, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

## 'మూసీ పరిధిలో కూల్చివేతలు తగవు'


ఆందోళన చేస్తున్న బాధితులు

గోల్నాక, న్యూస్‌టుడే: హైడ్రా పేరిట మూసీ నది పరివాహక ప్రాంతంలోని ఇళ్ల కూల్చివేతలు అన్యాయమని.. తాము బాధితులకు అండగా ఉంటామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రకటించారు. పేదల నివాసాలను కూల్చివేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. శనివారం ఆందోళనలే చేపట్టిన న్యూతులసీరామ్‌నగర్ లంక బాధితులకు సంఘీభావాన్ని ప్రకటించిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలు, మధ్య తరగతి వారు కష్టపడి నిర్మించుకున్న ఇళ్లపై ప్రతాపం చూపడం ప్రభుత్వానికి తగదన్నారు. సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. భూకబ్జాదారులు, ల్యాండ్ మాఫియా, పైరవీకారులకు అండగా ఉంటూ.. పేదలకు నిలువనీడ లేకుండా చేస్తున్నారంటూ మండిపడ్డారు. నేతలు గెల్వన్న, నర్సింగ్‌యాదవ్, యూసుఫ్ షరీఫ్, భరత్‌రాజ్, రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### హైకోర్టు స్పందించాలి


ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేట: పేదల ఇళ్లను బుల్‌డోజర్లతో కూల్చివేస్తుండడం అన్యాయమని భారాస అంబర్‌పేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఛేనంబర్ చౌరస్తాలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ఘటనలను ప్రజా ప్రయోజన వాజ్యం కింద సుమోటోగా స్వీకరించి హైకోర్టు విచారణ జరపాలని కోరారు.

## 'సుందరీకరణ ప్రాజెక్టు'కు స్వచ్ఛందంగా స్థలం


సంజీవచారి

గోల్నాక: మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టు కోసం తమ సంఘానికి చెందిన స్థలాన్ని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అందజేస్తామని అంబర్‌పేట నియోజకవర్గం విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు సంజీవచారి ప్రకటించారు. శనివారం గోల్నాకలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... కమలానగర్‌లోని సర్వే నంబర్ 69లోని 27 గుంటల తమ సంఘం స్థలాన్ని ఇచ్చి ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. అందుకుబదులుగా ప్రత్యామ్నాయ స్థలాన్ని తమకు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

### బాధితులకు పునరావాసం కల్పించాలని విజ్ఞప్తి


చేగూరి రఘు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: మూసీ నది పరిధిలో ఇళ్లను కోల్పోతున్న పేదలకు పునరావాసంతో పాటు ఉపాధిని కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ సీనియర్ నేత చేగూరి రఘు విజ్ఞప్తి చేశారు. శనివారం అంబర్‌పేటలో ఆయన మాట్లాడారు. జలవనరులను పరిరక్షించాలనే నిర్ణయం భావితరాలకు మేలుచేస్తుందన్నారు. అయితే, మూసీ పరీవాహకంలో నిరాశ్రయులయ్యే పేదప్రజలకు న్యాయం చేయాలని కోరారు. వారికి పునరావాసం కల్పించాకనే కూల్చివేతలను ప్రారంభించాలని పేర్కొన్నారు.

## 'జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా చేపట్టాలి'



మాట్లాడుతున్న జీఆర్ శంకర్

బాగ్‌లింగంపల్లి: రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన ప్రక్రియను భారాస సర్కార్ హయాంలో అసంబద్ధంగా చేపట్టారని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) జాతీయ కార్యదర్శి జీఆర్ శివశంకర్ ఆరోపించారు. ఫలితంగా ఒక్కో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గం ప్రస్తుతం రెండు, మూడు జిల్లాల పరిధిలో కొనసాగుతోందన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం దృష్టిసారించి.. జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో.. ఏఐఎఫ్‌బీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విధంగా జిల్లాల పునర్విభజనను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానాలనూ నెరవేర్చాలన్నారు. ఇతర పార్టీల ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని సూచించారు. అనంతరం ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఛైర్మన్‌గా జావెద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండా సురేందర్‌రెడ్డి అధ్యక్షత వహించిన సమావేశంలో సీనియర్ నేతలు బుచ్చిరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి: డీఈవో


విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న రోహిణి తదితరులు

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా కృషి చేయాలని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) ఆర్. రోహిణి సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో.. మూడు రోజులుగా జరుగుతున్న ముషీరాబాద్ విద్యామండల స్థాయి ఖో ఖో, కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. 14, 17 ఏళ్ల బాలబాలికల విభాగంలో సంబంధిత పోటీలను నిర్వహించారు. శనివారం జరిగిన ఫైనల్స్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరైన రోహిణి.. విజేతలకు మెమొంటోలు, ధ్రువపత్రాలను అందజేసి మాట్లాడారు. సర్కార్ బడుల్లోని విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తి పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. ఓయూ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. కార్పొరేటర్ సుప్రియ, మోడల్ స్కూల్ ప్రత్యేకాధికారి శంకర్, డిప్యూటీ ఈవో చిరంజీవి, డిప్యూటీ ఐవోఎస్ జయలక్ష్మీభారతి, స్కూల్ హెచ్‌ఎం జ్యోతిశ్రీ, ఎస్‌జీఎఫ్ ముషీరాబాద్ మండల కార్యదర్శి శ్రీలత, ఫిజికల్ డెరెక్టర్లు శ్రీనివాసమూర్తి, కిషోర్, సలావుద్దీన్, విమల పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలం

గాంధీనగర్, న్యూస్‌టుడే: క్రమంతప్పని వ్యాయామం ద్వారా గుండె సంబంధిత వ్యాధులు దరిచేరవని ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి ఎం.మనోజ్‌రెడ్డి పేర్కొన్నారు. 'వరల్డ్ హార్ట్ డే'ను పురస్కరించుకొని శనివారం ముషీరాబాద్ ఆరోగ్యకేంద్రంలో.. నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మానవ శరీరంలో గుండె ప్రధానమైందన్నారు. హృదయం ఆరోగ్యంగా ఉండేలా.. ఒత్తిడి తగ్గించుకోవడం, నిత్యం వ్యాయామంతోపాటు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌ఎన్ ఫెల్లీస్, ఏఎన్‌ఎంలు విజయకుమారి, సునీత, పద్మలత, సంతోషి, మలేరియా విభాగం సూపర్‌వైజర్ పి.యాదగిరిరాజు పాల్గొన్నారు.

### మాజీ సర్పంచులకు పింఛన్ ఇవ్వాలని మంత్రికి వినతి



రాంనగర్: మాజీ సర్పంచులతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లకు పింఛన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, కౌన్సిలర్స్ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మేడి శంకర్ కోరారు. శనివారం సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

## న్యాయవాదుల సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న వివేకానంద

బాగ్‌లింగంపల్లి: బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదులు సమాజహితమే లక్ష్యంగా చేపట్టిన సేవా కార్యక్రమాలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. వివిధకేసుల్లో బాధితులకు ఉచితంగా న్యాయసేవలూ అందించి.. న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చారని కొనియాడారు. శనివారం రాత్రి సుందరయ్య కళానిలయంలో బ్రాహ్మిణ్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. ఇటీవల మృతిచెందిన కేవీ సత్యనారాయణ, వి. పరబ్రహ్మశాస్త్రి, పి.యాదగిరిరావు, టీఎస్ ఆనంద్‌ల సంస్మరణ సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించాక ఏపీ మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్(జీపీ) వివేకానంద, సీనియర్ న్యాయవాదులు ఎల్.రవిచందర్, అంబడిపూడి సత్యనారాయణ, గిరిధర్‌రావు, చెల్లా ధనుంజయ్, సీబీఐ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎస్‌పీ సురేష్‌కుమార్, ప్రభుత్వ న్యాయవాది మహేశ్‌రాజే, బార్ కౌన్సిల్ సభ్యుడు మధుసూదన్‌రావులు మాట్లాడారు.

## మహిళలకు స్వయం ఉపాధే లక్ష్యం


గోడపత్రిక విడుదల చేస్తున్న జయజైన్, గీతాషా తదితరులు

కాచిగూడ: మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని గీతా గృహ ఉద్యోగ్ మహిళా సహకార సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు గీతాషా తెలిపారు. ఈ నెల 30న కాచిగూడలో నిర్వహించనున్న పోచంపల్లి చేనేత కార్మికుల వస్త్ర ప్రదర్శన గోడపత్రికను శనివారం జయజైన్, డా.లేఖామాథుర్, తోరల్‌జైన్, దీప్తిషా తదితరులతో కలిసి విడుదల చేశాక ఆమె మాట్లాడారు.

## లారీ కుంగడంతో.. రోడ్డు మధ్యలో భారీ గొయ్యి



గొయ్యిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మ తదితరులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్ అంబర్‌పేట డివిజన్ శివం రోడ్డులోని ఆజాం కాంప్లెక్స్ ఎదుట ఉన్న ప్రధాన రహదారిపై.. కంకర పొడిని తరలిస్తున్న లారీ ఒక్కసారిగా కుంగిపోయింది. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక అయ్యప్ప దేవాలయం ముందు నుంచి శారదానగర్ మీదుగా శివం రోడ్డుకు చేరుకునే మూలమలుపు వద్ద సంబంధిత లారీ కుంగిపోవడంతో.. రోడ్డుపై సుమారు 5 అడుగుల మేరకు గొయ్యి ఏర్పడింది. ఈ క్రమంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానిక కార్పొరేటర్ బి.పద్మ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని.. జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం భారీ గొయ్యి నుంచి లారీను జేసీబీ సాయంతో బయటికి తీశారు. ఆ ప్రాంతంలో వరదనీటికి సంబంధించిన పెద్ద పైపులైన్లు ఉన్నాయని.. ఇటీవలి భారీవర్షాల కారణంగానే రోడ్డు మధ్యలో లారీ కుంగిపోయి ఉండొచ్చని బల్దియా డీఈ ప్రశాంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గుగులోత్ రవినాయక్, జలమండలి డిప్యూటీ డీజీఎం విష్ణువర్ధన్‌రావులు చెప్పారు. రాత్రి కల్లా సంబంధిత గొయ్యిని యుద్ధప్రాతిపదిక పూడ్చి వేయించారు.

## బోనాల పండగ చెక్కు అందజేసిన వీహెచ్



విద్యానగం: అంబర్‌పేట దేవస్థానం సేవా సమితి ఆధ్వర్యంలోని అంబర్‌పేట మహంకాళి ఆలయంలో.. ఈ ఏడాది నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్కును సమితి ప్రతినిధులకు ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు అందచేశారు. శనివారం అంబర్‌పేటలోని నివాసంలో వీహెచ్ నుంచి సంబంధిత చెక్కును కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, జానేశ్వర్‌గౌడ్, శంకర్‌గౌడ్‌లు అందుకున్నారు. ప్రతినిధులు మల్లికార్జున్‌గౌడ్, చెంగలి సుధాకర్, గడ్డం శ్రీధర్‌గౌడ్, రావుల సుధాకర్, అనిల్, లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని పరిరక్షించుకుందాం



నినాదాలు చేస్తున్న లక్ష్మణ్‌రావు, రజనీ తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: భారతీయ సనాత హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం కాచిగూడలోని కార్యాలయంలో.. దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించే దాండియా, గార్బా తదితర నృత్య కార్యక్రమాల నిర్వహణపై చర్చించాక ఆయన మాట్లాడారు. నేటి యువతకు మన పండగల విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు రజని, ప్రతినిధులు రూబీ మిశ్రా, సంజయ్‌కుమార్, కాజల్, సబిత, రామేశ్వర్‌మిశ్రా, రవీందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ మూత



విద్యానగర్-ఆర్టీసీ క్రాస్‌రోడ్ ప్రధాన మార్గంలోని ఉక్కు వంతెన పిల్లర్ నంబర్-55 ఎదుట ఉన్న మ్యాన్‌హోల్ మూత పగిలిపోయింది. నిత్యం ఇటుగా వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూత కారణంగా రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం మరమ్మతులు చేపట్టాలని జలమండలి అధికారులను స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, రాంనగర్

## గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య

రాంనగర్: గొంతు కోసి ఓ వ్యక్తిని దారుణంగా హత్యచేసిన సంఘటన దోమలగూడ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. శనివారం రాత్రి 11 గంటల సమయంలో.. లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల వెనక ఉన్న మారుతీనగర్ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి(40) రక్తపుమడుగులో పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వారి నుంచి సమాచారం అందుకున్న చిక్కడపల్లి ఏసీపీ మొగులయ్య, సీఐ శ్రీనివాస్‌రెడ్డిలు.. సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

### ప్రయాణికురాలి నల్లపూసల గొలుసు చోరీ

కాచిగూడ: మహిళ నల్లపూసల గొలుసు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దేవేంద్రకుమార్ భార్య భారతి శుక్రవారం మార్కాపురం నుంచి కాచిగూడకు గుంటూరు ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. రైలు మహబూబ్‌నగర్ వద్ద ఉండగా 6 గ్రాముల నల్లపూసల గొలుసు, సెల్‌ఫోన్ ఉన్న బ్యాగు చోరీకి గురైనట్లు శనివారం బాధితురాలి ఫిర్యాదు చేశారు.

## చెట్లకొమ్మల వ్యర్థాల తరలింపు

నల్లకుంట: న్యూనల్లకుంటలోని నరేంద్రపార్కు వద్ద పేరుకుపోయిన చెట్లకొమ్మల వ్యర్థాల సమస్యను అధికారులు పరిష్కరించారు. వ్యర్థాల కారణంగా స్థానికుల ఇబ్బందులపై 'నరికేసినా.. తరలింపులో నిర్లక్ష్యమే' శీర్షికతో 'ఈనాడు'లో ఈ నెల 28న ప్రచురితమైన కథనానికి బల్దియా అధికారులు స్పందించారు. శనివారం ఉదయం సిబ్బంది అక్కడికి చేరుకుని.. కొమ్మలు తొలగించారు.

### 'చలో ట్యాంక్‌బండ్' విజయవంతానికి పిలుపు

నల్లకుంట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 29న చేపట్టిన 'చలో ట్యాంక్‌బండ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట యాక్షన్ కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అనిల్‌కుమార్ కోరారు. శనివారం ఆయన తిలక్‌నగర్‌లో మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహం వద్ద జరగనున్న కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

## సంక్షిప్త సమాచారం

### ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి

నల్లకుంట: ప్రజాసమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని నల్లకుంట కార్పొరేటర్ అమృత చెప్పారు. గోల్నాక మార్కెట్ రోడ్డులో మూడు రోజులుగా డ్రైనేజీ సమస్య వేధిస్తుండడంతో..జలమండలి అధికారులను పిలిచి మాట్లాడామన్నారు. అనంతరం చేపట్టిన పనులు జరుగుతున్న తీరును శనివారం జలమండలి శివం సెక్షన్ మేనేజరు రోహిత్‌తో కలిసి ఆమె పరిశీలించారు.

### పైపులైన్ పనుల్లో వేగం పెంచండి

గాంధీనగర్: గాంధీనగర్ డివిజన్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ పైపులైన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ పావని కోరారు. పనులను శనివారం జలమండలి డీజీఎం కార్తిక్‌రెడ్డితో కలిసి పరిశీలించాక ఆమె మాట్లాడారు. పండగలు సమీపిస్తుండడంతో పనుల్లో వేగం పెంచాలని కోరారు. నాయకులు వినయ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### భాజపా ఆధ్వర్యంలో 'స్వచ్ఛభారత్'

బర్కత్‌పుర: వ్యాధులు విజృంభించకుండా పరిసరాల శుభ్రతకు ప్రజలు ప్రాధాన్యమివ్వాలని భాజపా నేతలు పిలుపునిచ్చారు. ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరిసరాల్లో 'స్వచ్ఛతాహీ సేవా'లో భాగంగా 'స్వచ్ఛ భారత్'ను చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న రహదారులను శుభ్రం చేశారు. మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కాచిగూడ కార్పొరేటర్ కె.ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

### గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (శనివారం నాటివి.. కిలోకు రూపాయల్లో) టమాట-40, ఆలుగడ్డ-40, వంకాయ-45, బెండ-55, దొండ-40, దోసకాయ-35, కాకర-50, బీర-50, సొర-25, క్యాబేజి-45, బీన్స్-70, చిక్కుడు-60, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-40, వెల్లుల్లి-300, అల్లం-80.

# ఉప్పల్
• ఉప్పల్ • మేడ్చల్

## అనుసంధాన రోడ్ల అభివృద్ధి అవసరం


ధర్నాలో పాల్గొన్న మహాలక్ష్మీనగర్ సంఘం నేతలు

కాప్రా, న్యూస్‌టుడే: చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు ఉత్తరం వైపు రెండు కాలనీల్లో ఉన్న అన్ని రోడ్లను విస్తరించి అందుబాటులోకి తీసుకురావాలని మహాలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం చర్లపల్లి డివిజన్‌లోని మహాలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానికులు రైల్వే టెర్మినల్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, శ్రీమన్నారాయణలు మాట్లాడుతూ మహాలక్ష్మీనగర్, మింట్‌కాలనీలోని నాలుగు ప్రధాన రహదారులు రైల్వే టెర్మినల్ ఉత్తరం వైపు రాకపోకలకు అనుసంధాన రోడ్లుగా ప్రభుత్వం అభివృద్ధి పరచాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మీనగర్ మధ్యలో ఉన్న 30 అడుగుల రోడ్డును 80 అడుగుల మేర విస్తరించడంతో తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుబాటులో ఉన్న నాలుగు రోడ్లను 50 అడుగుల మేర విస్తరించాలన్నారు. హెచ్‌పీసీఎల్ కంపెనీకి చెందిన స్థలం గుండా 100 అడుగుల రోడ్డును ఎన్‌ఎఫ్‌సీ కూడలి వరకు విస్తరిస్తే ప్రయోజనకరం, వాహనాల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు.

## స్వాగత వేడుక

మేడ్చల్: మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే 2024 వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల ఆటాపాటలు, నృత్యాలు, ర్యాంప్‌వాక్‌లతో అలరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టీవీరెడ్డి, ప్రిన్సిపల్ కె.శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి పాల్గొన్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్, న్యూస్‌టుడే: ఉప్పల్‌లోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం శిల్పారామంలో నాట్య గురువు సంధ్యారాకేశ్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. ఈ సందర్భంగా మూషిక వాహన, శ్యామలే మీనాక్షీ, జతుస్వరం, తదితర అంశాలపై కళాకారులు మానస, స్నిగ్ధ, హరిణి, అశ్మిత, హృతిక, కృతి, చరిత, లాస్య, కనిష్క, యుక్తిక, ఐశ్వర్య, హంసిని, తీర్థ చక్కటి నృత్యాలను ప్రదర్శించారు.

## ఇష్టంగా సాగు.. ఆరోగ్యం బాగు
### నచ్చిన కూరగాయల ఎంపిక

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే ఇంట్లోనే కూరగాయలు పండించుకోవడమంటే.. .ఆరోగ్యం ఒక్కటే కాదు..నచ్చిన వాటిని ప్రేమగా వండుకొని తినొచ్చు.. మానసిక ఒత్తిడి నుంచి దూరం కావొచ్చు.. నలుగురికి ఆదర్శంగా నిలవొచ్చు. ఒకప్పటిలా సరదాగా కాకుండా మిద్దె తోటలను ఇష్టంగా పెంచుకోవడంతో ఎన్నో లాభాలున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.

**పెరుగుతున్న ధరలు**

కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాలన్నా కష్టంగానే ఉంటోంది. ధరలు రోజురోజుగా పెరిగిపోతున్నాయి. సంతలకు వెళ్తే నాణ్యత పెద్దగా ఉండటం లేదు. టామాటా వారంలోనే కిలో రూ.50కి పైగా పెరిగిపోయింది. ఇతర కూరగాయల ధర కూడా రూ.50-70 మధ్య ఉన్నాయి.

**ఎంతో మంచిది:** రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా సొంతంగా కూరగాయలు పండిస్తే ఆరోగ్య సమస్యలు దూరం అవుతాయి. కాస్తంత మట్టితో భవనంపై ఆకుకూరలు, కూరగాయలు పండించవచ్చు. నగర పరిసరాల్లో చాలా మంది ఈ విధానాన్ని అమలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. కుటుంబ సభ్యులకు ఆటవిడుపుగా కూడా ఉంటోంది.

**కూతురు పుట్టిన రోజు కానుక..**



–సందుపట్ల నవజీవన్‌రెడ్డి, ఘట్‌కేసర్

నా కూతురు ఆద్య పుట్టిన రోజు వేడుకలను జరపకుండా ఆ డబ్బుతో మిద్దెతోట ఏర్పాటు చేశా. తాజా కూరగాయలు, ఆకుకూరలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తోంది. ఉదయం గంట పాటు శ్రమించడంతో శారీరక వ్యాయామం లభిస్తోంది. చాలా మంది మా ఇంటికి వచ్చి సాగు చేస్తున్న తీరును తెలుసుకుంటున్నారు.

**తగ్గుతున్న ఖర్చు**


ఘట్‌కేసర్‌లో మిద్దెపై సాగు చేస్తున్న కూరగాయలు, ఆకుకూరలు



**సేంద్రియ పద్ధతిలో..**

సేంద్రియ ఎరువులతో అంకుషాపూర్ గ్రామంలో పిట్టల కృష్ణవేణి, శ్రీశైలం దంపతులు ఏళ్లుగా కూరగాయలు పెంచుతున్నారు. టబ్బుల్లోనే బీర, కాకరకాయ, టమాట, వంకాయ, బెండకాయ పండిస్తున్నారు.



**దోమలను నివారించేలా..** లేమన్ గ్రాస్ బంతి, తులసి, పుదీనా, పెంచుతున్నారు.

**ఇలా మీరు చేయొచ్చు..**

ఘట్‌కేసర్ పట్టణంలోని సందుపట్ల నవజీవన్‌రెడ్డి తన ఇంటిపై ఐదేళ్ల క్రితం రూ.లక్షన్నర ఖర్చు చేసి 1000 చదరపు గజాల స్థలంలో మిద్దె తోటలను ఏర్పాటు చేశారు. పలు రకాల కూరగాయలను, ఆకుకూరలు, తీగజాతి, పండ్ల పెంపకం చేస్తున్నారు. టమాటా, వంకాయ, బెండ, గోంగూర, పాలకూర, కొత్తిమీర, క్యాబేజి, మెంతికూర, కాలిఫ్లవర్, బీర, కాకర, మునగ, బొప్పాయి. జామ, మామిడి, దోసతో పాటు పలు రకాల పూలమొక్కలను సాగుచేస్తున్నారు.

## బాధితులకు అండగా ఉంటా.. ఈటల


బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ

మేడ్చల్, న్యూస్‌టుడే: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి ఓట్లు వేసిన ఖర్మానికి ప్రజల ఉసురు పోసుకుంటున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి నారాయణ చెరువు ఎఫ్‌టీఎల్‌లోని బాధితులకు అండగా నిలిచేందుకు శనివారం ఎంపీ వారిని కలిసి మాట్లాడారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో గుంట భూమి కూడా వ్యవసాయం లేదని, 100 గజాల చొప్పున కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నామని బాధితులు తెలిపారు. శని, ఆది వారాలు వస్తే పనులు మానేసి ఇంటివద్దే ఉండాల్సిన పరిస్థితి ఉందని ఎంపీ అన్నారు.

## రూ.6.50 కోట్లతో పనులు


మాట్లాడుతున్న ఛైర్మన్ చంద్రారెడ్డి

నాగారం, న్యూస్‌టుడే: పట్టణ అభివృద్ధి పనులకు శనివారం పుర ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 20 వార్డుల్లో రూ.6.50 కోట్లతో అభివృద్ధి పనులకు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇందులో సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాలువల నిర్మాణం చేపడతారు. ఈసమావేశంలో వైస్ ఛైర్మన్ బండారు మల్లేష్ యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, డీఈఈ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, కో- ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## మూసీ నిర్వాసితులకు బాసటగా..


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ, న్యూస్‌టుడే: మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇళ్లను కూల్చొద్దని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి కోరారు. బాధితులతో మాట్లాడి నష్టపరిహారం చెల్లించాకే కూల్చివేతలపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం కేసీఆర్ నగర్‌లో మూసీ నిర్వాసితులతో మాట్లాడారు. మూసీ నిర్వాసితులకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో రామంతాపూర్ కార్పొరేటర్ శ్రీవాణి, సత్యసాయి విద్యాసంస్థల ఛైర్మన్ గడ్డం సాయికిరణ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు శాస్త్రీయ పరిశోధనలపై మక్కువ


అవగాహన కల్పిస్తున్న పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్

నాచారం, న్యూస్‌టుడే: కాప్రా సాకేత్ టౌన్‌షిప్‌లోని పాస్టర్ బిల్లాబాంగ్ స్కూల్‌లో శనివారం అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సునీతారాణి, ప్రిన్సిపల్ జ్యోతి అపర్ణ...అంతరిక్షంలో ఉపగ్రహాలు పనిచేయు విధానం, ప్రయోజనాలు, చంద్రయాన్, ఖగోళశాస్త్ర పరిశోధనలపై విద్యార్థులకు నమూనాల తో వివరించారు.

## వయోవృద్ధులకు గుర్తింపు కార్డులు

నాచారం, న్యూస్‌టుడే: నాచారంలోని శ్రీవేంకటేశ్వర భక్త సమాజంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం వయోవృద్ధులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ ప్రాజెక్టు అధికారి దామోదర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ జారీ చేసిన గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయిబాబా పాల్గొన్నారు.

నాగారం: అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దమ్మాయిగూడ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా జిల్లా సంక్షేమ అధికారి ఎం. కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఇందులో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, బానయ్యలు తమ సమస్యలపై మాట్లాడారు.

ఉప్పల్:ఉప్పల్ సౌత్ స్వరూప్‌నగర్‌లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఎంఏ రహీం, ఉపాధ్యక్షులు ఎం.క్రిష్ణయ్య, పి.సురేందర్, సంయుక్త కార్యదర్శులు కె.నర్సయ్య, బి.విశ్వనాథరావు, కోశాధికారి జె.సదానందం ఎన్నికయ్యారు.

## తప్పుడు నంబర్‌తో తిరుగుతున్న లారీ స్వాధీనం

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ఇతరుల రిజిస్ట్రేషన్ నంబర్‌తో తిరుగుతున్న లారీని రవాణాశాఖ అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం..శనివారం వరంగల్ జాతీయ రహదారి యంనంపేట కూడలిలో రవాణా శాఖ స్పెషల్ విజిలెన్స్ బృందం వాహనాలను తనిఖీ చేస్తున్నారు. టీఎస్7యుఎన్0963 నంబరు లారీని ఆపారు. పత్రాలు పరిశీలించగా అసలు నంబరు టీజీ30టీ2345గా తేలింది. మరో వాహన నంబరును లారీకి అమర్చి ప్రభుత్వాన్ని మోసం చేసి ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. లారీ యజమాని సుర్వి నరేష్, డ్రైవర్ యు.గౌతమ్‌లను అరెస్టు చేసి లారీని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

## తరగతి గదులకు రంగులు


కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు

కాప్రా, న్యూస్‌టుడే: హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల పరివర్తన కార్యక్రమంలో టాటా కమ్యునికేషన్స్ లిమిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు. పాఠశాలలోని పలు తరగతి గదులకు రంగులు వేయడంతో అందంగా కనిపిస్తున్నాయి.

## బతుకమ్మ పాట.. దాండియా ఆట


బతుకమ్మలతో విద్యార్థినులు

హబ్సిగూడ, న్యూస్‌టుడే: రామంతాపూర్‌లోని మెగా మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం బతుకమ్మ ఉత్సవాన్ని నిర్వహించారు. బతుకమ్మలను పేర్చి ఆడుతూ.. పాడుతూ.. సందడి చేశారు. తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటుచేసి విద్యార్థినులు తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపల్ సునీతా విద్యార్థినులను అభినందించారు.

## రూ.48.57 లక్షలతో పలు పనులు


మాట్లాడుతున్న ఛైర్మన్

నాగారం, న్యూస్‌టుడే: దమ్మాయిగూడ పట్టణ అభివృద్ధి పనులకు శనివారం ఛైర్మన్ వసుపతి ప్రణీత అధ్యక్షతన రూ.48.57 లక్షల పనులకు కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కమిషనర్ నాగమణి, డీఈఈ చిరంజీవి పాల్గొన్నారు.

## అవగాహన ప్రదర్శన

ఉప్పల్, న్యూస్‌టుడే: ప్రపంచ 'హార్ట్ డే- రేబీస్ డే'ను పురస్కరించుకొని ఉప్పల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. శనివారం ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ప్రధాన రహదారి వరకు ప్రదర్శన జరిగింది. ఇందులో డా.మల్లేశ్వరి, కౌశిక్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో సంఘాల నాయకులు

జవహర్‌నగర్, న్యూస్‌టుడే: తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుని అండగా నిలవాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఉద్యమకారులు, కళాకారులను గుర్తించి తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు సింగరయ్యగౌడ్, చంద్రమౌళి, ఎస్కే మీరా, శివబాబు, మబ్బుబాలు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ఉప్పల్-ఏ శాఖ కార్యదర్శిగా అశోక్‌రెడ్డి

ఉప్పల్, న్యూస్‌టుడే:సీపీఎం ఉప్పల్-ఏ శాఖ కార్యదర్శిగా మేకల అశోక్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన పార్టీ మహాసభలో అశోక్‌రెడ్డి ఎన్నిక జరిగినట్టుగా పార్టీ ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జె.వెంకన్న తెలిపారు.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా..?


పీర్జాదిగూడ బండి గార్డెన్ రోడ్డు దుస్థితి.

బోడుప్పల్,న్యూస్‌టుడే : పీర్జాదిగూడ బండి గార్డెన్ రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. అడుగడుగునా గోతులతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా మరమ్మతులు కూడా చేయించడం లేదు.

## ఆర్టీసీ కార్మికులకు పురస్కారం


అధికారులతో సిబ్బంది

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ ఆర్టీసీ డిపోలో శనివారం ప్రగతి చక్రం పురస్కారాలు కార్మికులకు ఇచ్చారు. ఆగస్టు నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు, బ్రేక్‌డౌన్ లేకుండా బస్సులను మెయింటనెన్స్ చేసిన మెకానిక్‌లు, శ్రామికులను కూకట్‌పల్లి డివిజన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ కవిత శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలు ఇచ్చారు. ఇందులో డిపోమేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాగారం),

న్యూస్‌టుడే: మేడ్చల్, నాచారం, జవహర్‌నగర్, నాగారం

? మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి వీకర్‌సెక్షన్ కాలనీలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు తీసి అక్కడే వదిలేశారు. దుర్వాసన వస్తోంది. – శ్రీనివాస్, మేడ్చల్

✓ తొందరలోనే సమస్యను పరిష్కరిస్తాం. **నాగిరెడ్డి, కమిషనర్ మేడ్చల్ మున్సిపాలిటీ.**

? గత నాలుగు నెలలుగా ఫైరింగ్‌రేంజ్ ఆనంద్‌నగర్ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు అంధకారంతో ఇబ్బంది పడుతున్నాం. – **బాలాజీ, ఆనంద్‌నగర్‌కాలనీ**

✓ సిబ్బందిని పంపించి వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కమిషనర్ జవహర్‌నగర్**

? కార్తికేయనగర్‌లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించి రోడ్డు పైనే వేశారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించడం కష్టంగా ఉంది.–**సుభాషిణి, నాచారం**

✓ సిబ్బందిని పంపించి చెట్టు కొమ్మలు తొలగిస్తాం. –**నాగరాజు–విద్యుత్తు ఏఈ, నాచారం**

? సిద్ధార్థనగర్ బస్‌స్టాప్, భవానీ ఫంక్షన్ హాల్ వద్ద ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు పడ్డాయి. – **సురేష్ , సిద్ధార్థనగర్ కాలనీ,**

✓ రెండు రోజుల్లో గుంతలు పూడ్చి వేయిస్తాం. – **చిరంజీవులు, డీఈఈ**

## రూ.2 కోట్లతో రోడ్లు బాగు


పనులు ప్రారంభిస్తున్న మేయర్

బోడుప్పల్, న్యూస్‌టుడే : ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని బోడుప్పల్ నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. శనివారం 1, 3, 4, 6, డివిజన్లలో రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్లకు డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి, కమిషనర్ రామలింగం, కార్పొరేటర్లతో కలిసి పనులు ప్రారంభించారు. ప్రధానంగా రోడ్లు, తాగునీరు సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

## సంక్షిప్త సమాచారం

### కరపత్రిక విడుదల

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ వెంకట్‌రెడ్డినగర్‌లోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరగనున్న దసరా ఉత్సవాల కరపత్రికను ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపకులు గంజి రాజమౌళిగుప్తా శనివారం విడుదల చేశారు. ● రామంతాపూర్‌లోని శ్రీమహాంకాళీ ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరపనున్నట్లు ఆలయ ఛైర్మన్ భీష్మగౌడ్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.

### రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నాగారం: ఏడో వార్డులో శనివారం కౌన్సిలర్ సబిత రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు.

### యుగ పురుషుడు ఎన్టీఆర్

బోడుప్పల్: తెదేపా వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ యుగ పురుషుడని పీర్జాదిగూడ తెదేపా నగరాధ్యక్షుడు కె.నర్సింహా పేర్కొన్నారు. శనివారం పీర్జాదిగూడలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళి అర్పించారు.

### పోక్సో కేసులో నిందితుడి రిమాండ్

కాప్రా: బాలికను లైంగికంగా వేధిస్తున్న యువకుడిని చర్లపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడిని శనివారం కోర్టులో హాజరుపరిచారు.

### అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో విజయపురిలో నివాసం ఉంటున్న వినయ్ (40)చనిపోయాడు. అతనితో గొడవపడిన భార్య నాలుగు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. గది నుంచి దుర్వాసన వస్తుండటంతో పక్కింటి వారు వెళ్లి చూడగా అతను మృతిచెంది ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## నాణ్యమైన భోజనం ఇవ్వాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్

పోచారం(ఘట్‌కేసర్)న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ఆహార పదార్థాలను తయారు చేసేవారు వ్యక్తిగత శుభ్రత పాటించాలని పోచారం మున్సిపల్ ఛైర్మన్ కొండల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రతాప్‌సింగారంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు తెలిపారు.

## భగత్‌సింగ్‌కు నివాళి

న్యూస్‌టుడే, బృందం: భగత్‌సింగ్ జయంతిని ఉప్పల్, మేడ్చల్ నియోజకవర్గాలలోని పలు ప్రాంతాల్లో వామపక్షాలు, సంస్థలు శనివారం నిర్వహించాయి.


తెలంగాణ ప్రజా సాంస్కృతిక గ్రూప్ ఆధ్వర్యంలో


సీపీఐ నేతృత్వంలో..


మేడ్చల్‌లో..


జవహర్‌నగర్‌లో..


బోడుప్పల్‌లో..





## ఎన్‌డీపీఎల్ మద్యంపై ఆబ్కారీ నజర్

ఈనాడు, హైదరాబాద్

విదేశీ, డిఫెన్స్ పేరుతో కల్తీ మద్యం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) విక్రయాలు నగరంలో యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రముఖ బ్రాండ్లు, ఖరీదైన మద్యం సీసాలు సేకరిస్తున్న కొందరు.. వాటిలో తక్కువ ధర ఉండే బ్రాండ్ల మద్యం నింపేసి అమ్ముతున్నారు. రాజస్థాన్, చండీగఢ్, గోవా, దిల్లీ, హరియాణా రాష్ట్రాల నుంచి సైతం నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్(ఎన్‌డీపీఎల్) భారీగా వస్తోంది. నగర పరిధిలోనే ఎన్‌డీపీఎల్, కల్తీ మద్యం ఎక్కువగా అత్యధికంగా పట్టుబడుతోంది. ఈ ఏడాది ఆబ్కారీ శాఖ అధికారులు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో కలిపి 55 కేసుల్లో 1058 లీటర్ల కల్తీ, ఎన్‌డీపీఎల్ మద్యం స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బీదర్‌లో కొన్ని ముఠాలు డిఫెన్స్ పేరుతో నకిలీ మద్యం తయారుచేసి నగరానికి సరఫరా చేస్తున్నాయి. దసరా పండుగ, వరుస సెలవులతో నకిలీ, ఎన్‌డీపీఎల్ రవాణాపై అధికారులు దృష్టి సారించారు.

| జిల్లా | కేసులు | నిందితులు | మద్యం (లీ.) |
|---|---|---|---|
| హైదరాబాద్ | 32 | 13 | 452 |
| రంగారెడ్డి | 23 | 43 | 606 |

**నిఘా పెంచాం**

–వీబీ కమలాసన్‌రెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

రాష్ట్రంలోకి ఎన్‌డీపీఎల్ రాకుండా నిఘా పెంచాం. దసరా సందర్భంగా దృష్టి పెట్టాం. ఆబ్కారీ శాఖ టోల్ ఫ్రీ నంబరు 18004252523 లో సమాచారమివ్వాలి.

## వృద్ధురాలి నగల చోరీ కేసు ఛేదన

శామీర్‌పేట, న్యూస్‌టుడే: పిల్లలతో పొట్ట చేతపట్టుకుని వచ్చిన ఓ కుటుంబానికి నీడ చూపిన వృద్ధురాలి నగలపై ఆశపడి అంతమొందించేందుకు పథకం పన్ని బంగారు, వెండిని అపహరించుకు పోయిన దొంగలను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు శనివారం తరలించారు. తల్లిదండ్రులు జైలుకు వెళ్లడంతో నలుగురు చిన్నారులు ఒంటరయ్యారు. వీరిని అనాధాశ్రమానికి తరలించనున్నారు. శామీర్‌పేట ఠాణాలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామానికి చెందిన చెవ్వ రాములమ్మ(68) ఇంటికి ఈనెల 18న వనరాసి నర్సింహా-జ్యోతి దంపతులు నలుగురు పిల్లలతో వచ్చారు. ఫినాయిల్ అమ్ముకుని జీవిస్తామని, ఇల్లు అద్దెకు కావాలంటే రాములమ్మ ఇల్లు అద్దెకు ఇప్పించింది. వృద్ధురాలు 7తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి నగలు ధరించినట్లు గుర్తించారు. ఈనెల 23న తమ కుమార్తె పుట్టిన రోజు ఉందని రాములమ్మను ఆహ్వానించి మద్యం తాగించి హత్య చేసే ప్రయత్నం చేసి బంగారం, వెండి నగలతో పారిపోయారు. నగలు బలవంతంగా తీస్తుండగా వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. దొంగతనానికి పాల్పడిన వనరాసి నర్సింహా(45), జ్యోతి(36)లను తూంకుంటలో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5తులాల బంగారు గొలుసు, 2 ఉంగరాలు, 4జతల చెవి కమ్మలు, 30తులాల వెండి పట్టీలు, రెండు ద్విచక్రవాహనాలు, మూడు చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ నర్సింహా, ఎస్సై పరశరామ్ పాల్గొన్నారు.